Deccan Land

Deccan

JAN

JAN 2026



జనవరి - 2026

PRGI Regn. No. TELTEL/2012/46784

₹30

సంపుటి : 14

సంచిక : 5

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

DECCAN LAND, HYDERABAD

161

JANUARY - 2026



VOL 14వ వసంతంలో

161 ISSUES నూట అరవై ఒకటవ సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



- అస్మక జనపదరాజధాని పోతలి
- టైటానియం మూలకం యొక్క ఖనిజాలు
- రాచిప్పల పచ్చిపులుసు
- వైక్రాంతమణి - టూర్మలిన్



# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

### తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com




## UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2025

**Serial Nomination for Geological Heritage of St' Mary's Island Cluster**
**Udupi, Karnataka State, Province or Region India:**

**Category: Natural**

## సెయింట్ మేరీస్ దీవులు

సెయింట్ మేరీస్ ఐలాండ్స్ అనేది దీవులు కోకోనట్ ఐలాండ్, నార్త్ ఐలాండ్, దర్యా బహదూర్‌గఢ్ ఐలాండ్, సౌత్ ఐలాండ్ అనే నాలుగు చిన్న దీవుల సమూహం. ఇవి కర్నాటక పశ్చిమ తీరంలోని ఉడిపి జిల్లాలోని మాల్పే నుండి దాదాపు 6 కి.మీ. దూరంలో ఉన్నాయి. కోకోనట్ ఐలాండ్ – నార్త్ ఐలాండ్ మధ్య ఏర్పడిన 'మిడిల్ రాక్' అని వ్యవహరించే గుండ్రని రాతి సమూహం కూడా సెయింట్ మేరీస్ దీవులలో భాగం. కోకోనట్ ఐలాండ్ శిలలు బసాల్ట్ మూలాల అద్భుతమైన, సున్నితమైన స్తంభాకార జాయింట్స్‌తో ఉంటాయి. ఇవి భారత ఉపఖండం సుమారు 85 మిలియన్ సంవత్సరాల క్రితం మడగాస్కర్‌తో ఆనుకొని ఉన్నప్పుడు ఏర్పడ్డాయని విశ్వసిస్తారు. ఇవి ప్రకృతిలో చాలా అరుదైనవి. భారతదేశంలో మరెక్కడా లేనంత అందమైన, ఆకట్టుకునే అగ్నిశిలా నిర్మాణాలలో ఇది ఒకటి.

*ప్రత్యేక వ్యాసం : 29వ పేజీలో*

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## పర్యావరణ సమతుల్యత

ప్రతి అంటువ్యాధికి లేదా మహమ్మారులకు వాటిదంటూ ఒక క్రమం, చరిత్ర కూడా ఉంటుందని రచయిత సీతారాం దక్కన్‌ల్యాండ్ డిసెంబర్ మాసంలో రాసిన 'మహమ్మారులూ – మహావ్యాధులూ : పర్యావరణమూ' అనే వ్యాసంలో బొంబాయిలో ప్రబలిన బ్యుబోనిక్ ప్లేగు వ్యాధి గురించి, పర్యావరణం గురించి తెలిపారు. ప్లేగు వ్యాధి కంటే ముందు రెండుసార్లు పశ్చిమ భారతంలో అంటువ్యాధులు ప్రబలినట్లు, వాటి నివారణ, అనేక పరిశోధనలు, శాస్త్రవేత్తల కృషి ఫలితంగా ప్లేగు వ్యాధికి వ్యాక్సిన్ తయారీ గురించి బాగా వివరించారు. పర్యావరణ సమతుల్యత లోపించడం వల్లనే అనేక వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వీటికి కారణం నానాటికీ వ్యర్థాలు పోగుపడడం, కాలుష్య కారకాలు విపరీతంగా పెరగడం. ఏ చెత్త కుప్ప నుండి ఎటువంటి మహావ్యాధి విస్ఫోటిస్తుందో తెలియదు. కాబట్టి శాస్త్ర విజ్ఞానం అందించిన నైతిక బాధ్యతను నిర్వర్తిదిద్దాం. ప్రతినోటా, ప్రతి ఇంటా పర్యావరణ సమతుల్యత పెరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందులో అందరం భాగస్వాములు అవుదాం.

– ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం

❖ ❖ ❖

## పౌరాణిక ప్రదేశం లేపాక్షి

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి గ్రామంలోని శ్రీ వీరభద్ర ఆలయాన్నే లేపాక్షి ఆలయం అంటారు. లంకాధ్యుడఊ రావణుడు శ్రీరాముడి భార్య సీతను తీసుకెళ్తున్న సమయంలో జరిగిన పోరాటం తర్వాత గాయపడిన జటాయువు పక్షి ఇక్కడ పడిపోయిందని, అప్పుడు రాముడు ఆ పక్షిని చూసి కరుణతో "లే పక్షి' అని అన్నాడని, అలా లే పక్షి లేపాక్షిగా వ్యహారికంలో మారిందని తెలుస్తుంది. ఇలాంటి చరిత్ర గల కట్టడాలను యునెస్కో గుర్తించడం

– బి.ఆర్. భార్గవ్, అనంతపురం

## మానవ మేధస్సు అమోఘం

తెలంగాణా ప్రాంతంలో 'జియోగ్లిఫ్స్' గురించి రచయిత, స్థపతి ఈమని శివనాగిరెడ్డి చక్కగా రాశారు. మనం ఎఐ టెక్నాలజితో ఆధునిక యుగంలో ఉన్నా ఆదిమానవుని ఆలోచనలు అమోఘం. ప్రకృతితో జీవనయానం సాగిస్తూ, పాతరాతియుగం నుంచి సూక్ష్మరాతియుగానికి అక్కణ్ణించి కొత్తరాతియుగంలో జీవన విధానానికి పెను విప్లవ మార్పులు తీసుకొచ్చాడు. జంతువులకంటే తాను మిన్న అని లోహంతో స్నేహం చేశాడు. పెరుగుతున్న అవసరాలకు సృజనకు పదును పెట్టాడు. శిలాయుగంలో పురుడు పోసుకున్న చిత్రకళకు పట్టంకట్టి, ఇనుము లోహంతో అడవులు నరికి వ్యవసాయాన్ని విస్తరించి ప్రకృతి, పశువులపై పై చేయి సాధించాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు తెర లేపాడు. వివిధ రకాల సమాధి కట్టడాలను నిర్మించి ఆ సమాధులు పక్కన నిలువురాళ్లు పాతాడు. దక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ వారి పరిశోధనలో బయల్పడిన మూడుమాల్ నిలువురాళ్లు అలాంటివే అనుకుంటా. ఇనుప యుగపు మానవులు, శిలాయుగపు రాతి కళను కొనసాగిస్తూ తమ ఆలోచనలకు తగ్గట్లు వివిధ ఆకారాలను తీర్చిదిద్దారు.

సూక్ష్మరాతి యుగంలో రాతి పనిముట్లతో తయారైన కళాకృతుల్ని జియోగ్లిఫ్స్ అంటారు. కొంకణ తీరంలో మనుషులు, జంతువులు, రకరకాల డిజైన్లున్న వందలాది జియోగ్లిఫ్‌లు ప్రపంచ పురావస్తు శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షించడం ఆశ్చర్యం. అలాంటివే మన హైదరాబాదు నగర శివారులోని జినోంవ్యాలీకి దగ్గర్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లిలో ఒక చిన్న సైజు కొండపై 3000 సం॥ నాటి ఇనుపయుగపు మానవుల కళాత్మకంగా వలయాకరంలో జియోగ్లిఫ్‌ను పరిశీలించినట్లు తెలిపిన రచయితకు ప్రత్యేక కృతజ్ఞతలు. పురావస్తు వారు పరిశోధిస్తే ఇలాంటివి ఎన్నో బయటపడుతాయి. ఎఐ, చాట్‌జీపీటి లాంటి ఎంత టెక్నాలజీ వచ్చినా మానవుని మేథస్సు ముందు తక్కువే. వాటికి కోడింగ్ లాంటివి ఇవ్వవల్సింది కూడా మానవుడే. రోబోటిక్ లాంటి టెక్నాలజీలన్నీ కూడా మానవుని ఆలోచనలో పుట్టినవే. రచయిత రాతియుగపు కాలంలో, లోహయుగపు కాలంలో, ఆధునిక కాలంలో జరిగిన కళా నైపుణ్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

– ఎం. మురళీ కృష్ణ, హైదరాబాద్ ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 14 సంచిక : 5 పేజీలు : 60

జనవరి - 2026

సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

వాణిజ్య ప్రకటనలు

**కె. సచిన్**

86866 64949

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

కవర్‌పేజీ

**సెయింట్ మేరీస్ దీవులు**

layout - Composing & Printed @

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

Mobile: 90599 50055

deccanpress.hyd@gmail.com

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ
29వ పేజీలో

మీరాబెన్ మార్గంలో
వ్యర్థాల నిర్వహణ?




పంజాబీల పవిత్ర
లోహ్రి (భోగి)



చరిత్రను వొడిసి పట్టిన రచయిత: కొంపెల్లి వెంకట్ గౌడ్ ................ ఎసికె. శ్రీహరి ........................ 6
తెలంగాణ సాంస్కృతిక గడ్డమీద పుస్తకాల జాతర.. (ఎడిటోరియల్) వేదకుమార్. యం ........................ 7
వైక్రాంతమణి-టూర్మలిన్ ........................ చకిలం వేణుగోపాలరావు ........................ 9
సంక్రాంతి: పంటల పండుగ! ........................ కొత్వాల్ సచిన్ ........................ 12
రాచిప్పల పచ్చిపులుసు ........................ పరవస్తు లోకేశ్వర్ ........................ 13
తెలంగాణలో ఇనుపయుగంలోనే గుర్రపుస్వారీ! ................. ఈమని శివనాగిరెడ్డి-స్థపతి ............. 17
తెలంగాణ గిరిజన క్షేత్రాలు-జాతర పుస్తకావిష్కరణ ........................ సయ్యద్ ఖైజర్ ........................ 18
మీరాబెన్ మార్గంలో వ్యర్థాల నిర్వహణ? ........................ డా॥ ఆర్. సీతారామారావు ............. 19
క్వాంటం టన్నెలింగ్..!! ........................ పుట్టా పెద్ద ఓబులేసు ........................ 21
జ్ఞానజ్యోతి సావిత్రీబాయి పూలే ........................ ఎసికె. శ్రీహరి ........................ 25
టైటానియం మూలకం యొక్క ఖనిజాలు ........................ కమతం మహేందర్‌రెడ్డి ............. 27
నిలువు శిలల అద్భుతం సెయింట్ మేరీస్ దీవులు ........................ ఎన్. వంశీ మోహన్ ........................ 29
గండికోట వారసత్వ ఉత్సవాలు..!! ........................ పుట్టా పెద్ద ఓబులేసు ........................ 33
తెలంగాణలో పర్యాటక రంగాన్ని ఎలా ప్రమోట్ చేయాలి ............. డా॥ వనజ ఉదయ్ ........................ 35
చేతివ్రాతను మరువద్దు ........................ జుగాష్‌విలి ........................ 36
పోర్చుగీసులు (1498-1665) ........................ మహమ్మద్ సిలార్ ........................ 37
పంజాబీల పవిత్ర లోహ్రి (భోగి) ........................ దక్కన్ న్యూస్ ........................ 40
ద్వారకనాథ్ గంగూలీ ........................ డా॥ నాగసూరి వేణుగోపాల్ ............. 41
దక్కన్ రేడియో / భాగ్యనగర్ రేడియో ........................ డా॥ జి.యస్. రామయ్య ............. 43
అస్మక జనపద రాజధాని పోతలి ........................ శ్రీరామోజు హరగోపాల్ ............. 45
గతితప్పుతున్న భూభ్రమణం! ........................ డా॥ లచ్చయ్య గాండ్ల ............. 48
మునగ.. లాభాల సిరి! ........................ బాలారణ్య ........................ 51
'బాలల రచనల దునియా' ........................ గరిపెల్లి అశోక్ ........................ 53
బాలచెలిమి కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం ............. గరిపెల్లి అశోక్ ........................ 56
పూటకూళ్ళవ్వ (కథ) ........................ మాదారపు వాణిశ్రీ ........................ 57

**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

## చరిత్రను వొడిసిపట్టిన రచయిత!

# కొంపెల్లి వెంకట్ గౌడ్

రచయిత, ఉద్యమకారుడు, చరిత్ర పరిశోధకుడు కొంపెల్లి వెంకట్ గౌడ్. వీరు 'వొడువని ముచ్చట', 'నీళ్ల ముచ్చట' రచనలకుగాను గుర్తింపు పొందాడు.

ఉమ్మడి నల్గొండ జిల్లా (ప్రస్తుతం సూర్యాపేట జిల్లా), మునగాల మండలం, కలకోవ గ్రామంలో అంతమ్మ, లింగయ్య దంపతులకు మొదటి సంతానంగా (1973, మార్చి 15) జన్మించిన వెంకట్ గౌడ్ పదమూడేండ్ల వయసు వరకు గ్రామంలోనే ప్రాథమిక విద్యను అభ్యసించాడు. ఆ తర్వాత తాతతో పాటు నల్లగొండకు వచ్చి అక్కడే చదువుకున్నాడు. నల్గొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశాడు. డిగ్రీలో నోముల సారు ప్రోత్సాహం, సహాయం, సహకారాలతో సాహిత్యంవైపు మొగ్గిండు.



విద్యార్థి దశలో ఉన్నపుడు నల్గొండలో జరిగిన నీలగిరి సాహితీ సమావేశాల ప్రభావంతో కవిత్వం రాశారు. ప్రత్యేక తెలంగాణ, బహుజన చైతన్యమే లక్ష్యంగా పలు రచనలు చేశాడు. ఆ క్రమంలోనే సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర రాశాడు. ఆయన బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్, నోముల సత్యనారాయణ, ప్రొ. జయశంకర్, ఆర్. విద్యాసాగర్ రావుల జీవిత చరిత్రలు, ఆత్మ కథలపై నాలుగు పుస్తకాలు తెచ్చారు. ఆయన రచించిన ముఖ్యమైన గ్రంథం సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రపై పరిశోధనా రచన. సర్వాయి పాపన్న స్వగ్రామం ఖిలాషాపూర్ పరిసర ప్రాంతాల్లో తిరిగి, ముసలి ముతకతో ఇంటర్వ్యూలు చేసి, పాపన్నకు సంబంధించిన శిథిలావస్థలో ఉన్న కట్టడాలను ఫోటోలు తీసి పుస్తకాన్ని తీసుకొచ్చాడు. అప్పటి నుంచే సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర బాహ్యప్రపంచానికి తెలిసింది.

సాహిత్య మర్మాలు, పదాల యొక్క మూలాలు, మనుషుల యొక్క స్వభావాలు, కవుల లౌల్యాలు, రచయితల లాలూచీ, మిత్రుల మద్యపాన బలహీనతలు, చరిత్రపట్ల మక్కువ, ఓటర్ల చైతన్యం పట్ల ఆసక్తి ఇట్లా అన్నింటి గురించి తెలిసిన మానవత్వమున్న మనిషి. తన బలం, బలహీనత అన్నీ తెలిసినవాడు కావడంతో ప్రతి విషయాన్ని అధ్యయనం చేసి అందించేవాడు. విమర్శించాల్సి వచ్చినప్పుడు ఎవ్వరినీ లెక్క చేసేవాడు కాదు. ఖుల్లం ఖుల్లంగా విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పేవాడు.

తను నిరంతరం ప్రజల కోసం పరిశోధనలు చేస్తూ, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా తమ స్థాయిని మించి పని చేసి, తామే ఊహించి ఫలానా పనులు చేయాలనుకుని వాటిని సాకారం చేసిన వారు. ఆయన తెలంగాణ వాదం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం నిరంతరం తపించిన నిఖార్సయిన ఉద్యమకారుడు . ఆయన కొన్ని విషయాల్లో పలు విమర్శలకు గురయినప్పటికీ తనదైన పంథాను మార్చుకోకుండా చివరి వరకు అదే ఒరవడితో ముందుకు సాగాడు.

వెంకట్ గౌడ్ తన గౌడ కులంపై అత్యంత ప్రేమను ప్రకటించేవాడు. 'ముస్తాదులు కదులుతున్నాయి' అనే కవితలో వారిపై ఉన్న ప్రేమను ఇలా తెలిపాడు.

*"మొలకు ముస్తాదు కట్టి*<br>
*చెట్టుకు మోకేసి*<br>
*బతుకులో ఒక్కొక్క ఆశ*<br>
*ఒకొక్కక్క అంగై పాకుతూ రక్తం ముద్దవుతున్నాం*<br>
*మెట్టు తాడు మీద ఆగి*<br>
*గీసక్తి నూరుకొని*<br>
*గెలల్లో కల్లువూటని తడుముకొని*<br>
*మెరల్ని తీసి*<br>
*రేపటికి పదును పెడతాం*<br>
*మా పటవలోని కల్లులో*<br>
*ఆ రోజు జీవితాన్ని చూసుకుంటాం*<br>
*గాలి దుమారం...*<br>
*ఉరుముల జడిలో*<br>
*చెట్టు కూలిన చప్పుడేమోగాని*<br>
*వెంకయ్య తాతే ఫెళ్ళున విరిగిపడ్డ శబ్దం*<br>
*ఆకాశంలో మృత్యువుతో యుద్ధం చేసే కులవీరులం మేము"*

అంటూ గౌడన్నల వెతలను, ధిక్కారాన్ని ఈ కవితలో లెక్కగట్టిండు.

'సర్వాయి పాపన్న చరిత్ర' బడుగువర్గాల ఆత్మగౌరవాన్ని, రైతు ఉద్యమాల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. గౌడన్నలకు సంబంధించిన సంఘటనలతో పాటు, తెలంగాణ గ్రామీణ ప్రజల

*(మిగతా 8వ పేజీలో)*




# తెలంగాణ సాంస్కృతిక గడ్డమీద పుస్తకాల జాతర

తెలంగాణా ప్రజాజీవితంలో సామూహిక స్వభావానికి అవధులు లేవు. అలాయి బలాయికి తెలంగాణ పెట్టింది పేరు. తెలంగాణ సమాజపు సాంస్కృతిక జీవితంలో అనేక జాతరలున్నాయి. ప్రతి రెండేళ్ళకోసారి ఐదు రోజులపాటు జరిగే ఆసియాలోనే అతిపెద్ద గిరిజన, ఆదివాసీ జాతర లక్షలాది మందితో కిటకిటలాడే మేడారం సమ్మక్క సారలమ్మ ఇంకా జంగుబాయి, నాగోబా, కొమరవెల్లి, ఏడుపాయల జాతర, కొండగట్టు జాతర, సళేశ్వర జాతర అతి ముఖ్యమైనవి. ఈ జాతరలన్నీ చారిత్రక వారసత్వ సంబరంబాలే. సాంస్కృతిక వారసత్వ సంపదలే.

ఇది 38వ పుస్తక ప్రదర్శన సందర్భం. సాహిత్యం వారసత్వ సంరంబం. ఈ పుస్తకాల ప్రదర్శనని ఆ జాతరలతో పోల్చడం సరైనదో కాదో కాని ప్రజలందరూ ఆయా జాతుల కోసం ఎలా ఎదురు చూస్తుంటారో డిసెంబర్ వస్తే చాలు ఈ పుస్తక ప్రదర్శన కోసం అలా ఎదురు చూస్తుంటారనడంలో సందేహం లేదు. ఇక ముందు ముందూ ఈ పుస్తక ప్రదర్శనలు కూడా ప్రజల జీవితంలో విడదీయలేనంత ముఖ్యమవుతాయి. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆ కార్యక్రమాలను తమవిగా భావించి తదాత్మ్యయం పొందుతారో దానినే పండుగ అని, జాతర అని పిలుస్తున్నాం. లక్షల్లో హాజరవుతూ తమ భావోద్వేగాలకు, ఆకాంక్షలకు ఆలంబనగా భావించి తదాత్మ్యయం పొందుతున్న ఈ పుస్తక ప్రదర్శనలను పుస్తకాల జాతర అనడంలో అనౌచిత్యం లేదు.

మనుషులు తమ మనుగడకోసం అనేకం సృష్టించుకుంటూ ఉంటారు. వాటిలో ఉత్తమమైనదీ పుస్తకం. పుస్తకం గురించి, దాని ప్రయోజనం గురించీ ప్రపంచ మేధావులు చెప్పిన విషయాలన్నీ ఒకచోట చేరిస్తే కొన్నివేల పేజీల గ్రంథమవుతుంది.

ఈసారి పుస్తక ప్రదర్శనకు యువతరం పెద్ద సంఖ్యలో హాజరైంది. యువతరం పబ్లిషర్స్, ఏడెనిమిది మంది మహిళా పబ్లిషర్లు, రచయితలూ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం, అభివందనీయం. ఈ ప్రత్యేక స్టాల్స్ వద్ద యువతరం గుమికూడి సందడి చేస్తూ పుస్తకాలు బాగానే కొన్నారు. ఫిక్షనూ – నాన్ ఫిక్షనూ పోటీపడి అమ్ముడయ్యాయి.

అంతా బాగానే ఉంది. సంతోషంగానే ఉంది. అయితే యువతరం ఏ పుస్తకాలు కొన్నారు? కెరీర్ పెంచే కాంపిటీషన్ పుస్తకాలు కొన్నారా? ఫన్నీ పుస్తకాలు కొన్నారా? లేదా మస్తిష్కాన్ని శుద్ధిచేసి, పదునుపెట్టే, జీవితం పట్ల అవగాహన పెంచే మానవ హృదయాలను మానవీకరించి సదా తడిగా వుంచగలిగే పుస్తకాలను కొన్నారా? అనేది ముఖ్యం. అమ్మకాలకీ, ప్రయోజనాలకీ యిదే గీటురాయి.

*'Artists are the Engineers of the Human Soul'* అన్నారు మేధావులు. పబ్లిషర్లూ, పాఠకులూ ఈ వాక్యాన్ని గమనంలోకి తీసుకుంటే...

మంచి పుస్తకాలు వస్తాయి
మంచి పాఠకులు వస్తారు
మంచి సమాజం నిర్మితమవుతుంది
పుస్తకాల జాతరకు జేజేలు..

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

*(6వ పేజీ తరువాయి)*

కష్టాలు, సామాజిక అన్యాయాలు, ఉద్యమ చైతన్యాన్ని సాహిత్య రూపంలో తదుపరి తరాలకు అందించారాయన. కొంపల్లి వెంకట్ గౌడ్ రచనలు సాంకేతికంగా, పరిశోధనాత్మకంగా ఉంటాయి. ప్రతీ గ్రంథంలో నిజ జీవిత సంఘటనలకు ఆయన ప్రాధాన్యమిస్తారు. పాఠకులకు తాత్కాలిక వినోదం మాత్రమే కాకుండా ఆలోచనాత్మక తృప్తిని అందిస్తారు. తెలంగాణ ఉద్యమ చైతన్యం, ప్రజల ఆత్మగౌరవం, భూమి-నీటి సమస్యలు, గ్రామీణాభివృద్ధి, సామాజిక సమానత్వం, బడుగువర్గాల సమస్యలపై ఆయన రచనలు అవగాహన కల్పించాయి.

ఆంధ్రాధిపత్యం ఏ రూపంలో ఉన్నా ధిక్కరించిన ఉద్యమజీవి. దృఢ సంకల్పంతో తెలంగాణ హక్కుల కోసం కొట్లాడిండు. ఉద్యమ యోధుల యాదిని చరిత్రగా రికార్డు చేసిన బయోగ్రాఫర్ కొంపెల్లి వెంకట్ గౌడ్. చరిత్రను బహుజన దృష్టి కోణంతో వెలుగులోకి తేవాలని గత రెండున్నర దశాబ్దాలుగా తపన పడ్డాడు. కవిగా మొదలయిన వెంకట్ గౌడ్ జీవితచరిత్ర కారుడిగా రాటుదేలిండు.

హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌లో ఉంటున్న వీరు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతూ 2025 సెప్టెంబర్ 25న తుదిశ్వాస విడిచారు. వీరి మరణం తెలంగాణ సాహిత్య, ఉద్యమ, సామాజిక చరిత్రకు తీరని లోటు.

**కొంపెల్లి వెంకట్ గౌడ్ రాసిన పుస్తకాలు**

- గౌడ్‌ల మీద రాజకీయ సాంస్కృతిక దాడి
- జనం లేని 'విజ్ఞాన' వేదికకు దళిత బహుజనుల నూటొక్క ప్రశ్నలు
- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర
- నోముల సత్యనారాయణ జీవితానుభవాలు "నోముల సర్ అన్‌టోల్డ్ లెసన్స్"
- తెలంగాణ గౌడ్ ఇంటిపేర్లు
- తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్‌తో సంభాషణ "వాడువని ముచ్చట"
- నీటిపారుదల రంగ నిపుణుడు ఆర్.విద్యాసాగర్ రావు ఇంటర్వ్యూ "నీళ్ల ముచ్చట".

– ఎసికె. శ్రీహరి m : 9849930145
e : ackvs08@gmail.com

# అంతరించిపోతున్న పెంగ్విన్ జాతి

పెంగ్విన్‌లు అందమైన ప్రశాంత స్వభావానికి, అందమైన నడకకు , అందమైన రూపాలకు ప్రసిద్ధి చెందిన అందమైన ఎగరలేని పక్షులు. వాటి నివాసం మానవులు నివసించే ప్రదేశానికి దూరంగా ఉంది. అందువల్ల, వాటి గురించి మనకు చాలా తక్కువ తెలుసు. మంచుతో నిండిన భూములలో తమ గుంపుతో నడక సాగించే పెంగ్విన్‌లు మనం చూసే అత్యంత ప్రజాదరణ పొందిన చిత్రాలలో ఒకటి. ఈ జీవులపై అనేక యానిమేటెడ్ సినిమాలు, కార్టూన్లు తీయబడ్డాయి. వాటిలో ప్రతి ఒక్కటి పెంగ్విన్‌ల గురించి మనకు చాలా బోధిస్తాయి. పెంగ్విన్‌లు ప్రధానంగా దక్షిణ అర్ధగోళంలో నివసిస్తాయి. దాదాపు 20 జాతుల పెంగ్విన్‌లు మానవులకు తెలుసు, వాటిలో ఎంపరర్ పెంగ్విన్‌లు అతిపెద్దవి, చిన్నవి. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తీర ప్రాంతాలలో నివసించేవి.



మనిషి స్వార్థం కోసం అడవులు ధ్వంసం కావడమే కాకుండా అనేక జంతువులు, పక్షుల సంతానం క్షీణదశకు చేరుకుంది. వాటిలో పెంగ్విన్ ఒకటి. పెంగ్విన్ అవేర్‌నెస్ డేని ప్రతి సంవత్సరం జనవరి 20వ తేదీన జరుపుకుంటారు. ఇది రెక్కలు కలిగి ఉన్నప్పటికీ తీవ్రమైన ప్రపంచ ఉష్ణోగ్రత కారణంగా ఈ అందమైన పక్షి సంతతి ఎగరలేదు.

## జనవరి 20న పెంగ్విన్ డే

పెంగ్విన్స్ చూడటానికి చాలా అందమైన పక్షులు, ఎక్కువగా అంటార్కిటికాలో కనిపిస్తాయి. ఒక్కో అడుగు వేస్తూ చిన్నపిల్లల్లా వరసగా ఈ పక్షులను చూడటం కనుల పండువగా ఉంటుంది. కానీ నేడు పెంగ్విన్ ప్రమాదం అంచున ఉంది. రోజురోజుకూ వారి సంతానం తగ్గిపోతోంది. విపరీతమైన గ్లోబల్ టెంపరేచర్, వాతావరణ తీవ్రతల కారణంగా రెక్కలు ఉన్నప్పటికీ ఎగరలేని ఈ అందమైన పక్షి సంతానాన్ని రక్షించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 20న పెంగ్విన్ అవేర్‌నెస్ డేని జరుపుకుంటారు.

**పెంగ్విన్‌లు ఎందుకు ముఖ్యమైనవి?**

ఆహార గొలుసు సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా సముద్ర పర్యావరణ వ్యవస్థలో పెంగ్విన్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి క్రిల్, స్క్విడ్, ఇతర చేపలను తింటాయి. సముద్ర జీవులను నియంత్రించడంలో సహాయపడతాయి. కానీ నేడు ఈ పక్షులు వాతావరణ మార్పులు, అధిక చేపల వేట, నివాస విధ్వంసం కారణంగా అంతరించిపోతున్నాయి.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com



# వైక్రాంతమణి–టూర్మలిన్

పెద్ద పెద్ద స్ఫటికాలుగా అనేకరంగులలో దొరికే ఆకర్షణీయ రత్నం టూర్మలిన్ (Tourmaline).

ఈ పేరు సింహళ పదం "తోరమల్లి" (toramalli) లేదా "తురమాలి" (turamali) నుండి వచ్చింది. శ్రీలంకలోని రత్నాల వ్యాపారులు ఈ పదాన్ని మొదట ఉపయోగించినా, ఆ తర్వాత డచ్ వ్యాపారులు ద్వీపంలోని గనులలో దొరికే బహుళ వర్ణరత్నాలకు అదే పేరు వాడారు. వాస్తవానికి, ఈ పదం శ్రీలంక నుండి ఎగుమతి చేయబడిన రత్నాల,వివిధరకాల రాళ్ల మిశ్రమాన్ని వివరించడానికి ఉపయోగించబడింది, కానీ చివరికి ఈ పేరు ఆకర్షనీయంగా రంగులను ప్రదర్శించే టూర్మలిన్ ఖనిజాల సమూహానికి స్థిరపడింది.

పురాతన ఈజిప్షియన్లు ఈ రత్నాలు ఇంద్రధనుస్సు గుండా ప్రయాణించి, భూమి ఉపరితలానికి వచ్చే మార్గంలో తమ బహుళవర్ణశోభను పొందాయని నమ్మేవారు, దీనివల్ల భౌతిక మరియు భావోద్వేగ ఉపశమనానికి వాటికి శక్తులు ఉన్నాయని నమ్మేవారు.

దూరప్రాచ్యం మరియు మధ్య ఆసియాలో, టూర్మలిన్ వైద్య మరియు ఆధ్యాత్మిక సంప్రదాయాలలోకి ప్రవేశించింది, కళాత్మక వ్యక్తీకరణ, సృజనాత్మక ఆలోచన మరియు మొత్తం శక్తి సమతుల్యతను ద్విగుణీకృతం చేసే రత్నంగా పరిగణించబడింది. టూర్మలిన్ ఆఫ్రికా, దక్షిణ అమెరికా మరియు యురేషియా అంతటా పురావస్తు ప్రదేశాలలో కూడా కనుగొనబడింది, వీటిని ఆచార ఆభరణాలలో, భక్తి వస్తువులలో, అలాగే విలాసవంతమైన ఆభరణాలలో వాడారు. అయితే, 18వ శతాబ్దం ప్రారంభంలో డచ్ వ్యాపారులు దీనిని ఇతర రంగురాళ్ల నుండి ప్రత్యేకమైన జాతిగా గుర్తించి ఐరోపాకు పరిచయం చేయటంవల్ల దీనికి ప్రాముఖ్యత వచ్చింది.

**ఖనిజ వివరాలు:**

టూర్మలైన్ అనేది ఒకే ఖనిజం కాదు, బోరాన్ సిలికేట్ ఖనిజాల యొక్క సంక్లిష్ట సమూహం. ఇది అత్యంత వైవిధ్యమైన రసాయన కూర్పుతో ఐసోమోర్ఫిక్ సిరీస్‌ను ప్రదర్శిస్తుంది. దీని ప్రాథమిక నిర్మాణం ఆరు కారకాలు కలిగిన రింగ్ సిలికేట్, ఇంకా అల్యూమినియం, మెగ్నీషియం, ఇనుము, సోడియం, లిథియం లేదా పొటాషియం వంటి అణువులు దాని లాటిన్‌లో ప్రత్యామ్నాయంగా ఉండవచ్చు. సాధారణ రసాయన ఫార్ములా: $XY_3Z_6 (T_6 O_{18}) (BO_3) 3V_3 W$. ఇక్కడ X, Y, Z వంటి మూలకాలు Na, Ca, Al, Fe, Mg, Li, Mn మొదలైన వాటిని సూచిస్తాయి.

టూర్మలైన్ స్ఫటికాలు సాధారణంగా పట్టకాల్లా (pris-

matic), నిలువుగా గీతలు కలిగినవిగా (vertically striated) ఉంటాయి. ఇవి సూక్ష్మకణాల నుండి అద్భుతమైన బహుళ-సెంటీమీటర్ల కొలతలలో ఉండే పెద్ద స్ఫటికాలుగా ఉంటాయి. మోహ్స్ స్కేల్‌పై దీని కాఠిన్యం 7 నుండి 7.5, ఉండి ఆభరణాలకు అనుకూలంగా ఉంటుంది.

**టూర్‌మలైన్ రకాలు :**

వైవిధ్యం అనేది టూర్‌మలైన్ యొక్క ప్రత్యేక లక్షణం, ఇది వాస్తవంగా అన్ని రంగులో కనిపిస్తుంది:

**స్కార్ల్ (Schorl):** నలుపు రంగులో, సర్వసాధారణమైన రకం, ఇనుము ఎక్కువగా ఉంటుంది.

**ఎల్బైట్ (Elbaite):** గులాబీ, ఆకుపచ్చ (వెర్డెలైట్), నీలం (ఇండికోలైట్), ఎరుపు (రుబెల్లైట్), మరియు రంగులేని (అక్రోయిట్) రంగులతో సహా రంగుల శ్రేణిని ప్రదర్శిస్తుంది.

**డ్రావైట్ (Dravite):** గోధుమ రంగు, మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది.

**యువైట్ (Uvite):** ముదురు ఆకుపచ్చ రంగు, మెగ్నీషియం లేదా ఇనుముతో కూడి ఉంటుంది.



**లిడ్డికోటైట్ (Liddicoatite):** కాల్షియం అధికంగా ఉంటుంది, కొన్నిసార్లు రంగుల "పుచ్చకాయ" వంటి జోనింగ్‌ను ప్రదర్శిస్తుంది. ట్రేస్ ఎలిమెంట్ కెమిస్ట్రీ వల్ల, వర్ణపటం రంగులు ఏర్పడుతాయి. స్ఫటికాలు సాధారణంగా అద్భుతమైన వర్ణాల "జోనింగ్" (Zoning)ను ప్రదర్శిస్తాయి-అంటే ఒకే స్ఫటికం ఒక చివర నుండి మరొక చివరకు క్రమంగా లేదా నాటకీయంగా రంగును మార్చుకుంటుంది.

**అత్యంత విలువైన టూర్మలిన్ రకాలు:**

**పరైబా టూర్‌మలైన్ (Paraíba tourmaline):** రాగి ద్వారా రంగు సంతరించుకున్న ప్రకాశవంతమైన నియాన్ నీలం నుండి ఆకుపచ్చ రంగులో ఉంటుంది, ఇది మొదట బ్రెజిల్‌లో కనుగొనబడింది.

**పుచ్చకాయ టూర్‌మలైన్ (Watermelon tourmaline):** పుచ్చకాయ లోపలి భాగంను పోలి ఉండే గులాబీ కేంద్రాలు మరియు ఆకుపచ్చ అంచులను కలిగిఉంటుంది.

టూర్మాలిన్ ప్రధానంగా అగ్ని మరియు రూపాంతర శిలలు (igneous and metamorphic rocks), ముఖ్యంగా పెగ్మాటైట్లలో (pegmatites) కనిపిస్తుంది.

**ప్రధాన భౌగోళిక విన్యాసాలు (Main Geological Formations):**

**పెగ్మాటైట్లు (Pegmatites):** టూర్మాలిన్ ఏర్పడటానికి ఇది అత్యంత సాధారణమైనవి.

గ్రానేట్ (granite) వంటి శిలాద్రవం (magma) చల్లబడే చివరి దశలలో, బోరాన్ (boron), లిథియం (lithium) వంటి మూలకాలు సమృద్ధిగా ఉన్న వేడి ద్రవాలు (hydrothermal fluids) ఏర్పడతాయి. ఈ ద్రవాలు చుట్టుపక్కల ఉన్న పగుళ్లు, ఖాళీలలోకి ప్రవేశించి, నెమ్మదిగా చల్లబడతాయి. ఈ ప్రక్రియలో పెద్ద, చక్కటి ఆకృతి గల టూర్మాలిన్ స్ఫటికాలు ఏర్పడతాయి. రంగురంగుల, రత్న-నాణ్యత కలిగిన టూర్మాలిన్లు (ఉదాహరణకు, ఎల్బైట్, పారైబా) ఇక్కడే లభిస్తాయి.

**రూపాంతర శిలలు (Metamorphic Rocks):** టూర్మాలిన్ రూపాంతర ప్రక్రియల ద్వారా కూడా ఏర్పడుతుంది.

షిస్ట్ (schist), నైస్ (gneiss), మరియు సున్నపురాయి (marble) వంటి శిలలలో, బోరాన్ కలిగిన ద్రవాల ప్రవేశం (metasomatism) లేదా అధిక ఉష్ణోగ్రత మరియు పీడనం వద్ద రసాయన మార్పులు జరిగినప్పుడు టూర్మాలిన్ (డ్రావైట్ లేదా స్కార్ల్ రకాలు) ఏర్పడుతుంది.

**హైడ్రోథర్మల్ సిరలు (Hydrothermal Veins):** వేడినీటి ద్రావణాల నుండి క్వార్ట్జ్-టూర్మాలిన్ సిరలుగా కూడా ఏర్పడుతుంది.

**అవక్షేప శిలలు (Sedimentary Rocks):** టూర్మాలిన్ రసాయన శైథిల్యాన్ని (chemical weathering) తట్టుకోగలదు. అందువల్ల, అవక్షేపాలలో మన్నికైన కణికలుగా (durable grains) లభిస్తుంది.

టూర్మాలిన్ ఏర్పడటానికి బోరాన్ లభ్యత మరియు వేడి ద్రవాలు లేదా అధిక ఉష్ణోగ్రత, పీడనం అవసరం.

**భారత దేశంలో టూర్మలిన్:**

భారతదేశంలో, చారిత్రక ఆధారాల ప్రకారం చాలా ప్రాచీనకాలం నుండే టూర్మలిన్ పరిచయం. ముఖ్యంగా శ్రీలంక నుండి రత్నాల కంకర (gem gravels) రూపంలో దిగుమతి చేసుకొని ప్రాచీన దక్షిణ భారతదేశంలో వ్యాపారం చేసేవారు. ఆధునిక కాలంలో, దక్షిణ భారత రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ మరియు కర్ణాటకలోని రత్నాలతో కూడిన మట్టి మరియు పెగ్మటైట్ (pegmatite) ప్రాంతాలలో ఇంకా హిమాలయాల్లో అక్కడక్కడా ఉన్న శిలలలో టూర్మలిన్ నిక్షేపాలు గుర్తించబడ్డాయి.

**ప్రాచీన భారతీయ సాహిత్యంలో టూర్మలిన్**

టూర్మలిన్ సంస్కృతగ్రంథాలలో అక్కడక్కడా "వైక్రాంత" (Vaikranta) అనే పేరుతో ప్రస్తావించబడింది. ఇది 13వ శతాబ్దపు రసవాదగ్రంథమైన ''రసరత్నసముచ్చయం'' లో (Rasaratnasamuccaya) దీనిని పునరుజ్జీవింపజేసే (rejuvenating) లక్షణాలు కలిగిన శక్తివంతమైన ఖనిజంగా వర్గీకరించారు. పురాతన రత్నశాస్త్ర గ్రంథాలు వైక్రాంతాన్ని "ఎనిమిది అంచులు, ఎనిమిది ముఖాలు, ఆరు కోణాలు కలిగిన, నునుపైన, బరువైన మరియు మిశ్రమ లేదా రంగులుమారే లక్షణాలు కలిగిన" రాయిగా



అభివర్ణించాయి, ఇది టూర్మలిన్ ఖనిజలక్షణాలకు సరిగ్గా సరిపోలుతుంది. రంగురంగుల లేదా "ఊసరవెల్లి లాంటి" రత్నాలను వివరించడానికి అప్పుడప్పుడు గంధర్వవంటి ఇతర సంస్కృత పదాలు కూడా ఉపయోగించే వారు.

**వైక్రాంతం:**

'వైక్రాంతః స్ఫటికస్పర్శో ద్విజతుష్టో 'రిహంతకః।
అష్టశృంగో 'ష్టభావాస్య షడంశో 'తి కఠాకఠః॥'

–రసరత్నసముచ్చయం అనే రసశాస్త్రగ్రంథంలో ఉన్న ఈ శ్లోకం

**అనువాదం:** "వైక్రాంతం స్ఫటికంలా తాకగానే చల్లగా ఉంటుంది. శత్రువులను నాశనం చేస్తుంది. ఎనిమిది మూలలు, ఎనిమిది వైపులా, ఆరు కోణాలు కలిగి ఉంటుంది. మరియు చాలా గట్టిగా, బరువుగా ఉంటుంది."

ఆయుర్వేదం మరియు సాంప్రదాయ భారతీయ రసవాదంలో (రసశాస్త్రం), "వైక్రాంతం" ప్రాణశక్తులను పునరుజ్జీవింపజేయడం, బలాన్ని ఇవ్వడం, విషాలకు విరుగుడుగా పనిచేయడం మరియు మనస్సును స్థిరీకరించడం వంటి లక్షణాలను కలిగి ఉంటుందని విశ్వసించేవారు. దీనిని తరచుగా బంగారు పైరైట్ (స్వర్ణమాక్షిక), రియల్‌గర్ (మణిశిల), మరియు అయస్కాంత ఇనుపఖనిజం (కాంత లోహ) వంటి వాటితో పాటు అత్యుత్తమ ఔషధ ఖనిజాలలో ఒకటిగా చేర్చారు. శుద్ధి ప్రక్రియల (శోధన) ద్వారా సన్ననిపొడిగా మార్చబడిన తర్వాత, కొన్నిసార్లు రసాయనాలు మరియు ఎలిక్సిర్‌లలో (elixirs) కలిపి ఉపయోగించేవారు.

**టూర్మలిన్ (వైక్రాంతం)కు ఆపాదించబడినచికిత్సా లక్షణాలు:**

నరాలు మరియు గుండెను బలపరచడం, మానసిక స్థితిని సమతుల్యం చేయడం మరియు ప్రశాంతపరచటం, దీర్ఘకాలిక అనారోగ్యాలకు టానిక్‌గా పునరుజ్జీవనకారిగా పనిచేయడం.

**టూర్మలిన్ లభ్యత:**

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో టూర్మలిన్ (Tourmaline) నిక్షేపాలు గుర్తించబడ్డాయి. అయితే, ఇవి ప్రధానంగా ఖనిజ నిక్షేపాలలో అనుబంధంగా (accessory mineral) లభిస్తాయి, ప్రత్యేకమైన పెద్ద గనులు లేవు.

**ఆంధ్రప్రదేశ్‌లో టూర్మలిన్:** ప్రధానంగా మైకా మరియు లిథియం కలిగిన గ్రానైటిక్ పెగ్మటైట్‌లతో (granitic pegmatites)లో ఉంది.

**కర్నూలు జిల్లాలో:** బస్తీపాడు చెట్లమల్లాపురం, చిన్నకోట్టాల ఉళ్ళిందకొండ, ఎర్రదొడ్డి, లద్దగిరి వంటి ప్రాంతాలలో టూర్మలిన్ కలిగిన ల్యూకోగ్రానైట్ (leucogranite) నిక్షేపాలు ఉన్నాయి. ఇక్కడ టూర్మలిన్ స్ఫటికాలు 11 సెం.మీ. పొడవు వరకు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు జిల్లాలో మైకా గనుల పరిసర ప్రాంతాలలో గార్నెట్, టూర్మలిన్, అపటైట్ మరియు బెరిల్ వంటి అనుబంధ ఖనిజాలతో సాధారణంగా లభిస్తాయి.

విశాఖపట్నం జిల్లాలో కొన్ని ప్రాంతాలలో టూర్మలిన్ గుర్తించబడింది.

**తెలంగాణ:**

**ఖమ్మం జిల్లా:** ఇక్కడ మైకా, కొరండం గార్నెట్ వంటి ఖనిజాలు లభించే ప్రాంతాలలో టూర్మలిన్ కూడా కనిపిస్తుంది.

**మహబూబ్‌నగర్ జిల్లాలో:** ఫెల్డ్‌స్పార్, క్వార్ట్జ్ వంటి ఇతర ఖనిజాల నిక్షేపాలలో భాగంగా టూర్మలిన్ లభ్యమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలలో ఎక్కువగా సాధారణ రకం టూర్మలిన్ (schorl-dravite series) నిక్షేపాలు ఉన్నాయి.

**విదేశాలలో టూర్మలిన్:**

టూర్మలిన్ ఉత్పత్తికి బ్రెజిల్ ఒక ముఖ్య కేంద్రం. ఆఫ్ఘనిస్తాన్, మొజాంబిక్, మడగాస్కర్ ఇంకా అమెరికాలో కూడా రత్నపు గ్రేడ్ టూర్మలిన్లు దొరుకుతాయి.

**పారిశ్రామిక ఉపయోగాలు:**

టూర్మలిన్‌కు ఉన్న ప్రత్యేకతల వల్ల దీనికి అనేక పారిశ్రామిక ఉపయోగాలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్, ఏయిరోస్పేస్ పరికరాలలో, నీటిని శుద్ధిచేసే పరిశ్రమలో, జియోలాజికల్ ఎక్స్ ప్లోరేషన్ పరికరాల్లో వాడుతారు.

–చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# సంక్రాంతి:పంటల పండుగ!

'మకర సంక్రాంతి' పండుగ అందమైన ముగ్గులకు, గొబ్బెమ్మలకు, హరిదాసు పాటలకు, బసవన్నల ఆటలకు, నువ్వుల మిఠాయిలకు, గాలిపటాలు ఎగురవేయటానికి, మరెన్నో సంబరాలకు ప్రసిద్ధి చెందింది. ఈ పండుగను 'పంటల' పండుగ అని, మార్పు తెచ్చే పండుగ అనీ కూడా అంటారు.

మకర సంక్రాంతి యొక్క ప్రాముఖ్యత ఏమిటంటే ఈ రోజు 'గ్రహ రాశి'లో, అంటే సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఒక ముఖ్యమైన కదలిక, అంటే మార్పు ఉంటుంది. ఈ మార్పు మనం ఈ గ్రహాన్ని అనుభూతి చెందే విధానంలో ఒక కొత్త మార్పుని తీసుకువస్తుంది. ఒక సంవత్సరంలో ఎన్నో సంక్రాంతులు ఉంటాయి. వీటిలో రెండు ముఖ్యమైనవి. వాటిలో ఒకటి మకర సంక్రాంతి, రెండవది దీనికి సరిగ్గా ఆరు నెలల కాలంలో, వేసవి కాలపు ఆయనం తర్వాత వచ్చే కర్క సంక్రాంతి. ఈ రెంటి మధ్యా చాలా సంక్రాంతులు ఉన్నాయి – రాశి మారిన ప్రతిసారి దాన్ని సంక్రాంతి అనే అంటారు. ఎందుకంటే అది గ్రహగమనంలో మార్పుని సూచిస్తుంది. ఈ మార్పు కారణంగానే మన జీవితాల పాలన, పోషణలు జరుగుతున్నాయని అర్థం చేసుకోవాలని సంక్రాంతి తెలియజేస్తుంది. డిసెంబరు నెలలో శీతకాలపు ఆయనం వస్తుంది. అంటే సూర్యుని పరంగా చూస్తే ఈ గ్రహం యొక్క వంపు గరిష్టస్థాయికి చేరింది. తర్వాత నుంచి ఉత్తర గమనం చాలా బలంగా ఉంటుంది. భూమి మీద అన్నీ మారటం మొదలు పెడతాయి. మకర సంక్రాంతి నుంచి శీతాకాలం కొద్ది కొద్దిగా తగ్గుముఖం పడుతుంది.



ప్రతి ఏటా మకర సంక్రాంతి జనవరి మాసంలో జరుగుతుంది. పంటలు చేతికొచ్చే సమయం కావడంతో దీనిని రైతులు పండగగా భావిస్తారు. మూడు రోజులు జరిగే ఈ పండగను అత్యంత ఆనందంగా జరుపుకోవడం తెలుగు రాష్ట్రాల్లో ఆనవాయితీగా వస్తుంది. సంక్రాంతిని ఉత్తరాయణగా కూడా పిలుస్తారు. సంక్రాంతి రైతులకు ప్రత్యేక పండగ. పంటలు చేతికి వస్తుండటంతో పశువులను అలంకరిస్తారు. నాగళ్లతో పాటు అనేక వ్యవసాయ పనిముట్లకు కూడా పూజలు నిర్వహిస్తారు. దీంతో పాటు గంగిరెద్దుల విన్యాసాలు కూడా ఈ పండగ వేళ అందరినీ అలరిస్తాయి.

### గొబ్బెమ్మలు.. రంగవల్లులు...

సంక్రాంతి అంటే గొబ్బెమ్మలు.. అందమైన రంగవల్లులు.. పల్లెల్లో అందాలు.. ఇలా ఈ మూడు రోజుల పండగను మాటలతో వర్ణించలేం. దీంతోపాటు శీతల గాలులు చల్లగా పలుకరిస్తాయి. సూర్యుడు ఒక రాశి నుంచి మరొక రాశిలో ప్రవేశించడాన్ని సంక్రమణం అంటారు. మకర సంక్రాంతితోనే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుందని విశ్వసిస్తారు. ఈ కాలంలో చనిపోతే స్వర్గానికి చేరుకుంటామని నమ్ముతారు. స్వర్గద్వారాలు తెరిచే ఉంటాయని భావిస్తారు. దేశమంతా ఈ పండగ జరుగుతున్నప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండగగా పిలుస్తారు. తమిళనాడులో ఈ పండగను పొంగల్ అని పిలుస్తారు. పంజాబ్, హర్యానాలో లోహ్రి అని, మహారాష్ట్ర, గుజరాత్‌లో మకర్ సంక్రాంతి అని అంటారు.

### నెల రోజుల ముందు నుంచే...

నెల రోజుల ముందు నుంచే ప్రారంభమయ్యే ఈ పండగ వేడుకలు ఈ నెల 16వ తేదీతో ముగుస్తాయి. హరినామ సంకీర్తనలతో వీధులన్నీ మారుమోగి పోతాయి. వీటితో పాటు పిండి వంటలు నోరు ఊరిస్తాయి. ప్రతి ఇంట్లో అరిసెలు చేయడం తప్పనిసరిగా కనిపిస్తుంది. పల్లెల్లో ఎక్కువగా ఈ పండగ శోభ కనిపిస్తుంది. వీటికి తోడు ఎడ్ల పందేలు, కోడి పందేలు కూడా ప్రజలను ఆకట్టుకుంటాయి. సంక్రాంతి పండగ రోజు కొత్త బట్టలు ధరించి తల స్నానం చేసి పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి విందుభోజనాలు చేయడం ఈ సంక్రాంతి ప్రత్యేకం.

### మూడు రోజులు ఇలా...

జనవరి 13వ తేదీ భోగిపండగ జరుపుకుంటారు. ఉదయాన్నే ఇంటి ముందు భోగి మంటలు వేస్తారు. పాత వస్తువులను మంటల్లో వేసి పూజలు చేస్తారు. అదే భోగి మంటల్లో పరమాణ్ణం వంటివి వండి ప్రసాదంలా స్వీకరిస్తారు. మరుసటి రోజు అంటే 14వ తేదీ మకర సంక్రాంతిని అందరూ జరుపుకుంటారు. ఈరోజు శబరిమలలో అయ్యప్ప జ్యోతి దర్శనం కూడా లభిస్తుంది. మకర సంక్రాంతి అంటే పెద్ద పండగ. అలాగే 15వ తేదీన కనుమగా చేసుకుంటారు. కనుమ రోజు కాలు కదప కూడదంటారు. ప్రయాణాలు ఎక్కువ మంది చేయరు. అదొక నమ్మకం. కనుమ మరుసటి రోజు ముక్కనుమగా కూడా పిలుస్తారు. ఇలా సంక్రాంతి పండగను మూడు రోజులు చేసుకుంటారు.

– కొత్వాల్. సచిన్,
m : 86866 64949
e: desk.deccan@gmail.com



# రాచిప్పల పచ్చిపులుసు

**రా**చిప్ప అంటే రాతి చిప్ప అని అర్థం. ముప్పై వేల సంవత్సరాలకు పూర్వం పాతరాతి యుగం దాటి కొత్త రాతి యుగంలకు ఆదిమ మానవుడు ప్రవేశిస్తున్నప్పుడు రాళ్లను చెక్కి, సానపట్టి పదునుగా నూరిన వాటిని కత్తులుగా, వేటాడే ఆయుధాలుగా, గుంటలుగా మారిన మిగిలిన రాళ్లను వేట మాంసాన్ని దాచుకునే పాత్రలుగా వాడుకునే వాడు. అవే రాచిప్పలుగా ఉనికిలోకి వచ్చాయి. అప్పటికింకా పశుపోషణ, వ్యవసాయం ప్రారంభం కాలేదు. రాచిప్పలు అట్లా వాడుకలోకి వచ్చి, మా చిన్నతనంల అంటే 75 సంవత్సరాల క్రింద మా వంటింట కూడా కొనసాగాయి. ముప్పై వేల సంవత్సరాల క్రిందటి కాలానికి సాక్ష్యాలుగా, ఆనవాళ్లుగా!

ఆ కాలాన, అయ్యవార్ల ఇండ్లల్ల రకరకాల సైజులలో రాచిప్పలు, మడత మానులు, భూమిల పాతిన రాతి రోళ్లు, రోకళ్లు (అప్పటికింకా మిక్సీలు, గ్రైండర్లు అన్న పదాలు డిక్షనీర్లల్ల రాలేదు) రాతితో చేసిన గుండ్రని "ఇసుర్రాళ్లు" కూడా ఉండేవి. ఆ ఇసుర్రాళ్ల లయబద్ధ సంగీతం మా చిన్న చెవులకు వినసొంపుగా ఉండేది. ఆయుర్వేదం మందులు మెత్తగా నూరటానికి "రాతి కల్వాలు", గంధం తీయటానికి "సాన పీటలు" కూడా ఉండేవి. 1950 చివరి దశకం వరకూ అల్యూమీనియం గిన్నెలు (ఆ ఇంగ్లీషు పదం పలుకరాక సీమెండి గిన్నెలు అనేవారు) ఇత్తడి సామానులు ఉండేవి. ఇత్తడి బిందెలు, గంగాళాలు, కొప్పెరలే కాక రాగి బఫ్కలు (బొగ్గులతో కాచుకునే వేడినీళ్ల సాధనం) 1960 తర్వాత స్టీలు సామానులు వాడుకలోకి వచ్చి వాత బరువుగా ఉండే ఇత్తడి సామానులు వెనుకబడి పోయాయి. నవాబుల కాలం కనుమరుగు కాగానే ఇత్తడి 'పోక కత్తెరలు', పాన్ దాన్‌లు ఒగల్‌దాన్‌లు కూడా మూలబడ్డాయి. "జమానే కే సాత్ సబ్ కుచ్ బదల్ గయా."

రాచిప్పల ముచ్చట్ల కంటె ముందు వాటిని అమ్మే "జుమ్మేరాత్ బజార్" గురించి చెప్పాలె. చెట్టు మీది ఉసిరికాయకు సముద్రంల ఉప్పుకు దగ్గరి సంబంధం ఉన్నట్లు!

ఏడవ నిజాం కాలంల సుమారు 1940ల జుమ్మేరాత్ బజార్ శురూ అయ్యింది. జుమ్మేరాత్ బజార్ అంటే గురువారపు సంత లేదా అంగడి అని అర్థం. బజార్ అన్న పదం ఉర్దూ కూడా కాకపోవచ్చు. చాలా ఉర్దూ పదాలు ఫార్సీ నుండి, అరబ్బీ లేదా తుర్కీ భాష నుండి దిగుమతి అయినవే, తెలుగులోకి సంస్కృత పదాలు వచ్చినట్లు. మధ్య ఆసియా దేశాలలో ఇప్పటికీ ఈ బజార్ అన్న పదం వాడుకలో ఉంది.

ఎనభై సంవత్సరాల క్రింద ప్రారంభమైన ఈ బజార్ ఇప్పటికీ నడుస్తుంది. ఇప్పుడు ఈ విశ్వనగరంలో ఎన్నెన్ని షాపింగ్ మాల్స్ వచ్చినా దీని అందం దీనిదే. అన్ని పాత సామానులు ఇక్కడ "బలే మంచి చౌక బేరము" అన్నట్లు అమ్ముతారు. ఇటు ముస్లిం జంగ్ (అసలు పేరు ముసల్లం జంగ్) పూల్ అటు పురానాపూల్ ఈ రెండింట మధ్య ఒక పెద్ద మైదాన్‌ల ధూల్‌పేట బస్తీకి దగ్గరగ ఈ బజార్ ఉంది. సస్తామాల్‌కు ఆలవాలం ఈ జుమ్మేరాత్ బజార్.

చిన్నప్పుడు మా ఇంటికి ఏ చుట్టమొచ్చినా షాపింగుల కోసం పోయే ఒకే ఒక్క జాగా ఈ జుమ్మేరాత్ బజార్. ఇల్లందు నుండి కన్నయ్య మామ వచ్చినా, మాన్కోట నుండి అప్పయ్య మామ వచ్చినా పొద్దుపొద్దున్నే లేచి ఇత్తడి గిలాసులల్ల కాలుతున్న గరం గరం చాయను "ఉఫ్ ఉఫ్"మని ఊదుకుంట తాగి, సైకిళ్ల మీద ఈ బజార్‌కు పోయేవాళ్లు. అగ్గవ సగ్గవకు బేరాలాడి చాలా సామానులు సైకిలు ఎన్క క్యారేజీకి మూట కట్టుకుని విజయగర్వంతో పగటి యాళ్ల మా ఇంటికి వచ్చేవారు. మొదటిసారి కన్నయ్యమామ నా చిన్న చిన్న పాదాలకు చెమ్కీల చెప్పులు కొన్నది ఈ బజారులనే!

ఇక మా అమ్మ సంగతి సరేసరి. రెండు, మూడు నెల్లకోసారి

చేతిల కొన్ని పైసలు పడంగనే ఖాళీ సంచులతో బయలుదేరేది. ఒక రోజు ముందే ఆ సంగతి నాకు తెలిసిపోయేది. ఇక నా పోరు పడలేక అమ్మ సరే అనేది. ఆ తెల్లారి నాకు ప్రతిరోజు కన్నా పొద్దున్నే తొందరగ మేల్కవచ్చేది. ఆదరబాదరగ వంటబొగ్గు కసపిసా నమిలి, ఆ నల్లబొగ్గుతో పండ్లు తెల్లగ తోమి, కుడి చేతి బొటనవ్రేలితో నాలుకను 'ఒయిక్, ఒయిక్'మని గీసిగీసి కడిగి, ఉడుకుడుకు చాయల క్రిందటి రాత్రి చద్దిరొట్టెను ముంచుకుని తిని, తాగి 'ఆవు వెంబడి దూడలా' బరికాళ్లతో జుమ్మేరాత్ బజారుకు బయలుదేరే వాడిని. అబ్బో ఇగ ఆ ప్రయాణం గురించి చెప్పతరం గాదు.



మేమిద్దరం మా రూప్‌లాల్ బజారు నుండి "గ్యారా నంబర్" బస్సు మీద బయలుదేరే వాళ్లం (కాలి నడక). ఖాజీపూరా చేరే సరికి పెద్ద తాటి తోపుల వనం వచ్చేది. తర్వాత 1962ల అక్కడ ''ఆషాటాకీస్'' కట్టారు. అదిప్పుడు కాలగర్భంలో కనుమరుగయ్యింది. సందుగొందులు, గల్లీలు దాటి ఒక మూల మలుపు తిరిగే సరికి నిజాం నవాబులు కట్టించిన "చౌమహల్లా ప్యాలెస్" జగజ్జేయమానంగా దర్శనమిచ్చేది. అప్పుడు నా పసికండ్లు సంభ్రమాశ్చర్యాలతో పొద్దు తిరుగు పువ్వుల్లా విచ్చుకునేవి. దాని మీదున్న గంటల గడియారం (క్లాక్ టవర్) రాజసం ఉట్టిపడుతూ శీర్షమాణిక్యంలా ప్రకాశించేది. ఆ ఎత్తైన కోటగోడలు, దాని సింహద్వారాలు నన్ను అబ్బుర పరిచేవి. ఆ రాచ వీధిని దాటే సరికి 'ముర్గీ కా చౌక్' వచ్చేది. అది ఆరవ నిజాం కట్టించిన వ్యాపార భవనం. అక్కడ పంజరాలలో బంధింపబడిన రంగు, రంగుల రామచిలకలు, తెల్లపావురాలు, నల్లటి కాకులు, గుడ్లగూబలు, ఊరపిచ్చుకలే గాక అమ్మకానికి ఉడుతలు, కుందేళ్లు, తాబేళ్లు కూడా ఉండేవి. నా కండ్లకు ఆ ప్రాంతం ఒక జంతుప్రదర్శన శాలగా కనిపించేది. ఆ చౌక్‌లో ఖుతుబ్‌షాహీలు కట్టించిన ఒక మసీదు చాలా ఎత్తుగా తంతెల మీద కనిపించేది. ఇటీవల ఆ ముర్గీ కా చౌక్ భవనాన్ని సర్కారు వారు నూతన భవన నిర్మాణం కోసం నేలమట్టం చేసారు. ఆ నాలుగు దారుల కూడలిలో పురాతన గ్రంథాలు విక్రయించే దుఖాణాలు కూడా ఉండేవి. అక్కడ విలువైన అరబ్బీ, ఫారసీ, ఉర్దూ, హిందీ పుస్తకాలు పరిశోధనా విద్యార్థులకు దొరికేవి. వాటన్నింటిని వీక్షిస్తూ ''కసార్ హట్టా''లోకి ప్రవేశించేవాళ్లం. కసార్ అంటే నల్లలోహ విగ్రహాలను తయారు చేసే కళాకారులు. "హట్టా" అంటే స్థలం లేక ప్రాంతం. ఆ వీధి దాటి మరో వీధిలకు వచ్చేసరికి ఒక పెద్ద హనుమాన్‌మందిర్. అందులో ఊడలు విస్తరించిన రావి చెట్టు. 1908ల మూసీ నదికి వరదలు వచ్చి పురానాపూల్ (పాత వాలాద్రి) తెగి సగం పట్నం వరదలల్ల కొట్టుక పోయినపుడు ఆ మందిర్‌లో వున్న భక్తులు ఆ చెట్టు కొమ్మల మీదికెక్కి బతికి బట్టకట్టింద్రని అమ్మ కథలాగ చెప్పింది. ఆ కథ వింటూ ''మెహబూబ్ కీ మెహందీ'లోకి ప్రవేశించాం. నాకు వయసు వచ్చిన తర్వాత దాని ముచ్చట్లు తెలిసాయి. ప్రియురాలి లేలేత తమల పాకుల్లాంటి అరచేతులకు, పసుపు పచ్చని పాదాలకు పెట్టుకునే గోరింటాకు పేరే ఈ 'మహబూబ్ కీ మెహందీ'. నవాబుల కాలంలో అదొక ఖరీదైన వసంత సేనల వేశ్యా వాటిక. దీపాలు వెలిగే పరదాలు తొలిగె అన్నట్లు "షమ్మా"ల చుట్టూ దీవానాలు, పర్వానాలు షలభాల్లా ప్రదక్షిణలు చేసేవారు. సారంగీ, తబలా, డోలక్‌లతో పాటు కాలి అందియల మువ్వల సవ్వడులు రసికులను మరిపించి మురిపించేవి.

''కంటికి దూరమైతే కాలికి దూరమా'' అన్నట్లు నడిచి నడిచి సిటీ కాలేజికి చేరుకునే వారం. ఆ కాలంలో అది హైద్రాబాద్ పట్నానికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లాంటిది. ఒకప్పుడు అక్కడ మగ్దూం మొహియుద్దీన్ ఇంగ్లీష్ లెక్చరర్‌గ పనిచేసేవాడు. కేశవరావ్ జాదవ్, హరగోపాల్ సార్ కూడా అక్కడి విద్యార్థులే.

సిటీ కాలేజీకి ఎదురుగా 'పేట్లాబురుజు' మైదానం ఉండేది. ఆ ఉదయాన అక్కడ వందలాది మంది పోలీసులు చెమటలు కారుతూ జట్లు జట్లుగా పరేడ్ చేసేవారు. చేతులు, కాళ్లు లయబద్ధంగా కదిలిస్తూ ఖాకీ డ్రస్సులో వారు మార్చింగ్ చేస్తుంటే నాకు చూడముచ్చటగా అనిపించి పెద్దగైన తర్వాత నేను కూడా పోలీస్ జవాన్ ఉద్యోగం చేయాలని అనుకునే వాడిని.

ఆ "దునియా కా మేలా" అట్లా అట్లా తిలకిస్తూ, ఆనందిస్తూ చివరికి ముసల్లం జంగ్ పూల్ ఎక్కేవాళ్లం. క్రింద ముచికుందా నది మురికి లేకుండా జోరుజోరుగ స్వచ్ఛంగ ప్రవహిస్తుండేది. వంతెన దాటి ఎడమవైపు తిరిగే సరికి కొంచెం దూరంల జుమ్మేరాత్ బజార్ దర్శనమిచ్చేది. అది పీర్ల పండుగ నాటి జాతరలా నాకు కనబడేది. ముందు అమ్మ ఆ బజార్ నాలుగు మూలలు కలియతిరిగి తనకు పనికి వచ్చే పాత సామానులు ఎక్కడెక్కడ ఉన్నాయో తనిఖీ చేసేది. ధరవరలు కూడా తెలుసుకునేది.

పుకట్ కా మాల్ ఆమె కందుకు గాని గీసిగీసి బేరమాడి

సస్తామాల్ కొనాలని ఆమె ఆలోచన.

ఇగ నా చూపులకేమో ఆ పాత సామానులు ఆనకపోయేది. “ఊరందరిది ఒక దారి ఉలిపి కట్టెది మరో దారి” అన్నట్లు అక్కడి రంగుల ప్రపంచం నన్ను ఆకర్షించేది. “బొంబై కా తమాషా దేఖో, ఏ చార్ దిన్ కా తమాషా దేఖో” అంటూ పాడుతున్న రంగుల బొమ్మల డబ్బా నన్ను వెంటాడేది. నాలుగడుగులు వేయగానే ఐస్‌ఫ్రూట్ బండి, దానిలోపల బరఫ్‌ల పెట్టిన రంగు రంగుల పుల్ల ఐస్‌క్రీంలు నన్ను రారామ్మని సైగ చేసేవి. లాయిలప్పలు, రాగమాలలు, మేండక్‌లు, గుండ్రని అట్టలతో చేసిన ఎర్రని కండ్లద్దాలు, కీ ఇస్తే కదిలే నల్లముండ్ల మణికట్టు గడియారాలు, తోపుడు బండిమీద రంగురంగుల నిమ్లెట్ సీసాలు (చవక రకం కూల్ డ్రింక్సు) నన్ను నేల మీద నిలవకుండా చేసేవి. కనీసం “చౌదాల్” (సేవ్‌దాల్) అయినా కొనమని అమ్మవైపు దీనంగా మూగచూపులు చూసేవాణ్ణి. “ముందు సామాన్ కొందాం నానీ, పైసలేమన్నా మిగిలితే అప్పుడు చూద్దాంలే” అని అమ్మ సముదాయించేది. అప్పటికే సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చేవాడు. ఆకలితో పేగులు గుర్రుగుర్రు మనేవి. తిరిగి తిరిగి సన్నటి పుల్లలాంటి కాళ్లు గుంజబట్టేవి. ఎర్రటి లేత ముఖం ఎండకు మాడిపోయి చెమటలు కారబట్టేవి.



ఆఖరికి పెరుమాండ్ల దయవలన అమ్మకు రాచిప్పలు అమ్ముతున్న వడ్డెర ఆడోళ్లు కనబడ్డారు. చిన్నాపెద్దా అనేక రకాల సైజుల రాచిప్పలు వాళ్ల ముందు కొలువై ఉన్నాయి. ఎండకు చెమటలు కారిన వారి నల్లటి శరీరాలు నూనె రాసినట్లు మిలమిలా మెరుస్తున్నాయి. అమ్మ తన వాక్చాతుర్యమంతా ఉపయోగించి తన దగ్గరున్న తక్కువ పైసలతో రెండు రాచిప్పలను కొన్న తర్వాత ఇంకా ఒక ఏకానా మిగిలింది. రూపాయికి పదహారణాల కాలం అది. ఏకానా, దొవ్వానా, చారానా, ఆఠానా, దస్సానా, బారానా, చౌదానాల సత్య కాలం అది. ఆ ఒక్క ఏకానాతో ముందు నాకు చల్లటి నిమ్‌లేట్ తాగించింది. ఎండిపోయిన కుతికకు ప్రాణం లేచి వచ్చింది. ఇంకా మిగిలిన చిల్లర బుడ్డపైసలతో ఎర్రటి అట్ట కండ్లద్దాలు, బెల్లం పానకంతో చేసిన మురమరాల లడ్డూ కూడా కొనిచ్చింది. తను మాత్రం ఏమీ తినలేదు, తాగలేదు మైలా, మడి పాటించే అమ్మగారు కదా!

మళ్లీ తిరుగు ప్రయాణం. రాచిప్పలను కొన్నందుకు అమ్మకు కొండంత సంతోషం. హనుమంతుడు సంజీవని పర్వతాన్ని భుజాలపై మోసినట్లు అమ్మ కుడి భుజంపై రాచిప్పల బరువుతో నడక. ఇంతల చౌమహల్లా ప్యాలెస్ వచ్చింది. ప్యాలెస్ ముందు ఏకాంతంగా, విశాలంగా నిలుచున్న మైదానం. మధ్యన ఊడలు విస్తరించిన ఒక పెద్ద మర్రిచెట్టు. అప్పుడు నగరంలో ఇంత ఆబాదీ లేదు. ఇప్పటి మాదిరిగ సడక్ మీద నడిస్తే టక్కర్ (ఆక్సిడెంట్) అయితదన్న భయం లేదు. ఆ మిట్ట మధ్యాహ్నపు ఎండకు ఎక్కడా ఒక నరమానవుడు కనబడుతలేడు. అమ్మ అలసట తీర్చుకునేందుకు ఆ మర్రిచెట్టు నీడన చేరి రాలిన ఆకుల మీద కూచుంది. భుజం మీది రాచిప్పల బరువును భూదేవికి అప్పగించింది. దాహార్తితో ఆమె అటు ఇటు చూసింది. కొద్ది దూరంల ఆకుపచ్చగ మెరుస్తున్న ఒక సూఫీ సాధువు దర్గా. అక్కడ ఒక సర్కారీ నల్లా. అమ్మ కండ్లకు అదొక చల్లని చలివేంద్రంలా కనిపించింది ఆ రోజులలో సర్కారీ నల్లా బారా గంటా ఖుల్లా. ఎప్పుడంటే అప్పుడు గంగమ్మ తల్లి పిలిస్తే పలికేది. అమ్మకు హుషారొచ్చింది. బిరబిర నడిచి నల్లాఖట్కా తిప్పి కాళ్లు, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కుంది. కడుపునిండా చల్లటి నీళ్లు తాగింది. రవ్వంత సేపు సేద తీరిన తర్వాత మళ్లీ రాచిప్పల బరువుతో గ్యారానంబర్ బస్ శురూ!

ఆ తెల్లారి మా అమ్మ మనసాలకు ఎదురుంగ ఉన్న చేదబావి ముందు కూచుని ఆ రెండు రాచిప్పలను రాసిరాసి, గీసిగీసి శుభ్రంగా కడిగింది. వాటి మురికంతా మాయమై అవి కృష్ణ వర్ణంలో కళకళలాడాయి. అందులో ఒకటి చింతకాయ ‘తొహి’కి (తొహి తమిళపదం. తొక్కు తెలంగాణా పదం) రెండో రాచిప్ప పాత చింతపండుతో చేసే వచ్చిపులుసు కోసం. పాత చింత పండుకు ఔషధగుణాలు ఎక్కువని, ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేదం చెపుతుంది. స్వర్గీయ దాశరథి రంగాచార్యగారు తమ ఆత్మకథ “జీవన యానం”లో వారి అమ్మగారు చేసే పచ్చి పులుసు గురించి వైన వైనాలుగా వర్ణించారు. ఇంటికి వచ్చిన అతిథులు ఏ అధరువులు లేకుండా ఉత్త పచ్చిపులుసుతోనే అన్నమంతా తిని బ్రేవ్ మని త్రేన్చేవారట. ఆమె చేతి మహత్యమో లేక ఆ పచ్చిపులుసు మహత్యమో అట్లా ఉండేదట.

మాచిన్నతనంల పచ్చడి పెట్టటమంటే ఒక చిన్న సైజు యజ్ఞం చేసినట్లే. నియమ, నిష్ఠలతో పెట్టిన పచ్చడి చెడిపోకుండా, బూజు పట్టకుండా, కలకాలం నిల్వ ఉంటదని నమ్మేవాళ్లు. ముందు మీరాలం మండికి పోయి, ఇటు కాయ అటు పండు కాక మధ్యరకం చింతకాయను బేరం చేసేవారు. అవి బాగా పొడుగ్గా కండపట్టి ఉండేవి. వాటిని ఇంటికి తెచ్చి శుభ్రమైన పొడి గుడ్డతో జాగ్రత్తగా తూడ్చి గాలికి ఒక రోజు ఆరబెట్టి తెల్లారి దాని మీదున్న పొట్టు, నారా వేరు చేసేవారు. వాటిని రోట్లోవేసి రోకలిబండతో “కచ్చాపచ్చా” దంచి బయట పడిన గింజల్ని పక్కన పెట్టి మళ్లీ మరోసారి దంచి సరిపడా లవణాన్ని (ఉప్పు) మిలాయించి కొత్త

రాచిప్పల ఆ ముద్దను వేసి ఆ రాచిప్పకు ఒక శుభ్రమైన గుడ్డను బిగించి మూత కట్టేవారు (వాసెన కట్టటం) ఆ తర్వాత అవసరం పడ్డప్పుడు ఒక గంటె లేదా రెండు గంటెల ముద్ద ఇవతలికి తీసి చిన్న కడాయిలో పోపు పెట్టేవారు (తిరగమోత) పోపుపెట్టట మంటే అల్లాటప్పా, ఆషామాషీ వ్యవహారం కాదు. అదొక 'పాకశాస్త్రం' కళ. శ్రేష్టమైన గానుగ నూనెను మండుతున్న కడాయిలో కొంచెం మరిగించి పొగలు రాగానే పోపు గింజలు, పొట్టు తీసిన ఎల్లిపాయలు, తాజా కరివేపాకు ఆకులు, ఇంగువా, కొంచెం మినప్పప్పు (పంటికిందికి కరకరలాడటానికి) ఆ నూనెలో వేసి, కలిపి పక్కన పెట్టుకున్న చింతకాయ ముద్దను ఆ పోపులో వేయగానే "చుఁయ్"మని పెద్ద శబ్దంతో, పొగలతో ఇల్లంతా గుమగుమలాడి గుభాళించి పోయేది. కడుపులో 'జఠరాగ్ని' రెట్టింపు అయ్యేది. మంచి ఎండాకాలం ఉదయం పూట (ఒంటిపూట బళ్ల రోజులలో) తరవాణిలో ఈ చింతకాయ 'తొహి' నంచుకుంటే ఆత్మారాముడు పరమానంద భరితుడౌతాడు. తరవాణి అంటే రాత్రి మిగిలిన అన్నాన్ని బాగా పిసికి మట్టి కుండలో వేసి అందులో మజ్జిగ, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి రాత్రంతా పులియపెడితే ఉదయానికి తయారయ్యే బ్రేక్‌ఫాస్ట్ అన్నమాట.



ఇక రెండవ రాచిప్ప సంగతి. అండ్ల ఒకటి రెండు రోజుల కోసం పచ్చిపులుసు లేదా మజ్జిగ పులుసు పోసేవారు. తెలంగాణా ప్రజలకు పచ్చిపులుసు చల్లని తల్లిలాంటిది. అది అందరికీ ఆరో ప్రాణం. పులుసును తమిళంలో 'పుళి' అంటారు. పుళిహోర, పచ్చిపుళి, తణ్ణి (నీరు) మెళుగు (మసాలా) తిరుక్కోవణ్ణం (పాయసం) లాంటి తమిళ పదాలు, మా ఇంట్ల చిన్నప్పుడు సాధారణ వాడుక పదాలు. ఇప్పుడు ఆ పదాలన్నీ గ్లోబలైజేషన్‌లో గల్లంతయినాయి.

ఇన్‌స్టంట్ కాఫీలాగా ఇన్‌స్టాంట్ పచ్చిపులుసు చేయటం చాలా ఈజీ. పాతబడి నల్లగా మారిన చింతపండును బాగా నానబెట్టి, బాగా పిసికి, గుజ్జును తీసివేసి వచ్చిన పచ్చి పులుసుతో మరికొన్ని నీళ్లు కలిపి పలుచగా చేసి, దానికి సరిపడ గల్లా ఉప్పును కలగలిపి, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయల్ని సన్నగా తురిమి ఆ రసంలో వేసి మరికొంచెం పిసికి చివరికి కొత్త బెల్లం పొడి దానికి జోడించి పోపు గింజలతో తిరగమోత పెట్టి ఆపైన సన్నగా తరిగిన కొత్తిమీరను చల్లితే అద్భుతమైన 'పచ్చిపుళి' తయ్యార్. దానిని ఆ రాచిప్పల పోసి కొద్దిసేపు ఓపిక పడితే ఫ్రిజ్‌లో పెట్టినట్లు చల్లగా అవుతుంది. అది ఆ రాతి మహిమ. ఉష్ణ శరీర గుణం కల్గిన వారికి పచ్చిపులుసు చలువ చేస్తుంది. ఆహారం సులభంగా జీర్ణం కావటమే గాక నోరు "సాఫ్" అయ్యి నాలికకు రుచుల పసిగట్టె గుణం పెరుగుతుంది.

చాలా కాలం తర్వాత నాకు యాభై సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత ఒక దినం చౌమహల్లా ఫ్యాలెస్ ముందున్న విశాలమైదానం, దాని మధ్యల మర్రిచెట్టు యాదికొచ్చింది. ఆ వటవృక్షం చల్లని నీడలో కూచుని అమ్మను జ్ఞాపకం చేసుకుందామని ఆశతో బయలుదేరాను. మూసీ నది దాటి పాత నగరంలోకి ప్రవేశించటమంటే చల్లని అమ్మ ఒడిల కూచుని పరవశించినట్లే కదా!

తీరా నేను అక్కడికి చేరుకునే సరికి ఒకప్పుడు అక్కడ ఉండిన విశాలమ్మైన మైదానమూ లేదు, మర్రి చెట్టూ లేదు. ఆ చెట్టును ఎవరో కొట్టేసారు. ఆ స్థలంలో ఒక ప్లాను, పద్ధతి లేకుండా వంకరటింకరగా గల్లీలు ఉన్నాయి. ఇష్టం వచ్చినట్లు కట్టుకున్న ఇండ్లు. ప్రతి ఇంటి ముందు ప్రవహిస్తున్న మురికి నీళ్ల కాలువలు, హడావుడిగా అటుఇటు తిరుగుతున్న కుక్కలు, పిల్లులు దర్శనమిచ్చాయి.

సూఫీ సాధువు దర్గామాత్రం అట్లనే ఉంది. సర్కారీ నల్లా కూడా అట్లనే అక్కడే ఉంది. గతించిన కాలానికి ప్రథమ సాక్షిగ! అమ్మ జ్ఞాపకం వచ్చింది. ఆమెను తలుచుకుంటూ నల్లా దగ్గరికి వెళ్లి కాళ్లూ, చేతులూ ముఖం శుభ్రంగా కడుక్కుని కడుపునిండా నీళ్లు తాగిన. అమ్మ నా పక్కన వున్నట్లే అనిపించింది. ఇంతల "ఉమ్రావ్ జాన్" సీన్మాల రేఖ పాడిన పాట యాది కొచ్చింది.

*"ఏ క్యా జగే హై దోస్తోఁ*
*ఏ కౌన్ సా దయార్ హై*
*హద్-ఎ-నిగా జహాఁతక్*
*గుబార్ హి గుబార్ హై"*
**ఇది ఏ ప్రాంతం మిత్రులారా**
**ఇది ఏ ప్రాంగణం స్నేహితులారా**
**కనుచూపు సరిహద్దు మేరా**
**దుమ్ము, ధూళి, విధ్వంసమే, విధ్వంసము.**

-పరవస్తు లోకేశ్వర్,
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com





గుర్రపు అస్థిపంజరం, పోచంపాడు

# తెలంగాణలో
# ఇనుపయుగంలోనే గుర్రపుస్వారీ!

గుర్రం అనగానే మనకు గుర్తుకొచ్చేది పంచకళ్యాణి! మామూలు గుర్రాలు కంటే, పుట్టుకలోనూ, అందంలోనూ, పరుగు వేగంలో నైపుణ్యంగా రౌతు మెచ్చేలా ఉరకటంలోనూ ప్రత్యేకతలు గల పంచకళ్యాణి గుర్రం జానపద గాథల్లో బహుళ ప్రచారానికి నోచుకొంది. సింధు నాగరికత స్థావరాలైన సుర్కోతడ, లోథల్, బనవాలి మొదలైన చోట్ల జరిపిన తవ్వకాల్లో (సా.శ.పూ. 2400-1700 నాటి) గుర్రపు అవశేషాలు లభించాయి. రుగ్వేదంలో అశ్వం, అథర్వవేదంలో అశ్వమేధ యాగ ప్రస్తావనలు వున్నాయి.

ఇనుపయుగపు తెలంగాణా (సా.శ.పూ.1100) సమాధుల్లో గుర్రపు అస్థిపంజరాలు, స్వారీ చేసేప్పుడు కాళ్లు దూర్చి పెట్టుకొనే ఇనుప రికాబూల్లు కళ్లేలు దొరికి పురావస్తు పరిశోధకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అలనాటి జీవన విధానాన్ని తెలిపే కొత్త ఆధారాలు వెలుగు చూచి, చరిత్ర గతిని మార్చాయి.

మునుపటి నిజామాబాద్ జిల్లాలో గోదావరి తీరాన గల పోచంపాడు గ్రామం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపుకు గురైంది. 1967లో రాష్ట్ర పురావస్తుశాఖ ఇక్కడ చేపట్టిన ఇనుపయుగపు ఒక సమాధి తవ్వకాల్లో ఇనుప ఈటెలు, బాణం, మొనలు, కత్తులు, గుర్రపు అస్థిపంజరం, కళ్లెం బయల్పడినాయి. మునుపటి మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణా-తుంగభద్ర నడుమగల ఉప్పలపాడు గ్రామంలో జరిపిన తవ్వకాల్లో కూడా ఇలాంటి ఆధారాలే లభించాయి. అక్కడున్న దాదాపు 200 సమాధుల్లోని 4.30×2.80×2.70 సెం.మీ (పొడవు, వెడల్పు, లోతు) కొలతలు గల ఒక గుంట సమాధిలో మానవ అస్థిపంజర శకలాలతోపాటు, నలుపు - ఎరుపు రంగు మట్టి పాత్రలు, 1.30;1.28 మీటర్ల పొడవుగల రెండు ఇనుప బరిసెలు, 23 సెం.మీ. పొడవు గల రెండు ఇనుపబాకులు, ఒక గొడ్డలి చిప్ప, ఉలి, ఇంకా నాలుగు గుర్రపు రికాబులు దొరికాయి.



ఉప్పలపాడు వద్ద బృహత్ శిలాయుగపు ఇనుప పనిముట్లు

ఇనుపయుగపు కొండ చరియలపై గల చిత్రకళలో మిగతా జంతువులతో పాటు గుర్రపు బొమ్మ చోటు చేసుకొని, నాటి రవాణా సాధనంగా గుర్రం గుర్తింపు తెచ్చుకొంది.

ఇలా, సా.శ.పూ.1000-550 మధ్య తెలంగాణాలో విలసిల్లిన ఇనుప యుగపు సంస్కృతిలో గుర్రంపై ప్రయాణం కొత్త పుంతలు దొక్కి రెండు తెలుగు రాష్ట్రాల్లో, గుర్రపు స్వారీ తెలంగాణాలోనే ప్రారంభమైందని తెలియజేస్తున్నాయి. అలనాటి రవాణా వ్యవస్థలో ఇదొక మైలురాయి!

(కీ.శే. డా.వి.వి. కృష్ణశాస్త్రి, పి.ఆర్.మూర్తి గార్లకు కృతజ్ఞతలతో..)

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in




# 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో

## 'తెలంగాణ గిరిజన క్షేత్రాలు-జాతర' పుస్తకావిష్కరణ

**38**వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ సందర్భంగా కొంపల్లి వెంకట్ గౌడ్ వేదికపై "తెలంగాణ గిరిజన క్షేత్రాలు - జాతర" అనే పుస్తకాన్ని శ్రీ సేడం అర్జు మాస్టర్ గారు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు జరిగింది. దక్కన్‌ల్యాండ్ పత్రిక సంపాదకులు వేదకుమార్ మణికొండ ఈ సభకు అధ్యక్షత వహించారు.

సభాధ్యక్షులుగా వేద కుమార్ గారు తెలంగాణ గిరిజన క్షేత్రాలను చక్కని ఉదాహరణలతో పరిచయం చేస్తూ, పుస్తక రచయిత డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ గారి పరిశోధనా నైపుణ్యం, పుస్తకంలోని అంశాల ప్రాధాన్యతను వివరించారు.

పుస్తక రచయిత డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, నాగోబా జాతర ఎంతో ప్రసిద్ధమైనదిగా భావించబడుతుందని, అక్కడ అనేక గిరిజన సంప్రదాయాలు సమ్మేళనంగా కనిపిస్తాయని తెలిపారు.

నిజాం కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అప్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ, నాగోబా జాతరను సమ్మక్క-సారలమ్మ జాతరతో పోల్చి, గిరిజన జాతుల సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానాన్ని ఈ జాతరలు స్పష్టంగా ప్రతిబింబిస్తాయని అన్నారు. పుస్తక రచనలో డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ గారు అనేక జాగ్రత్తలు తీసుకుంటూ, లోతైన అధ్యయనంతో రచన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ భట్టు రమేష్ గారు గిరిజన తెగల ప్రజల జీవన విధానాలు, సామాజిక ఆచారాలను వివరించారు.

ప్రధాన అతిథి శ్రీ సేడం అర్జు మాట్లాడుతూ, డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ గారు గిరిజన జాతులు, గోండులు, ఆదివాసీ తెగల జీవన విధానాన్ని తెలంగాణ గిరిజన క్షేత్రాల సందర్శనల ద్వారా సమగ్రంగా అధ్యయనం చేసి, జాతరల విశిష్టతలను అద్భుతంగా వివరించారని ప్రశంసించారు. ధర్మ, అర్థ, కామ, మోక్ష భావనలతో పాటు భూమి ప్రాధాన్యత, ప్రకృతి విశిష్టతలను ఈ పుస్తకంలో స్పష్టంగా వివరించారని తెలిపారు. గోండు గిరిజన తెగల దర్బారుల రూపాలు, వంశ పరంపరలు, నాగోబా మరియు దంతన్‌పల్లి భీమన్నకు సంబంధించిన అంశాలను సమగ్రంగా ప్రస్తావించిన తీరు ఎంతో విలువైనదిగా పేర్కొన్నారు.

ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హరినాథ్ గారు మాట్లాడుతూ.. గిరిజన తెగల ఆదివాసీ సంస్కృతులపై పుస్తకాలు రావడం చాలా అభినందనీయం.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, శరత్‌బాబు, ప్రభాకర్, రాపోలు సుదర్శన్, జూగాష్ విలి, విజయ కుమార్, వినాయక్ రెడ్డి, సుమిద, డా. రాణి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

-సయ్యద్ ఖైజర్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

# మీరాబెన్ మార్గంలో వ్యర్థాల నిర్వహణ?

**భా**రతదేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోని రైతులను ఉద్దేశించిన మీరాబెన్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కొన్ని వారాల అనంతరం ఒక విజ్ఞప్తి చేసింది. రైతు సోదరులారా మనం భూమాతను సరిగా పట్టించుకోవడంలేదు. సరైన పద్ధతిలో వ్యవహరించడమూలేదు. మనలనందరినీ పోషించడానికి తాను చేయగలిగినదంతా చేస్తున్నది. కానీ, మనం మాత్రం తిరిగి ఆమె పోషణకోసం ఏమీ చేయడంలేదు. విధేయులైన పిల్లలుగా ఆ తల్లి పట్ల మన విధ్యుక్త కర్తవ్యాలను నెరవేర్చకపోతే, ఆమె తన బిడ్డలను ఎట్లా పోషించుకోగలుగుతుంది. ఏడాదికేడాది మనం క్షేత్రాలను దున్నుతున్నాం, విత్తనాలు వేస్తున్నాం, పంట కోసుకుంటున్నాం. ఆ నేల నుంచి మనం ఏమి తీసుకుంటున్నామో అందుకు బదులుగా ఇంత ఎరువు వేయాలని తెలిసి కూడా అరుదుగా ఆ పని చేస్తున్నాం. మనకు ఏ విధంగానైతే బాగా ఉడికిన ఆహారం కావాలో నేల తల్లికి కూడా ఎరువు కావాలి. కానీ, సగం చెత్తతో కూడిన అపరిపక్వ ఎరువులు వేస్తున్నాం అని పేర్కొంది. కిసాన్ కంపోస్టును తయారు చేసుకోవాలని, ఆ ఎరువును భూమాతకు ఇవ్వాలని అభిలషించింది. ఆమె ఇంకా ఆవుపేడను పిడకలు చేసి బూడిదగా మార్చకుండా చెట్లకు పేడను ఇవ్వమని సూచించింది. మొక్కలు నాటమని చెప్పింది. పిడకలు కాల్చకుండా పేడతో మరింత ఎరువును తయారు చేసుకోవాలని చెప్పింది. ఎరువు కోసం కంపోస్ట్ గుంతలను తవ్వకొని ఆవుపేడను, గృహ వ్యర్థాలను అందులో వేస్తుండాలని చెప్పింది. ఇలా చేస్తుంటే భూమాతకు దుర్భిక్షం లేకుండా చేయగలమని కూడా అంటుంది. అలా చేయటం వల్ల తాను బలసంవర్ధకమై మనలను బంగారు పంటలతో దీవిస్తుందని కూడా ఆశించి ఉంటుంది. ఇంతకీ ఎవరు ఈ మీరాబెన్?



ఒక్కసారి గాంధీని గుర్తు చేసుకోవలసి ఉంటుంది. గాంధీ, కస్తూర్బా దంపతులకు నలుగురూ మగపిల్లలే. అయితే, గాంధీ మహాత్ముడు ఇద్దరు అమ్మాయిలను దత్తతీసుకున్నాడు. 1915లో తన ఆశ్రమంలో చేరిన అస్పృశ్య కులం నుంచి వచ్చిన తల్లిదండ్రుల కూతురు లక్ష్మి ఒకరు. ఆమె శిశువుగా ఉన్నప్పుడే వారు లక్ష్మిని దత్తత తీసుకున్నారు. 1933 వరకూ లక్ష్మి తల్లిదండ్రులు గాంధీజీ సబర్మతి ఆశ్రమంలోనే ఉన్నారు.

ఇక రెండవ దత్త పుత్రిక మేడలైన్ స్లేడ్. వీరినే మనం మీరా లేదా మీరా బెన్ అని పిలుచుకుంటున్నాం. ఈమె 1892లో పుట్టింది. తండ్రి బ్రిటీష్ నేవీలో అడ్మిరల్‌గా పని చేశాడు. తాను తొలుత పియానిస్టు కావాలనుకుంది. బీథోకెన్ సంగీతం అంటే ఎనలేని మక్కువ. రోమారోలా ద్వారా గాంధీ పేరును తొలుత విన్నది. సంగీతం మీద మక్కువ వదిలిపెట్టి అహ్మదాబాద్ వచ్చి గాంధీతో నివసించటం మొదలు పెట్టింది. గాంధీ జీవించి ఉండగానే కాదు ఆయన మరణానంతరం కూడా గాంధీ జీవితంలో ముఖ్యమైన వ్యక్తిగా పాత్ర పోషించింది. ఆయన వెన్నంటి నడిచింది. 1931లో గాంధీతో రౌండ్ టేబిల్ సమావేశానికి హాజరయ్యింది. పలుమార్లు గాంధీతో జైలు జీవితాన్ని అనుభవించింది. గాంధీ దత్తపుత్రికగానే కాకుండా, వలసవాద వ్యతిరేక కార్యకర్తగానే కాకుండా, ఆమెకు ఒక గొప్ప అంతర్దృష్టి ఉందని మానవాళికి ప్రకృతితో గల సంబంధం విషయంగా విస్తృత ఆలోచనలు సాగించిందని రామచంద్రగుహ తన 'స్పీకింగ్ విత్ నేచర్' రచనలో మీరా బెన్ గురించి ప్రస్తావన చేశాడు. ఆమె భారతదేశానికి రాకముందే ప్రకృతిపట్ల పర్యావరణంపట్ల ఆమె సంవేదనలు పెంపొందాయని పేర్కొంటాడు గుహ.

తండ్రి నేవీలో ఉంటూ దూరదేశాలకు నౌకా ప్రయాణాలు చేస్తుండటం వలన తన తాతగారి ఇంట పెరిగింది. అక్కడ ఆమె మొక్కలు, వృక్షాలతో అనుబంధాన్ని పెంచుకుంది. వాటిని సహచరులుగా భావిస్తూ అవి మొక్కలు, వృక్షాలు మాత్రమే కావు. వ్యక్తిత్వాలు అని కూడా పేర్కొంటుంది. 1925లో మీరా సబర్మతి ఆశ్రమానికి వచ్చింది. గాంధీజీతో పలు జాతీయోద్యమ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నది. 1939 సెప్టెంబర్‌లో

ద్వితీయ ప్రపంచ యుద్ధం మొదలైంది. బ్రిటీష్ ప్రభుత్వంలో గౌరవపూర్వక రాజీ, బ్రిటీష్ వారికి యుద్ధంలో మద్దతు, అందుకు గాను స్వాతంత్ర్యం ఇస్తామన్న వాగ్దానం లాంటివి చర్చలు, సంఘర్షణలు ముగిసి చర్చలు విఫలమయ్యాక ఆగస్ట్ 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. గాంధీ సహచరులు మీరాతో సహా జైలు పాలయ్యారు.




అయితే జైల నుంచి విడుదలయ్యాక మీరాకు ఎప్పటి నుంచో ఉన్న కల గాంధీలాగానే ఆశ్రమం స్థాపించాలని ఉండేది. గాంధీపట్ల గౌరవం ఏమీ తగ్గలేదు. కానీ మీరా ఆశ్రమ స్థాపన జరిగింది. మీరా కోరిక గ్రామీణ జీవితాన్ని అధ్యయనం చేయటమే కాకుండా అర్థవంతం, సుస్థిరం చేయాలని హిమాలయ పర్వత సానువుల్లో ఆశ్రమస్థాపన జరిగాక ఆమె భౌతికంగా మానసికంగా దృఢపడింది. ఆమె తన ఆత్మకథలో రాసుకున్నట్లుగా హిమాలయ ప్రాంత పశు, పక్ష్యాదుల సంపద తనలో మరింత బలాన్నిచ్చుంటుంది. గ్రామ సమస్యలను అర్థం చేసుకోవటంలో భాగంగానే అయినా మీరా మరింతగా ప్రకృతిని అర్థం చేసుకుందని చెప్పవచ్చు. అక్కడే ఆమెకు సాధారణ రైతు ఎరువు తయారు చేసుకోవటం లేదని గుర్తించింది. ఆవు పేడను వంట కొరకు గుర్తించింది. మానవ, పశువ్యర్థాలను ఎరువుగా మార్చి పంట పొలాలను సారవంతం చేయటం అనే ప్రక్రియపై దృష్టి పెట్టింది. చైనా సహజ ఎరువుల తయారీకి ఏ పద్ధతిని అనుసరించిందో అటువంటి పద్ధతినే అనుసరించాలని ఆశించింది. చైనాలో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి. చెత్త, వ్యర్థాలన్నీ ఎరువుల గుంతలో వేసి చక్కటి ఎరువుగా మార్చుకుంటున్నారు. కానీ, భారతదేశంలో చెత్త, వ్యర్థాలు గాలికి వదిలేయబడతాయి. ఈ వ్యర్థాన్నంతా బంగారంగా మార్చవచ్చని ఒక మార్గాన్ని అన్వేషించింది.

స్వాతంత్ర్యానంతరం ఏడు దశాబ్దాలు గడిచిపోయాయి. ఈనాటికీ మనం రసాయనిక ఎరువుల వైపే చూస్తున్నాం. నానాటికి చెత్త పెరిగిపోతున్నది. గ్రామాలు, పట్టణాలు ఘన వ్యర్థాలను బిలియన్ల కొద్దీ ఉత్పాదిస్తున్నాయి. వీటిని సరిగ్గా నిర్వహించటం ద్వారా సార్థక ఫలితాలను సాధించగలమేమో ఆలోచించాలి.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

## చందాదారులుగా చేరండి... చేర్పించండి...

***పాఠకులకు, రచయితలకు, పరిశోధకులకు... నమస్సులు.***

తెలంగాణ ఉద్యమ సందర్భంలో పుట్టిన తెలుగు మాసపత్రిక దక్కన్‌లాండ్. తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యమానికి దిశా నిర్దేశం చేసేలా ఎందరో ప్రముఖుల వ్యాసాలను అందించింది. టిఆర్‌సి 'చర్చ' సారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళింది. తెలంగాణ భావజాలాన్ని బలోపేతం చేసింది. స్వరాష్ట్ర ఆవిర్భావం తర్వాత దక్కన్‌లాండ్ తెలంగాణ పునర్ నిర్మాణంతో తనదైన పాత్రను పోషిస్తున్నది. తెలంగాణ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మరింత పరిపుష్టం చేసుకునేదానికి దోహదం చేస్తున్నది.

ఈ నేపథ్యంలో సామాజిక అంశాలతోపాటు, పర్యావరణం, చరిత్ర, వివిధ చేతివృత్తుల కళారూపాలు, నైపుణ్యాలు, వారసత్వం, పర్యాటకం లాంటి అంశాలపై కథనాలను వెలువరిస్తున్నది. ప్రజా సంక్షేమం కోసం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లుతుంది. 2012 సెప్టెంబర్‌లో ప్రారంభమైన పత్రిక ఇప్పటి వరకూ మీ అందరి సహకారాలతో కొనసాగుతూ వస్తుంది. ఇప్పటికే ఎంతో మంది మిత్రులు, శ్రేయోభిలాషులు, తమ చందాలతో పాటు, చందాదారులను చేర్పించడంలో తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

అయినప్పటికీ పత్రిక నిర్వహణ కష్టసాధ్యంగా ఉంది. దక్కన్‌లాండ్ మనందరిది. పదికాలాల పాటు పత్రిక సజావుగా వెలువడే బాధ్యత మన అందరిదీ.

చందా పూర్తయిన వారు తమ చందాలను రెన్యూవల్ చేసుకుని కాంప్లిమెంటరీ కాపీలు అందుతున్న వారు కూడా చందాదారులుగా చేరి, మిత్రులను చేర్పించి సహకరిస్తారని ఆశిస్తూ...

ధన్యవాదాలతో... మీ

**– మణికొండ వేదకుమార్**

సంపాదకులు

**చందా వివరాలు:**

వార్షిక చందా : రూ. 300 2 సం॥లకు : రూ. 600

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎంఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**చిరునామా :**

**DECCAN LAND :**

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com
ww.deccanland.com

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరములు:**

| | |
|---|---|
| Name | : DECCAN LAND |
| Bank | : KOTAK MAHINDRA BANK |
| A/c No | : 7111218829 |
| IFSC Code | : KKBK0007463 |
| Branch Code | : 007463 |

## సాంప్రదాయ భౌతిక అవరోధాలను అధిగమించిన దృశ్య అద్భుతం...

# క్వాంటం టన్నెలింగ్..!!

(క్వాంటం టన్నెలింగ్‌పై పరిశోధనకుగానూ 2025వ సంవత్సరానికి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చిన సందర్భంగా..!!)

*మాక్రో స్కోపిక్ క్వాంటం మెకానికల్ టన్నెలింగ్ మరియు ఎనర్జీ క్వాంటైజేషన్ ఇన్ యాన్ ఎలక్ట్రిక్ సర్క్యూట్ (Macroscopic Quantum Mechanical tunneling and energy Quantisation in an electric Cirucuit) అన్న అంశంపై పరిశోధన చేసి, విజయం సాధించినందుకుగానూ జాన్‌క్లార్క్ (యూకే), మైఖేల్ హెచ్.డెవోరెట్ (ఫ్రాన్స్), జాన్.ఎం. మార్టినిస్ (యూఎస్ఏ) అన్న ముగ్గురు క్వాంటం భౌతిక శాస్త్రవేత్తలకు 2025వ సంవత్సరానికి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ నేపథ్యంలో క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌ల విశేషాలేంటో మనమూ తెలుసుకుందామా..!!*

### భౌతికశాస్త్రం - ప్రాథమిక భావనలు

క్వాంటం టన్నెలింగ్‌ను గురించి తెలుసుకునే ముందు క్వాంటం భౌతిక శాస్త్రానికి సంబంధించిన కొన్ని మూల భావనలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. భౌతిక శాస్త్రాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి i) సాంప్రదాయ భౌతికశాస్త్రం (classical physics) ii) క్వాంటం భౌతిక శాస్త్రం (Quantum Physics)




**i) సాంప్రదాయ భౌతిక శాస్త్రం:** ఇది న్యూటన్ గమన నియమాలపై ఆధారపడి పనిచేస్తుంది. ఈ సాంప్రదాయ భౌతిక శాస్త్రం పదార్థ చలనం రెండు రకాలుగా ఉంటుందని తెలుపుతుంది. అవి i) అణువు (Partice) ii) తరంగం (Wave). ఈ శాస్త్ర విభాగాన్ని అనుసరించి పదార్థ చలనం ఒకచోటి నుండి మరో చోటికి అణువుల రూపంలోగానీ లేదా తరంగాల రూపంలోగానీ ప్రయాణిస్తుంది.

**ii) క్వాంటం భౌతికశాస్త్రం:** ఈ శాస్త్ర విభాగంపైన మాక్స్‌ప్లాంక్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, నీల్స్‌బోర్, హైసన్ బర్గ్, ష్రోడింగర్ లాంటి అనేక మంది శాస్త్రవేత్తలు గణనీయంగా కృషి చేశారు.

ఈ శాస్త్ర విభాగాన్ని అనుసరించి పదార్థం చలనం మ్యాటర్‌వేవ్ (Matler wave) రూపంలో ప్రయాణిస్తుంది. అనగా కదులుతున్న ప్రతి కణానికి తరంగ మరియు కణస్వభావం ఉంటుంది. కాబట్టి అవి తరంగ రూపంలోనూ మరియు కణ రూపం (Dual nature)లోనూ ప్రయాణిగలుగుతాయి. దీనినే De Brogile concept of Matter Waves అంటారు. 1923లో లూయిస్ డీ బ్రోగ్లీ పదార్థ కణాలకు ఈ ద్వంద్వ స్వభావం ఉంటుందని, ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల వంటి అతి సూక్ష్మ కణాలు ఈ స్వభావంతో ప్రవర్తిస్తాయని తెలిపారు.

**ఫోనాన్‌లు (Phonons):** ఒక స్ఫటికం లాంటి (latice structure) నిర్మాణంలో, పరమాణువుల సమూహకంపనాల (collective atomic vibration) క్వాంటం రూపాలను ఫోనాన్‌లు అంటారు.

కాంతి తరంగాల క్వాంటా ఫోటాన్ అయితే, శబ్దతరంగాల క్వాంటాను "ఫోనాన్‌లు" అంటారు. ఇవి నిజమైన కణాలు కావు, కానీ కణాల కణాలవలె ప్రవర్తిస్తాయి. అందువల్ల వీటిని Quasi particles అంటారు. ఇది బోస్ -ఐన్‌స్టీన్ గణాంకాలను (Bose-Einstein statistics) అనుసరిస్తాయి. అంటే ఒకే శక్తి స్థితిలో బహుళ ఫోనాన్‌లు ఉండగలవు.

కొన్ని పదార్థాలలో ఎలక్ట్రాన్ల మధ్య ఆకర్షణను ఫోనాన్లు ప్రభావితం చేయడం వల్ల సూపర్‌కండక్టివిటీ వంటి వింతైన క్వాంటం దృగ్విషయాలు ఏర్పడతాయి.

**కూపర్ జంటలు (Cooper Pairs):** సూపర్ కండక్టర్లలో అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద, రెండు ఎలక్ట్రాన్లు (సాధారణంగా ఒకదాని కొకటి వ్యతిరేక స్పిన్‌ను కలిగి ఉంటాయి) ఒక దానితో మరొకటి ఆకర్షించబడి జంటగా మారతాయి. వీటినే కూపర్ జంటలు అంటారు.

సాధారణంగా ఎలక్ట్రాన్లు ఒకదానికొకటి వికర్షించుకొంటాయి. (Coulomb repulsion) కానీ ఈ ప్రత్యేక పరిస్థితులలో అవి జంటగా మారి, నిరోధకత లేని విద్యుత్ ప్రవాహానికి (Super conductivity) కారణమవుతాయి. కూపర్ జంటలు బోసాన్‌ల (Bosons) (పదార్థం యొక్క ఐదవ స్థితిని బోసాన్ అంటారు) లాగా ప్రవర్తిస్తాయి. క్వాంటం స్థాయిలో ఇవి ఒకే స్థితిలో ఉండగలవు.

**బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ (BEC):** సాధారణంగా ఏదైనా ఒక పదార్థం ఘన, ద్రవ, వాయు, ప్లాస్మా అనే నాలుగు రకాల స్థితులలో లభిస్తుంది. కానీ ఏదైనా ఒక పదార్థంలోని అణువులను పరమ శూన్య ఉష్ణోగ్రత ('O' Kelvin లేదా $-273.15^{0}C$)కు దగ్గరగా చల్లబరిచినపుడు అవి పదార్థం యొక్క ఐదవ స్థితిని పొందుతాయి. దీనినే బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ అందురు. ఈ పదార్థంలోని కణాలను బోసాన్‌లు అంటారు.

ఈ బోసాన్ కణాలు ఒకే క్వాంటం స్థితిలోకి కలిసిపోయి విడి విడి కణాలుగా కాకుండా ఏకైక కణంగా ప్రవర్తిస్తాయి. ఈ ఏకైక కణాన్ని సూపర్ ఆటమ్ (Super-atom) అంటారు.

ఈ స్థితిని 1924–25లో భారతీయ శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ మరియు ఆల్బర్ట్ఐన్‌స్టీన్ అంచనావేశారు. 1995లో ఎరిక్ కార్నెల్ మరియు కార్ల్‌వీమన్‌లు దీనిని ప్రయోగాత్మకంగా నిరూపించారు.

బోసాన్‌ల యొక్క ఖచ్చితమైన కొలతల కారణంగా వీటిని క్వాంటం ఫిజిక్స్ యొక్క ప్రాథమిక పరిశోధనలలో వినియోగిస్తారు.



చిత్రం: క్వాంటంటన్నెలింగ్

**బీసీఎస్ సిద్ధాంతం (BC S theorm):** దీనిని 1957లో Bardeen, Cooper, Schrieffer అన్న ముగ్గురు శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. అందువల్ల దీనికి బీసీయస్ సిద్ధాంతం అన్న పేరు వచ్చింది.

అత్యల్ప ఉష్ణోగ్రత వద్ద ఏదైనా ఒక స్ఫటిక జాలకం (Crystal lattice)లోని ధనాత్మక అయాన్ల (ఫోనాన్‌లు) ప్రకంపనల కారణంగా (ఎలక్ట్రాన్–ఫోనాన్ ఇంటరాక్షన్), ఎలక్ట్రాన్ల మధ్య ఆకర్షణ శక్తి ఏర్పడి అవి జంటగా మారతాయి. వీటినే కూపర్ జంటలు అంటారు. ఈ జంటలు బోసాన్‌లుగా ప్రవర్తిస్తాయి. ఈ జంటలు స్ఫటిక ప్రకంపనల (Lattice Vibrations)కు చిక్కుకోకుండా, ఎలాంటి నిరోధం లేకుండా తమగుండా విద్యుత్‌ను ప్రవహింపజేస్తాయి. దీనినే సూపర్ కండక్టివిటీ అంటారు. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినందుకు గానూ 1972లో వీరికి నోబెల్ బహుమతి లభించింది.


చిత్రం: ఎనర్జీ క్వాంటైజేషన్

**జోసఫ్‌సన్ ఎఫెక్ట్ (Josephson Effect):** రెండు సూపర్ కండక్టర్ల మధ్య అత్యంత పలుచనైన ఇన్సులేటింగ్ పొరను ఉంచడం ద్వారా ఏర్పడే పరికరాన్ని జోసఫ్ జంక్షన్ (Thin Insulating barrier) అంటారు. సాంప్రదాయ భౌతిక శాస్త్రం ప్రకారం రెండు పదార్థాల మధ్య ఏదైనా అవరోధం ఉంటే వాటి మధ్య శక్తి ప్రసారం జరగదు. కానీ ఈ జోసఫ్‌సన్ జంక్షన్ ద్వారా ఎలక్ట్రాన్ జంటలు కణాల రూపం (Particles)లో ఉన్నప్పటికీ తరంగ స్వభావాన్ని (Wave Function) ప్రదర్శించడం వల్ల టన్నెలింగ్ (అవరోధం గుండా చొచ్చుకు పోవడం) ప్రక్రియ ద్వారా ఈ ఇన్సులేటింగ్ పొరను అధిగమిస్తాయి. అందువల్ల ఈ రెండు సూపర్ కండక్టర్ల మధ్య స్వేచ్ఛగా కరెంట్ ప్రవహిస్తూనే ఉంటుంది. రెండు సూపర్ కండక్టర్ల మధ్య ఉండే క్వాంటం వేవ్ ఫంక్షన్ దశలలో వ్యత్యాసం (Phase Difference) కారణంగా ఈ కరెంట్ ప్రవహిస్తుంది. ఈ దశ వ్యత్యాసం స్థిరంగా ఉన్నంత వరకు కరెంట్ నిరంతరం ప్రవహిస్తుంది. ఇది చాలా తక్కువ శక్తిని వినియోగిస్తూ అత్యంత వేగంగా పనిచేసే ఎలక్ట్రానిక్ పరికరం. ఇది క్వాంటం మెకానిక్స్ సిద్ధాంతాలపై పనిచేస్తూ భవిష్యత్ సాంకేతికతగా భావిస్తున్న క్వాంటం కంప్యూటింగ్‌కు పునాదిగా ఉపకరిస్తుంది.

బ్రిటీష్ శాస్త్రవేత్త బ్రియాన్ జోసెఫ్‌సన్ 1962లో ఈ జంక్షన్ యొక్క లక్షణాలను సిద్ధాంత పరంగా అంచనావేశారు. ఈ పరిశోధనకు గానూ ఆయనకు 1973లో నోబెల్ ప్రైజ్ లభించింది.

ఈ ప్రక్రియనంతా జోసెఫ్‌సన్ కంటికి కనిపించని అత్యంత సూక్ష్మస్థాయి (Micro scopic)లో వివరించారు.

ఇప్పుడు క్వాంటం టన్నెలింగ్ గురించి తెలుసుకుందాం.

**మరి... క్వాంటం టన్నెలింగ్ అంటే:** సాంప్రదాయ భౌతిక శాస్త్రం ప్రకారం రెండు దృగ్గోచర వస్తువుల మధ్య ఏదైనా అవరోధం ఉన్నప్పుడు వాటి మధ్య శక్తి ప్రసారం స్వేచ్ఛగా జరగదు. ఉదాహరణకు ఒక బంతిని గోడవైపు బలంగా విసిరినపుడు గోడ ఆ బంతిని తనను దాటి వెళ్ళకుండా నిరోధిస్తుంది. దాంతో బంతి తిరిగి వెనక్కి వస్తుంది. కానీ **క్వాంటం స్థాయిలో ఎలక్ట్రాన్ల వంటి అత్యంత సూక్ష్మ కణాలు తగినంత శక్తి లేకపోయినా తమ మధ్యనున్న అవరోధాలను దాటి స్వేచ్ఛగా రెండో వైపుకు ప్రయాణించగలవు. ఈ ప్రక్రియలో కణాలు ఒక అవరోధం (Barrier) గుండా, సొరంగాన్ని (Tenne) ఏర్పాటు చేసుకొని అవతలి వైపుకు ప్రయాణిస్తాయి. ఈ దృగ్విషయాన్నే "క్వాంటం టన్నెలింగ్" అంటారు.** భౌతిక శాస్త్ర పరిభాషలో ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే **ఎలక్ట్రాన్లు తమ మధ్య నున్న పొటెన్షియల్ బ్యారియర్ (Potential Barrier)ను దాటి అవతలివైపుకు ప్రయాణించగలిగే సంభావ్యత (Probability) Non-Zeroగా ఉండడాన్ని "క్వాంటం టన్నెలింగ్" అంటారు.** (ఏదైనా ఒక సంఘటన జరగడానికి ఏమాత్రం అవకాశం (Possibility) ఉన్నా దానిని Non-Zero Probability అంటారు)

**ఎనర్జీ క్వాంటైజేషన్ అంటే:** మనం ఏదైనా ఒక భవంతిపై భాగానికి చేరాలనుకుంటే మెట్లు ఎక్కి వెళతాము. ఆ మెట్లు 10, 12, 15... ఇలా విభిన్న సంఖ్యలలో ఉంటాయి. మనం భవంతి పై భాగానికి చేరాలంటే 1వ మెట్టు నుండి 2వ మెట్టును ఎక్కుతూ వెళతాము తప్ప గాలిలో ఉండలేము. అలాగే శక్తి కూడా నిర్దిష్ట స్థాయిలు (విలువలు) కలిగి ఉంటుంది.(శక్తి నిరంతర ప్రవాహంలా కాకుండా అది క్వాంటా (E=hv) అనే చిన్న చిన్న పాకెట్ల రూపంలో ఉండడాన్ని ఎనర్జీ క్వాంటైజేషన్ అంటారు.)

**మాక్రో స్కోపిక్ (Macrosopic) క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌లో ముగ్గురు శాస్త్రవేత్తల కృషి..!!**

1973లో నోబెల్ బహుమతి పొందిన బ్రిటీష్ శాస్త్రవేత్త బ్రియాన్ జోసఫ్‌సన్ తన జోసఫ్‌సన్ జంక్షన్ ద్వారా క్వాంటం టన్నెలింగ్ ప్రభావాన్ని ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు వంటి సూక్ష్మ పరమాణువుల స్థాయిలో (Microscopic Level) వివరించారు.

ఈ సంవత్సరం నోబెల్ బహుమతి గ్రహీతలైన జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డెవోరెట్, జాన్.ఎం. మార్టినిస్ అన్న ముగ్గురు శాస్త్రవేత్తలు క్వాంటం టన్నెలింగ్ మరియు ఎనర్జీ క్వాంటైజేషన్‌ల యొక్క ప్రభావాన్ని చేతితో పట్టుకోగలిగే వేలాది పరమాణావులతో కూడిన సూపర్ కండక్టింగ్ వ్యవస్థల ద్వారా స్థూల స్థాయి (Macro scopic)లో వివరించారు. మరియు ఆచరణాత్మక అనువర్తనాలకు దారులు పరిచారు. అందుకే

వీరిని 2025వ సంవత్సరపు నోబెల్ బహుమతి వరించింది. జోసఫ్‌సన్ యొక్క సూక్ష్మస్థాయి క్వాంటం టన్నెలింగ్, క్లార్క్, డెవోరెట్, మార్టినిస్‌ల యొక్క స్థూలస్థాయి క్వాంటం టన్నెలింగ్‌ల మధ్య బేధాలు క్రింది విధంగా ఉన్నాయి.

| వ.సం. | అంశం | సూక్ష్మస్థాయి క్వాంటం టన్నెలింగ్ (Micro Scopic Quantum Tunneling) | స్థూలస్థాయి క్వాంటం టన్నెలింగ్ (Micro Scopic Quantum Tunneling) |
|---|---|---|---|
| 1. | పరిమాణం లేదా స్థాయి (Scale) | సూక్ష్మస్థాయి క్వాంటం టన్నెలింగ్ పరమాణువులు లేదా ఎలక్ట్రాన్లు, ప్రోటీన్ల వంటి సబ్-అటామిక్ (అణువులకంటే చిన్న) స్థాయిలో జరుగుతుంది. | స్థూలస్థాయి క్వాంటం టన్నెలింగ్ అనేది కంటికి కనిపించే లేదా ప్రయోగశాల పరికరాల ద్వారా గుర్తించగల పెద్ద వ్యవస్థల (superconducting circuits)లో జరుగుతుంది |
| 2. | వ్యవస్థ (System) | సూక్ష్మస్థాయి క్వాంటం టన్నెలింగ్‌లో ఒకే కణం (Single Particle) పాల్గొంటుంది. | ఇందులో ఒక మొత్తం కరెంట్ సర్క్యూట్‌లోని అన్ని ఎలక్ట్రాన్లు క్వాంటం స్థితిలో ఉమ్మడిగా (collective), సింగిల్ పార్టికల్‌గా పాల్గొంటాయి. |
| 3. | నియంత్రణ (Regulation) | ఇందులో సూక్ష్మ కణాలు (Micro scopic Particles) వాటి పరిసరాలతో తక్కువ పరస్పర చర్య కలిగి ఉంటాయి. కాబట్టి టన్నెలింగ్ సులభం. ఉదా: సూర్యునిలో పరమాణు కేంద్రక సంలీనం (Nuclear fusion in the sun), స్కానింగ్ టన్నెలింగ్ మైక్రోస్కోపి (STM) | ఇందులో స్థూల వ్యవస్థలు (Macroscopic Systems) పరిసరాల ప్రభావం నుండి వేరు చేయబడాలి. లేకపోతే క్వాంటం ప్రభావం నశించటం వల్ల స్థూల స్థాయి క్వాంటం టన్నెలింగ్ అనేది ప్రదర్శింపబడదు. ఉదా: జోసెఫ్‌సన్ జంక్షన్‌లు, సూపర్ కండక్టింగ్ క్వాంటం సర్క్యూట్‌లు |
| 4 | పరిశోధనా పరిధి (Research Scope) | దీనిని బ్రిటీష్ శాస్త్రవేత్త బ్రియాన్ జోసఫ్ సన్ ప్రతిపాదించారు. ఇది భవిష్యత్ క్వాంటం సాంకేతికతలకు, పునాదివేసింది. తద్వారా ఈ పరిశోధన సైద్ధాంతికమైనది మరియు సంకుచితమైనదని చెప్పవచ్చు. | దీనిని జాన్ క్లార్క్, డెవోరెట్, మార్టినిస్ అన్న ముగ్గురు శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా నిరూపించారు. అందువల్ల ఇది ఆచరణాత్మక క్వాంటం అనువర్తనాలకు (Practical Quantum aplications) నేరుగా దారితీసింది. తద్వారా ఈ పరిశోధన ప్రయోగాత్మకమైనది మరియు విస్తృతమైనది చెప్పవచ్చు. |

**అనువర్తనాలు:**

**1) సూర్యునిలో కేంద్రక సంలీనం (Nuclear Function inthe sun):** సూర్యుని కేంద్రకంలో ఉన్న హైడ్రోజన్ పరమాణువులు (ప్రోటాన్లు) ఒకదానికొకటి బలంగా వికర్షించుకొంటాయి. (Coulomb repulsion), ఈ బలాన్ని అధిగమించి అతి దగ్గరకు రావాలంటే సూర్యుని కేంద్రకంలో ఉన్న 15 మిలియన్ కెల్విన్‌ల కన్నా అధిక ఉష్ణోగ్రత కావాలి. ఇది సాధ్యంకాదు. క్వాంటం మెకానిక్స్ ప్రకారం ప్రోటాన్‌లు కేవలం కణాలుగా మాత్రమే కాకుండా తరంగాలుగా కూడా ప్రవర్తిస్తాయి. ప్రోటాన్ల యొక్క ఈ తరంగ స్వభావం కారణంగా, అవి తమ మధ్యనున్న శక్తి అవరోధాలను నేరుగా అధిగమించకుండా ఆ అవరోధాన్ని టన్నెల్ ద్వారా దాటి వెళ్ళినట్లుగా, అవతలికి వెళతాయి.

ఈ విధంగా అవరోధాన్ని దాటి వచ్చిన ప్రోటాన్లు ఒకదానికొకటి చాలా దగ్గరగా వచ్చి, బలమైన కేంద్రశక్తి ప్రభావంతో సంలీనం చెంది, హీలియంను ఏర్పరుస్తాయి. ఈ ప్రక్రియ సూర్యునిలో చాలా తక్కువ స్థాయిలో జరిగినప్పటికీ, సూర్యునిలో ఉండే కోట్లాది ప్రోటాన్ల కారణంగా, నిరంతరం సంలీనం ఈ భూగోళంపై నున్న సకల ప్రాణికోటి మనుగడకు ఆధారమవుతోంది.

**2. జీవ శాస్త్రంలో క్వాంటం టన్నెలింగ్ అనువర్తనాలు**

**i) ఎంజైమ్ ఉత్ప్రేరణ (Enzyme Catalysis):** జీవక్రియలో ఎంజైమ్‌లు రసాయన ప్రతిచర్యలను వేగవంతం చేస్తాయి. కొన్ని ప్రతిచర్యలు సాంప్రదాయ భౌతిక శాస్త్ర నియమాలు వివరించలేని స్థాయిలో జరుగుతాయి. ఇక్కడ ఎంజైమ్‌లు, ముఖ్యంగా హైడ్రోజన్ వంటి చిన్న ప్రోటాన్‌లు శక్తి అవరోధాలను దాటడానికి క్వాంటం టన్నెలింగ్ ఉపయోగించి ఒకదానితో మరొకటి కలిసి, చర్యల వేగాన్ని పెంచుతాయి.

**ii) కిరణజన్య సంయోగ క్రియ (Photo Synthesis) మరియు కణశ్వాసక్రియ (Cellular Respiration):** ఈ ప్రక్రియలలో శక్తి బదిలీకి ఎలక్ట్రాన్ల ప్రవాహం అవసరం. ఈ ఎలక్ట్రాన్ల బదిలీలలో క్వాంటం టన్నెలింగ్ కీలక పాత్ర పోషిస్తుంది.

**iii) డీఎన్ఏ ఉత్పరివర్తనలు (DNA Mutations):** డీఎన్ఏ యొక్క నిర్మాణంలో, హైడ్రోజన్ బంధాలలో ఉండే ప్రోటాన్లు,

చిత్రం: జోసెఫ్సన్ జంక్షన్










చిత్రం: సూపర్ కండక్టర్లలో జరిగే ఎలక్ట్రాన్ల ప్రవాహం

అప్పుడప్పుడు టన్నెలింగ్ ద్వారా తమస్థానాలను మార్చుకుంటాయి. ఈ స్థానభ్రంశం డీఎన్ఏ ప్రతికృతి (Replication) సమయంలో లోపాలకు దారితీస్తుంది. ఇది జన్యు ఉత్పర్తివర్తనలకు (gentic mutations) ఒక కారణ మవుతుంది. తద్వారా ఇది జీవపరిణామంలో కీలకపాత్ర పోషిస్తుంది.

**iv) వృద్ధాప్యం మరియు క్యాన్సర్ (Aging and Cancer):** క్వాంటం టన్నెలింగ్ వల్ల జన్యువులలో జరిగే కొన్ని ఉత్పరివర్తనాలు వృద్ధాప్యానికి, క్యాన్సర్‌కు కారణం కావొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు (Sqids).

**3. సూపర్ కండక్టింగ్ క్వాంటం ఇంటర్‌ఫెరాన్స్ డివైజస్:**

**క్వాంటం టన్నెలింగ్ Sqid'సలలో ఈక్రింది విధంగా ఉపయోగపడుతుంది.**

**i) సూపర్ కండక్టింగ్ క్యూబిట్లు (Super conducting Q-bits):** క్యూబిట్లను క్వాంటం అణువులైన ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, చిక్కుబడిన అయాన్లు మరియు సూపర్ కండక్టింగ్ సర్క్యూట్లను మార్చడం లేదా కొలవడం ద్వారా సృష్టిస్తారు. సూపర్ కండక్టింగ్ సర్క్యూట్‌లు జోసెఫ్ జంక్షన్ ద్వారా పనిచేస్తాయి. ఈ క్యూబిట్ల పనితీరులో క్వాంటం టన్నెలింగ్ ప్రముఖపాత్ర పోషిస్తుంది. క్యూబిట్లు లేదా క్విట్‌లు అధునాతన క్వాంటం కంప్యూటర్లలో సమాచారాన్ని నిల్వచేసే ప్రాథమిక యూనిట్లుగా పనిచేస్తాయి.

**ii) బయో మాగ్నెటిజం (మెడికల్ ఇమేజింగ్):** హై రిజల్యూషన్ డయాగ్నసిస్ కోసం SQid లు మెదడు (మాగ్నెటో ఎన్‌సెఫలోగ్రఫీ–MEG) మరియు గుండె (మాగ్నెటో కార్డియోగ్రఫీ–MCG) నుండి వచ్చే అయస్కాంత సంకేతాలను కొలుస్తాయి. ఈ సంకేతాల ప్రసారంలో క్వాంటం టన్నెలింగ్ క్రియాశీల పాత్ర పోషిస్తుంది.

**iii) జియో ఫిజికల్ అన్వేషణలలో:** క్వాంటం టన్నెలింగ్ ఆధారంగా SQid లను ఉపయోగించి భూగర్భంలోని, బంగారం, వెండి, రాగి లాంటి ఖనిజ నిక్షేపాలను గుర్తిస్తారు. మరియు భూగర్భ విద్యుత్ వాహకతను మ్యాప్‌చేస్తారు.

**iv) నాన్–డిస్ట్రక్టివ్ టెస్టింగ్:** క్వాంటం టన్నెలింగ్ ప్రక్రియ ద్వారా SQidలను ఉపయోగించి ఏరోస్పేస్ ఇండస్ట్రీ మరియు ఇతర పరిశ్రమలు ఉత్పత్తి చేసిన మెటీరియల్‌లో అత్యంత సూక్ష్మస్థాయి పగుళ్ళు, చీలికలను గుర్తించడానికి ఉపయోగిస్తారు.

**v) క్వాంటం మెట్రాలజీ:** క్వాంటం టన్నెలింగ్ విధానం ద్వారా SQid లు ఖచ్చితమైన విద్యుత్, వోల్టేజ్ కొలతలకు ప్రమాణాలుగా ఉపయోగపడతాయి. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ కొలతలలో ఏకరూపకతలను నిర్ధారిస్తాయి.

**vi) క్వాంటం ఆంప్లిఫైయర్లు:** క్వాంటం టన్నెలింగ్ పద్ధతిద్వారా SQid లను క్వాంటం ఆంప్లిఫైయర్లలో వినియోగించి బలహీనమైన సంకేతాలను కూడా తక్కువ అదనపు శబ్దంతో ఆంప్లిఫై చేస్తారు. అంతరిక్ష మిషన్లు, కృష్ణ పదార్థ పరిశోధన (Dark matter research) లలో ఇది కీలక పాత్ర పోషిస్తాయి.

**vii) క్వాంటం కమ్యూనికేషన్:** క్వాంటం టన్నెలింగ్ ప్రక్రియననుసరించి SQid లను సురక్షితమైన ప్రపంచస్థాయి క్వాంటం కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను సృష్టించడానికి వాడతారు.

**చివరగా:** మానవాళికి మహోపకారం కలిగించే ఏ పరిశోధనైనా స్వాగతించదగినదే స్థూలస్థాయి క్వాంటం టన్నెలింగ్ విధానం ద్వారా మానవప్రగతి పథ ప్రస్థానంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన 2025 భౌతికశాస్త్ర నోబెల్ విజేతల త్రయం యొక్క కృషి అజరామరం, అనిర్వచనీయం. ఈ విప్లవాత్మక ఆవిష్కరణ మరిన్ని నూతన ఆవిష్కరణలకు మొగ్గ తొడగాలని మనమూ ఆశిద్దాం.

**ఇవి కూడా తెలుసుకోండి:**

- ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునెస్కో జర్మనీకి చెందిన భౌతికశాస్త్రవేత్త వెర్నర్ ఐసన్‌బర్గ్ 1925లో క్వాంటం మెకానిక్స్ నందు తన తొలి పరిశోధన పత్రాన్ని ప్రచురించి 2025 నాటికి 100 సం॥రాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని 2025వ సం॥రాన్ని "ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ"గా ప్రకటించింది.
- అదేవిధంగా క్వాంటం సైన్స్ పై ప్రపంచవ్యాప్తంగా ప్రజలలో అవగాహన పెంచడం కూడా ఈ ప్రకటన ప్రధానలక్ష్యం.
- కేంద్రప్రభుత్వం నేషనల్ క్వాంటం మిషన్ అన్న పథకాన్ని ఏప్రిల్ 19, 2023న ప్రకటించింది. ఈ పథకం ద్వారా క్వాంటం సైన్స్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించేందుకు గానూ 2023–24 నుండి 2030–31 సం॥రాల మధ్య వెచ్చించేందుకు గానూ 6003.65 కోట్ల నిధులను కేటాయించింది.
- దేశంలోనే తొలిసారిగా క్వాంటం వ్యాలీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం గూగుల్, టీసీయస్ సంస్థలతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది.
- తొలి క్వాంటం చిప్–**విల్లో** (Willow) దీనిని గూగుల్ సంస్థ తయారు చేసింది. ఏదైనా ఒక సంక్లిష్ట సమస్యను పరిష్కరించడానికి సాంప్రదాయ కంప్యూటర్లకు వందల సం॥రాల సమయం పడితే, ఈ చిప్‌ను వినియోగించే క్వాంటం కంప్యూటర్లు 5ని॥ల వ్యవధిలో పరిష్కరిస్తాయి.

–పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప, m : 9550290047

# జ్ఞానజ్యోతి సావిత్రీబాయి ఫూలే

"జ్యోతిరావు కంటే, అతని భార్య ప్రశంసలకు అర్హురాలు. మనం ఆమెను ఎంత ప్రశంసించినా అది సరిపోదు. ఆమె స్థాయిని ఎలా వర్ణించగలం? ఆమె తన భర్తకు పూర్తిగా సహకరించింది. అతనితో కలిసి, వచ్చిన అన్ని కష్టాలను ఎదుర్కొంది. ఉన్నత కులాల నుండి ఉన్నత విద్యావంతులైన మహిళల్లో కూడా ఇంత త్యాగశీలి అయిన స్త్రీని కనుగొనడం కష్టం. ఆ జంట తమ జీవితాంతం ప్రజల కోసం పనిచేస్తూ గడిపారు."

ప్రాచీన భారతంలో స్త్రీ విద్యకి ఉన్న ప్రాముఖ్యత వివిధ కారణాల వల్ల మధ్యయుగంలో చాలావరకు తగ్గింది. ఆధునిక యుగంలో మళ్ళీ అభివృద్ధిపథంలో అడుగుపెట్టింది. ఆధునిక భారతదేశంలో స్త్రీ విద్య కోసం పునాదులు వేసిన స్త్రీ పురుషులెందరో ఉన్నారు. వారందరిలో తొలి భారతీయ ఉపాధ్యాయిని శ్రీమతి సావిత్రిబాయి ఫూలే గొప్ప మహిళా శిరోమణి.



వీరు ఉపాధ్యాయిని గానే కాదు. సేవాతత్పరురాలు, వివిధ సంస్థల నిర్వాహకురాలు, సంఘ సంస్కరణాభిలాషి, కవయిత్రి కూడా!

సావిత్రిబాయి 1831 జనవరి 3న పూణే-సతారా రోడ్డులో శిర్వాల్ నుండి 5 కి.మీ మరియు పూణే నుండి 50 కి.మీ దూరంలో ఉన్న నైగావ్‌లో జన్మించారు. ఆమె ఖండోజీ నెవేషే పాటిల్ పెద్ద కుమార్తె. 1840లో, 10 సంవత్సరాల వయస్సులో, ఆమె జోతిరావును వివాహం చేసుకుంది. అతను 1827 ఏప్రిల్ 11న పూణేలో జన్మించాడు. అతని వివాహం సమయంలో పదమూడు సంవత్సరాలు.

ప్రభుత్వ రికార్డులు ప్రకారం, జోతిరావు వివాహం తర్వాత సావిత్రిబాయికి ఇంట్లోనే విద్యను అందించాడు. 1 మే 1851 నుండి 30 ఏప్రిల్ 1852 వరకు ఉన్న విద్యా నివేదిక ప్రకారం, "జోతిరావు తన భార్యను ఇంట్లోనే చదివించి, ఉపాధ్యాయురాలిగా మారడానికి శిక్షణ ఇచ్చాడు." 1851 నవంబర్ 22న బాంబే గార్డియన్‌లో వచ్చిన ఒక వార్త ప్రకారం, సావిత్రిబాయి తదుపరి విద్య బాధ్యతను జోతిరావు స్నేహితులు సఖారామ్ యశ్వంత్ పరంజ్‌పే మరియు కేశవ్ శివరామ్ భావల్కర్ (జోషి) తీసుకున్నారు. సావిత్రిబాయి అహ్మద్‌నగర్‌లోని శ్రీమతి ఫరార్ సంస్థలో మరియు పూణేలోని శ్రీమతి మిచెల్ సాధారణ పాఠశాలలో కూడా ఉపాధ్యాయ శిక్షణ పొందారు . ఈ పత్రాలను పరిగణనలోకి తీసుకుంటే, సావిత్రిబాయి ఫూలే మొదటి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు మరియు ప్రధానోపాధ్యాయురాలు కావచ్చు. బోధించడానికి ఆమె ఇంటి గడప దాటడం ఆధునిక భారతీయ మహిళ యొక్క 'ప్రజా జీవితం' ప్రారంభాన్ని సూచిస్తుంది.

జ్యోతిరావు ఫూలే ఆధునిక భావాలు కలవారు. భార్యని చదివించారు. ఆయనే గురువుగా మారారు. వారిద్దరి ఆశయాలు ఒకటయ్యాయి.

శ్రీమతి సావిత్రీబాయి ఫూలే ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో ఉపాధ్యాయ శిక్షణ పొందిన తొలి భారతీయ మహిళగా రికార్డు సృష్టించారు. మహిళలకు మాత్రమే కాదు, ఆమె కుటుంబానికి, సమాజానికి, తద్వారా దేశానికి, తరతరాల వారి అభివృద్ధికి మహిళా విద్య దోహదం చేస్తుందని ఆ దంపతులు విశ్వసించారు.

ముఖ్యంగా అణగారిన వర్గాలవారు అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి జరుగుతుందని నమ్మారు. 1848వ సంవత్సరంలో బాలికా పాఠశాలను పూనాలో స్థాపించారు. బాలికలకు ఉపాధ్యాయిని నేర్పితేనే బాగుంటుందని ఆశించారు ఫూలే! సావిత్రిని ఉపాధ్యాయినిగా పాఠశాలలో నియమించారు. ఈ సంఘటనతో వారి కుటుంబాలకు దూరమయారు. అయినా పట్టు వీడలేదు. అణగారిన వర్గాల వారి విద్యే పరమావధిగా కంకణం కట్టుకున్నారు.

సనాతనులు, ఛాందసులు సావిత్రీబాయిని వేధించేవారు. పేడ, రాళ్ళు, కోడిగుడ్లు వంటివి విసిరి ఆమెను భౌతిక దాడులకు, వేధింపులకు గురిచేశారు (ఇటువంటి వికృత చేష్టలు ఎప్పుడయినా గర్హనీయమే!). ఆమె చేతి సంచిలో మరొక చీర పెట్టుకుని బడికి వెళ్ళేవారు. బడిలో ఆ చీర కట్టుకుని తిరిగి వచ్చేటపుడు ఉదయం ఖరాబయిన చీరని కట్టుకునేవారు. ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది కదా! విసిగి వేసారిన సావిత్రీబాయి ఒక రోజు వేధించిన వ్యక్తి చెంప ఛెళ్ళుమనించారు. అక్కడితో ఆగడాలు ఆగాయి.

కొంతకాలం తరువాత వారికి సమాజం నుండి సహాయ సహకారాలు లభించాయి. వివిధ మతాలు, సామాజిక వర్గాల వ్యక్తులు బడుల కోసం స్థలాలను ఇవ్వడం దగ్గరి నుండి కావలసిన

సౌకర్యాలను కల్పించారు. సుమారు 50 పైనే వీరు స్థాపించిన పాఠశాలలు పిల్లలకు విద్యను అందించాయి.

వీరు కేవలం మహిళా విద్య కోసమే గాక, సమాజంలో పేరుకునిపోయి పట్టిపీడిస్తున్న మూఢవిశ్వాసాల పట్ల కూడా దృష్టి సారించారు. బాల్యవివాహ నిషేధం, అస్పృశ్యతా నివారణల కోసం కృషి చేశారు.

నాటి సమాజంలో బాల వితంతువులు ఎక్కువ. వితంతువులకు ఎదురయ్యే సమస్యలను గమనించారు. నాటి వితంతువులు మగాళ్ళ అత్యాచారాలకు గురై/ఆత్మహత్యలకు పాల్పడడం ఎక్కువగా జరిగేది. కొంతమంది గర్భవతులై ఆత్మహత్యలకు పాల్పడేవారు. వీరి కోసం 'ఆత్మహత్యా ప్రతిబంధక గృహాల'ను ఏర్పాటు చేశారు. వారి బిడ్డలను సాకారు. ఒక వితంతువు బిడ్డను దత్తత చేసుకున్నారు కూడా! అతనిని డాక్టర్ చదువు చదివించారు.



మహిళలంతా ఒకచోట సమావేశమై మాట్లాడుకునే టందుకు 1852లో 'మహిళా సేవా మండళ్ళ'ను ఏర్పాటు చేశారు.

వితంతువులకు శిరో ముండనం ఒక దురాచారంగా ఉండేది. దీనిని రూపుమాపడం కోసం వీరు క్షురకుల చేత సమ్మె చేయించి ఆపించారు. ఇది ఒక చారిత్రక విజయం.

1890వ సంవత్సరం నవంబర్ 28వ తేదీన మహాత్మా జ్యోతిరావు పూలే మరణించారు. అపుడు జరిగిన సంఘటన అఖండ భారతదేశంలో అంతకు ముందు జరగలేదు. దహనక్రియలు జరపటానికి బంధువులు, దాయాదులు వాదులాడుకున్నారు. ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడు స్వయాన నిప్పంటించి భర్త అంత్యక్రియలు నిర్వహించారు. సమాజం నివ్వెరపోయింది. అయినా ధీరగా నిలబడింది.

ఆమె తన పనులను ఆపలేదు. అప్పటి వరకూ భర్తతో కలిసి పనిచేసిన ఆమె మొత్తం కార్యనిర్వహణా భారాన్ని భుజానికెత్తుకున్నారు. సత్యశోధక సమాజం బాధ్యతలను పూర్తిగా స్వీకరించారు.

సమాజంలోని అనాథ, పేదబాలల కోసం శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘ సంస్కరణాభిలాషను మెచ్చుకుని కొంతమంది ధన ధాన్య వస్త్రాలను దానం చేసి శిబిరాల నిర్వహణకు సహాయం చేశారు.

వీరు కవయిత్రి కూడా! 'కావ్య పూలే', 'సుబోధ రత్నాకర్' అనే రెండు కవితా సంపుటాలను వెలువరించారు.

మరాఠీలో జ్యోతిరావు మరియు సావిత్రిబాయిపై 200కి పైగా పుస్తకాలు వ్రాయబడ్డాయి. మరాఠీ పుస్తకాలతో పాటు, హిందీ, ఇంగ్లీష్, తెలుగు, కన్నడ, పంజాబీ, ఉర్దూ, సింధీ మరియు గుజరాతీ భాషలలో కూడా పుస్తకాలు ప్రచురించబడ్డాయి. వీటిలో దాదాపు 40 పుస్తకాలు సావిత్రిబాయిపై వ్రాయబడ్డాయి. వీటిలో 1939లో శాంతబాయి రఘునాథ్ బంకర్ రాసిన సావిత్రిబాయి జోతిరావు ఫూలే యాంచే అల్పచరిత్ర మరియు 1966లో ఫుల్వంతబాయి జోడాగే రాసిన క్రాంతిదేవత సాధ్వి సావిత్రిబాయి పూలే చాలా ముఖ్యమైనవి. వారి అడుగుజాడలను అనుసరించి, డాక్టర్ ఎం.జి. మాలి 1980లో 'క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే' అనే జీవిత చరిత్ర పుస్తకాన్ని రాశారు. డాక్టర్ కె.పి. దేశ్‌పాండే 1982 లో సావిత్రిబాయి జీవితం మరియు సాహిత్యం ఆధారంగా అగ్నిపూలే రాశారు. వీటి తర్వాత ప్రచురించబడిన పుస్తకాలు ఎక్కువగా పైన పేర్కొన్న వాటిపై ఆధారపడి ఉంటాయి మరియు కొత్త సమాచారాన్ని కలిగి ఉండవు. కానీ విచారకరమైన విషయం ఏమిటంటే, సావిత్రిబాయిపై ఇప్పటివరకు ఒక్క విమర్శనాత్మక జీవిత చరిత్ర కూడా వ్రాయబడలేదు.

సుమారు 125 సంవత్సరాల క్రితమే 2000 మంది పిల్లలతో శిబిరాలను నిర్వహించి వారికి కావలసిన సౌకర్యాలను అందించడం చాలా గొప్ప.

బ్రాహ్మణ వితంతువులు క్షురకులను ఏర్పాటు చేసి వారి సమ్మెను ప్రారంభించడం ద్వారా వారి జుట్టు కత్తిరింపులను అంతం చేయడానికి దీనబంధు సంపాదకుడు మరియు శ్రామిక వర్గాల నాయకుడు నారాయణ్ మేఘాజీ లోఖండే ప్రారంభించిన ఉద్యమం వెనుక సావిత్రిబాయి ప్రేరణగా నిలిచారు. క్షురకులు చేసిన ఈ చారిత్రాత్మక సమ్మె నివేదికను ది టైమ్స్ 1890 ఏప్రిల్ 9న ప్రచురించింది. ఈ ప్రయత్నానికి ఇంగ్లాండ్ నుండి మహిళలు వారికి అభినందన లేఖ కూడా పంపారు.

1897వ సంవత్సరంలో దేశమంతా వ్యాపించినట్లే పూణాలోను ప్లేగు వ్యాధి విజృంభించింది. ఊర్లు ఊర్లు తుడిచి పెట్టుకుపోతున్నాయి. ప్లేగు వ్యాధి బాధితులకు సేవలను అందించారు సావిత్రీబాయి. ఈ మహమ్మారి ఆమెనూ వదలలేదు. 1897 మార్చి 10వ తేదీన ప్లేగు వ్యాధి పీడితురాలై మరణించారు.

- ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

**Periodic table of the elements**

- Alkali metals
- Alkaline-earth metals
- Transition metals
- Other metals
- Other nonmetals
- Halogens
- Noble gases
- Rare-earth elements (21, 39, 57–71) and lanthanoid elements (57–71 only)
- Actinoid elements

| period \ group | 1* | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 H | | | | | | | | | | | | | | | | | 2 He |
| 2 | 3 Li | 4 Be | | | | | | | | | | | 5 B | 6 C | 7 N | 8 O | 9 F | 10 Ne |
| 3 | 11 Na | 12 Mg | | | | | | | | | | | 13 Al | 14 Si | 15 P | 16 S | 17 Cl | 18 Ar |
| 4 | 19 K | 20 Ca | 21 Sc | 22 Ti | 23 V | 24 Cr | 25 Mn | 26 Fe | 27 Co | 28 Ni | 29 Cu | 30 Zn | 31 Ga | 32 Ge | 33 As | 34 Se | 35 Br | 36 Kr |
| 5 | 37 Rb | 38 Sr | 39 Y | 40 Zr | 41 Nb | 42 Mo | 43 Tc | 44 Ru | 45 Rh | 46 Pd | 47 Ag | 48 Cd | 49 In | 50 Sn | 51 Sb | 52 Te | 53 I | 54 Xe |
| 6 | 55 Cs | 56 Ba | 57 La | 72 Hf | 73 Ta | 74 W | 75 Re | 76 Os | 77 Ir | 78 Pt | 79 Au | 80 Hg | 81 Tl | 82 Pb | 83 Bi | 84 Po | 85 At | 86 Rn |
| 7 | 87 Fr | 88 Ra | 89 Ac | 104 Rf | 105 Db | 106 Sg | 107 Bh | 108 Hs | 109 Mt | 110 Ds | 111 Rg | 112 Cn | 113 Nh | 114 Fl | 115 Mc | 116 Lv | 117 Ts | 118 Og |

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| lanthanoid series 6 | 58 Ce | 59 Pr | 60 Nd | 61 Pm | 62 Sm | 63 Eu | 64 Gd | 65 Tb | 66 Dy | 67 Ho | 68 Er | 69 Tm | 70 Yb | 71 Lu |
| actionoid series 7 | 90 Th | 91 Pa | 92 U | 93 Np | 94 Pu | 95 Am | 96 Cm | 97 Bk | 98 Cf | 99 Es | 100 Fm | 101 Md | 102 No | 103 Lr |

*Numbering system adopted by the International Union of Pure and Applied Chemistry (IUPAC). © Encyclopædia Britannica, Inc.

# టైటానియం మూలకం యొక్క ఖనిజాలు

టైటానియం కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటిపై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలు కూడా మన వద్ద అవసరాలకు సరిపడా లేవు కాబట్టి దాదాపు 80 శాతం దిగుమతి చేసుకుంటున్నాము. టైటానియం భూమి యొక్క క్రస్ట్‌లో తొమ్మిదవ అత్యంత సమృద్ధిగా ఉన్న మూలకం. మరియు ఏడవ సమృద్ధిగా ఉన్న లోహం.

టైటానియం కలిగిన సాధారణ ఖనిజాలు బ్రూకైట్, ఇల్మ్‌నైట్, రూటైల్, పెరోవ్‌స్కైట్ మరియు టైటనైట్. అకాగోయిట్ అనేది టైటానియం డయాక్సైడ్‌తో కూడిన అత్యంత అరుదైన ఖనిజం. ఈ ఖనిజాలలో రూటైల్ మరియు ఇల్మ్‌నైట్ మాత్రమే ఆర్థిక ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. అయినప్పటికి అధిక సాంద్రతలలో కనుగొనడం కూడా కష్టం. ఆ ఖనిజాలలో 6 మిలియన్ టన్నులు 2011లో తవ్వబడ్డాయి. ఆస్ట్రేలియా, కెనడా, చైనా, భారతదేశం, మొజాంబిక్, న్యూజిలాండ్, నార్వే, సియెర్రా లియన్, దక్షిణాఫ్రికా మరియు ఉక్రేన్‌లలో ముఖ్యమైన టైటానియం కలిగిన ఇల్మ్‌నైట్ నిక్షేపాలు ఉన్నాయి. అనాటేస్, ఇల్మ్‌నైట్ మరియు రూటైల్ యొక్క మొత్తం నిక్షేపాలు రెండు బిలియన్ టన్నులు ఉన్నట్టు అంచనా.




టైటానియం (Ti) ఆటమిక్ నంబర్ 22 చాలా బలమైన, తక్కువ బరువుగల వెండి రంగులో ఉన్న ట్రాన్సిశన్ లోహం. దీనికున్న అత్యంత ముఖ్యమైన గుణం కర్రోశన్‌కి ఎక్కువ రెసిస్‌టెన్స్ ఇవ్వగలగడం. అందువల్ల ఏరోస్పేస్, మెడికల్ ఇమ్‌ప్లాంట్స్ మరియు పర్‌పార్‌మెన్స్ పరిశ్రమలలో ఉపయోగిస్తారు. ఈ లోహానికి ఎక్కువ స్ట్రెంత్ టు వేయిట్ రేశియో మరియు బయో కంపాటిబిలిటీ ఉండడం వల్ల అల్లాయస్‌లో ఉపయోగిస్తారు. దీని డయాక్సైడ్ సామాన్యంగా తెల్లరంగు పిగ్‌మెంట్‌గా వాడతారు.



టైటానియం ఖనిజాలు రూటైల్, ఇల్మనైట్ కల్గిన నల్ల బీచ్ ఇసుక



ఐరన్ ఓర్

టైటానియంని జెట్ ఇంజెన్స్, ఎయిర్‌ఫ్రేమ్స్‌లో, డెంటల్, ఆర్థోపెడిక్ ఇంప్లాంట్స్‌లో, పిగ్‌మెంట్స్‌లో, పేంట్స్‌లో, ప్లాస్టిక్స్; కాస్మెటిక్స్ పేపర్ తయారీలో దీన్ని సామాన్యంగా అల్యూమినియం, వనాడియం, టిన్ (Ti-6 At-4V) మిశ్రమంలో అల్లాయ్ చేస్తారు. గట్టితనం మరియు ఎక్కువ కాలం ఉండటానికి.

టైటానియం ముఖ్యంగా ఇల్మనైట్ ($FeTio_3$) మరియు రూటైల్ ($Tio_2$) నుండి ఉత్పత్తి చేయబడును. వేరే సోర్‌సెస్ స్ఫీన్, పెరోస్కైట్ ఖనిజాలు. వీటి నిక్షేపాలు అన్ని రకాల శిలలో దొరుకును కానీ చాలా వరకు హెవీ మినరల్ సాండ్. డిపాజిట్లలో అనగా బీచ్ సాండ్స్ మరియు రివర్ బెడ్స్‌లో. వీటి నిక్షేపాలు టైడల్ ఫ్లాట్ క్లేస్‌లో కూడా దొరుకుతుందనేది ఈ మధ్య కాలంలో పరిశోధనలో తేలింది. ఇప్పటి వరకు కోస్తా ప్రాంతంలో బీచ్‌సాండ్స్‌లోనే ఈ నిక్షేపాలను వెలికి తీస్తున్నారు. కానీ కోస్తాప్రాంతంలోని టైడల్ ఫ్లాటక్లేస్‌ను ఎక్స్‌ప్లోర్ చేయలేదు. కావున ఈ ప్రాంతంను టార్గెట్ చేసినచో చెప్పుకోదగ్గ నిక్షేపాలు దొరికే అవకాశాముస్నది. ఈ క్లేలో చాలా వరకు రూటైల్ ($Tio_2$) ఉంటుంది. దీన్ని క్లే నుండి ఎక్స్‌ట్రాక్ట్ చేసే విదానం క్రోల్ ప్రాసెస్ ద్వారా చేయబడుతుంది. టైటానియం మూలకం ఐరన్‌తో అసోసియేట్ అవుతుంది. అందువల్ల టైటానియం మూలకం యొక్క ఖనిజాలు ఐరన్ ఫార్మేశన్స్ నుండి వెలికి తీయవచ్చును. ఐరన్ ఓర్ మైన్ చేసిన తరువాత రిజెక్టడ్ డంప్స్‌లో నుండి టైటానియంని ఎక్స్‌ట్రాక్ట్ చేయవచ్చును. టైటానియంని లాటరైట్స్ నుండి కూడ ఐరన్‌తో పాటు దీనిని ఎక్స్‌ట్రాక్ట్ చేయవచ్చును.

టైటానియం నిక్షేపాలను వెలికి తీయగల జియోలాజికల్ డొమెయిన్స్ కోస్తా ప్రాంతంలోని బీచ్ సాండ్స్‌లో, డెల్టాయిక్ జోన్స్‌లో టైడల్ ఫ్లాట్‌క్లేలో, ఈస్ట్రన్ ఘాట్స్, వెస్ట్రన్ ఘాట్స్ మరియు కొండ ప్రాంతాలో దొరికే లాటరైట్ క్యాపింగ్స్‌లో పుష్కలంగా దొరికే అవకాశాలు ఉన్నవి. కావున ఈ ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించే అవసరం ఎంతో ఉన్నది.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com



ఫెర్రు జీ నస్ సాండ్ స్టోన్



లాట రైట్



*UNESCO, INDIA TENTATIVE LIST SITE - 2025, UDUPI, KARNATAKA*

**Serial Nomination for Geological Heritage of St' Mary's Island Cluster, Karnataka State, Province or Region India: Category: Natural**

# నిలువు శిలల అద్భుతం

# సెయింట్ మేరీస్ దీవులు

సెప్టెంబర్ 2025లో సెయింట్ మేరీస్ దీవులను యునెస్కో (UNESCO) తాత్కాలిక జాబితాలో (Tentative List) చేర్చారు. మేఘాలయ గుహలు మరియు నాగాలాండ్‌లోని ఓఫియోలైట్ శిలలతో పాటు వీటికి ఈ గౌరవం దక్కింది. ఇది భవిష్యత్తులో అధికారిక 'ప్రపంచ వారసత్వ సంపద' (World Heritage Status) హెూదా పొందేందుకు మొదటి మెట్టు.

సెయింట్ మేరీస్ ఐలాండ్స్ అనేది దీవులు కోకోనట్ ఐలాండ్, నార్త్ ఐలాండ్, దర్యా బహదూర్‌గఢ్ ఐలాండ్, సౌత్ ఐలాండ్ అనే నాలుగు చిన్న దీవుల సమూహం. ఇవి



కర్నాటక పశ్చిమ తీరంలోని ఉడిపి జిల్లాలోని మాల్పే నుండి దాదాపు 6 కి.మీ. దూరంలో నార్త్ -నార్త్ వెస్ట్ - సౌత్ సౌత్ వెస్ట్ గొలుసును ఏర్పరుస్తాయి. కోకోనట్ ఐలాండ్ - నార్త్ ఐలాండ్ మధ్య ఏర్పడిన 'మిడిల్ రాక్' అని వ్యవహరించే గుండ్రని రాతి సమూహం కూడా సెయింట్ మేరీస్ దీవులలో భాగంగా ఉంటుంది. కోకోనట్ ఐలాండ్ శిలలు బసాల్ట్ మూలాల అద్భుతమైన, సున్నితమైన స్తంభాకార జాయింట్స్ తో ఉంటాయి. ఇవి భారత ఉపఖండం సుమారు 85 మిలియన్ సంవత్సరాల క్రితం మడగాస్కర్‌తో ఆనుకొని ఉన్నప్పుడు ఏర్పడ్డాయని విశ్వసిస్తారు. స్తంభాల




వ్యాసం మారుతూ ఉంటుంది కానీ సాధారణంగా ఇది 20-25 సెం.మీ మధ్య ఉంటుంది. ఇవి అసాధారణమైన భౌగోళిక ప్రకృతి దృశ్యాన్ని ఏర్పరుస్తాయి. ఈ శిలల నిలువు రూపం పోస్ట్-మాగ్మాటిక్ స్ట్రక్చరల్ టిల్టింగ్ (లావా చల్లబడిన తర్వాత అక్కడ ఎటువంటి భౌగోళిక వంగుబాటు లేదా మార్పులు జరగలేదని సూచి స్తుంది) లేకపోవడాన్ని సూచిస్తుంది. సెయింట్ మేరీస్ ఇతర దీవులలో బయల్పడిన శిలలు సూక్ష్మ స్ఫటిక రూపంలో, పోర్ఫిరిటిక్ రైయోలైట్, రైయోడాసైట్ రకానికి చెందినవి. ఇవి ప్రకృతిలో చాలా అరుదైనవి. ఇక్కడి రైయోలైట్ శిలలు అద్భుతమైన 'గ్రానోఫైరిక్ టెక్చర్'ను కలిగి ఉంటాయి. భారతదేశంలో మరెక్కడా లేనంత అందమైన, ఆకట్టుకునే అగ్నిశిలా నిర్మాణాలలో ఇది ఒకటి.

సెయింట్ మేరీస్ ద్వీపసమూహం, రైయోలిటిక్ లావాలో ఏర్పడిన 'స్తంభాకార జాయింట్స్'కు ఒక అసాధారణమైన, దృశ్యపరంగా అద్భుతమైన ఉదాహరణ. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక ప్రాముఖ్యత కలిగిన ఇటువంటి నిర్మాణాలు చాలా అరుదు. సుమారు 88 మిలియన్ సంవత్సరాల క్రితం (లేట్ క్రెటేషియస్ కాలం), భారతదేశం, మడగాస్కర్ ప్లేట్లు విడిపోతున్న సమయంలో, లావా నెమ్మదిగా చల్లబడి కుంచించుకుపోవడం ద్వారా ఈ నిలువు, బహుభుజి స్తంభాలు ఏర్పడ్డాయి. ఇవి ఖండ చలనం, ప్లేట్ టెక్టోనిక్స్‌పై విలువైన జియోక్రోనాలజికల్, పాలియోమాగ్నెటిక్‌ల గురించి విలువైన సమాచారాన్ని అందిస్తాయి.

జాతీయ భౌగోళిక స్మారక చిహ్నంగా గుర్తించబడిన ఈ ప్రాంతం ప్రత్యేకత దాని రైయోలిటిక్ (Rhyolitic) నిర్మాణంలో ఉంది. సాధారణంగా కనిపించే బసాల్టిక్ స్తంభాల మాదిరిగా కాకుండా, ఇవి రైయోలైట్ శిలలతో ఏర్పడటం వల్ల భారత ఉపఖండంలోనే ఇవి అత్యంత అరుదైన,శాస్త్రీయంగా కీలకమైన భౌగోళిక అంశంగా మారాయి. ఈ ప్రాంతంలోని అద్భుతమైన రేఖాగణిత ఆకృతులు, తీరప్రాంత ద్వీప నేపథ్యంతో కలిసి ఒక అసాధారణమైన దృశ్యాన్ని సృష్టిస్తాయి. ఇది భూమి అగ్నిపర్వత చరిత్రపై ప్రజలకు ఆసక్తిని కలిగిస్తుంది. భూమి పొరను తీర్చిదిద్దే అగ్నిపర్వత ప్రక్రియలకు ఈ ప్రాంతం ఒక అద్భుతమైన సాక్ష్యం. శాస్త్రీయ పరిశోధనలు, విద్య, స్థిరమైన జియో-టూరిజం అభివృద్ధికి ఇక్కడ అపారమైన అవకాశాలు ఉన్నాయి.

సెయింట్ మేరీస్ దీవులు భారతదేశ పశ్చిమ తీరంలో, కర్నాటకలోని ఉడిపి జిల్లా కేంద్రానికి పశ్చిమంగా 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్పే అనే తీర ప్రాంత గ్రామానికి సమీపంలో ఉన్న చిన్న, అందమైన ద్వీపాల సమూహం. సుమారు 65 మిలియన్ సంవత్సరాల క్రితం, క్రెటేషియస్-ఈయోసిన్ కాలంలో, దక్షిణ భారతదేశంలోని పశ్చిమ, మధ్య, ఉత్తర భాగాలలో భారీ ఎత్తున వేడి ద్రవ రూపంలోని బసాల్టిక్ లావా ఉద్భవించింది. ఇది ప్రస్తుత భారత భూభాగంలో సుమారు 5,12,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించింది.

ఈ 'ట్రాప్' ప్రాంతం పైన చదునుగా ఉండే కొండలు, మెట్ల వంటి వరుసలతో కూడి ఉంటుంది. సెయింట్ మేరీస్ దీవుల్లోని ఈ శిలలు గంభీరమైన బహుముఖ స్తంభాల వరుసలుగా అభివృద్ధి చెందాయి. భౌగోళిక పరిభాషలో 'స్తంభాకార జాయింట్స్' అని పిలువబడే ఈ అద్భుతమైన నిర్మాణాలు ప్రకృతి యొక్క అత్యద్భుతమైన కళాఖండాలు. ఈ శిలల రేఖాగణిత అమరికను చూస్తే, ఎవరో శిల్పి రాళ్లను చెక్కి మలచినట్లుగా అనిపిస్తుంది, కానీ ఇది పూర్తిగా ప్రకృతి సిద్ధంగా ఏర్పడినది.

ఈ స్తంభాకార నిర్మాణాల పుట్టుక, సాధారణంగా నదులు లేదా చిత్తడి నేలలు ఎండిపోయినప్పుడు బురదలో ఏర్పడే బహుభుజి పగుళ్లను పోలి ఉంటుంది. బురదలోని నీరు ఆవిరైపోవడం వల్ల ఉపరితల పొరలు కుంచించుకుపోయి ఆ పగుళ్లు ఏర్పడతాయి. అదే విధంగా, భారీ పరిమాణంలో ఉన్న వేడి లావా నెమ్మదిగా చల్లబడుతున్నప్పుడు, అది కుంచించుకుపోవడం వల్ల ఈ నిలువు స్తంభాకార జాయింట్స్ ఏర్పడ్డాయి.

సెయింట్ మేరీస్ స్తంభాకార శిలలు, ఆ ద్వీపపు భూగర్భ నిర్మాణం రెండూ కూడా ప్లేట్ టెక్టోనిక్స్ సిద్ధాంతానికి బలమైన మద్దతును అందిస్తాయి. అనేక సాంకేతిక అధ్యయనాలు లేట్ ప్రికాంబ్రియన్ నుండి క్రెటేషియస్ కాలం వరకు మడగాస్కర్, గ్రేటర్ ఇండియా కలిసి ఉండేవని వెల్లడించాయి. లేట్ క్రెటేషియస్ కాలంలో



జరిగిన విచ్ఛిన్నం కారణంగా మడగాస్కర్ తూర్పు తీరం నుండి భారత పశ్చిమ తీరం విడిపోయింది.

ఇటీవలి పాలియోమాగ్నెటిక్ (Palaeomagnetic) ఆధారాల ప్రకారం, ఈ విచ్ఛిన్నం ప్రక్రియలోనే సెయింట్ మేరీస్ స్తంభాకార శిలలు ఏర్పడ్డాయని తెలుస్తోంది. ఈ కారణంగా, ఈ ప్రాంతం జియోక్రోనాలజికల్, పాలియోమాగ్నెటిక్ పరంగా అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇక్కడ జరిగిన అధ్యయనాలు ఇండియా–మడగాస్కర్ విడిపోవడం గురించి మరియు ఖండాల విచ్ఛిన్న ప్రక్రియ, ప్లేట్ టెక్టోనిక్స్ వంటి అంశాలపై శాస్త్రీయ అవగాహనను పెంపొందించాయి

భారత పశ్చిమ తీరానికి దూరంగా సముద్రంలో ఉండటం వల్ల సెయింట్ మేరీస్ సమూహంలోని నాలుగు ద్వీపాలు చక్కటి సంరక్షణలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాలు భారత ప్రభుత్వ తీర నియంత్రణ మండలి పరిధిలో రక్షించ బడుతున్నాయి. జీఎస్ఐ 1978లోనే వీటిని నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్‌గా ప్రకటించింది. కోకోనట్ ఐలాండ్‌లోని స్తంభాకార బసాల్ట్ శిలలను వాటి సహజ స్థితిలో వీక్షించవచ్చు. ప్రస్తుతం జిల్లా యంత్రాంగం ఈ ద్వీపాల్లో చిన్నపాటి పర్యాటక పర్యటనలను నిర్వహిస్తోంది.

ఈ ప్రాంతం తీర నియంత్రణ మండలి పరిధిలోకి వస్తుంది, ఇది దీనికి చట్టపరమైన రక్షణను కల్పిస్తుంది. అయితే, కొన్ని అధ్యయనాల ప్రకారం కోకోనట్ ఐలాండ్ మైక్రో ప్లాస్టిక్ కాలుష్యానికి గురవుతున్నట్లు తేలింది (సగటున లీటరుకు 0.218 కణాలు). ఇతర ద్వీపాలతో పోలిస్తే ఇది తక్కువగానే ఉన్నప్పటికీ, పర్యాటకం, చేపల వేట వంటి మానవ కార్యకలాపాల కారణంగా ఇది ఒక ముప్పుగా పరిగణించవచ్చు.

సెయింట్ మేరీస్ ద్వీపం భౌగోళిక వారసత్వం ఒక అసాధారణమైన ప్రకృతి దృగ్విషయాన్ని ఆవిష్కరిస్తుంది. ఇక్కడ నిలువుగా, షడ్భుజి ఆకారంలో ఉన్న రైయోలిటిక్ లావా స్తంభాలు ఉన్నాయి. కరిగిన శిలాద్రవం వేగంగా చల్లబడటం ద్వారా ఈ అద్భుతమైన నిర్మాణాలు ఏర్పడ్డాయి. భారత ఉపఖండంలో 'సబేరియల్ సిలిసిక్' అగ్నిపర్వత ప్రక్రియకు సంబంధించి, సుమారు 88 మిలియన్ సంవత్సరాల క్రితం (లేట్ క్రెటేషియస్ కాలం) నాటి అత్యంత అరుదైన, విశిష్టమైన ఉదాహరణలుగా ఇవి పరిగణించ బడతాయి. ఈ ప్రాంతం గోండ్వానా (Gondwana) మహాఖండం విచ్ఛిన్నం కావడం, మడగాస్కర్ నుండి భారత పలక విడిపోవడానికి సంబంధించిన కీలక సమాచారాన్ని వెల్లడించడమే కాకుండా, స్థానిక సంస్కృతి, గౌరవం, విద్యాపరమైన ప్రాముఖ్యతతో కూడిన అద్భుతమైన ప్రకృతి దృశ్యాన్ని కూడా అందిస్తుంది

అంతర్జాతీయ స్థాయిలో దీనికి సమాంతరంగా చెప్పుకోదగ్గ మరొక ప్రాంతం ఉత్తర ఐర్లాండ్ తీరంలో ఉన్న 'జెయింట్ కాజ్‌వే అండ్ కాజ్‌వే కోస్ట్'. ఇది యునెస్కో ప్రమాణం (viii) కింద ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించబడింది. సుమారు 40,000 ఒకదానితో ఒకటి పెనవేసుకున్న బసాల్ట్ స్తంభాలతో కూడిన ఈ నిర్మాణం, ఒకప్పుడు జరిగిన అగ్నిపర్వత కార్యకలాపాల వల్ల ఏర్పడింది. సెయింట్ మేరీస్ ద్వీపం వలెనే, జెయింట్ కాజ్‌వే కూడా ప్రకృతి రేఖాగణిత కచ్చితత్వానికి ఒక అద్భుతమైన దృశ్యరూపం. ఇక్కడి స్తంభాకార జాయింట్స్ నమూనా, లావా చల్లబడే సమయంలోని థర్మోడైనమిక్ పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తుంది.

జెయింట్ కాజ్‌వే వద్ద జరిగిన శాస్త్రీయ పరిశోధనలు తొలినాళ్లలో 'భూగర్భ శాస్త్రం' (Geology) ఒక ప్రత్యేక విభాగంగా అభివృద్ధి చెందడానికి ఎంతగానో దోహదపడ్డాయి. ఈ ప్రాంతం అనేక పురాణ గాథలతో, సాంస్కృతిక సంప్రదాయాలతో పెనవేసుకుని ఉందిముఖ్యంగా 'ఫిన్ మాక్‌కూల్' అనే రాక్షసుడి పురాణగాథ ఇక్కడ చాలా ప్రసిద్ధి. అదేవిధంగా, సెయింట్ మేరీస్ దీవులు అంతర్జాతీయ సాహిత్యంలో అంతగా ప్రసిద్ధి చెందక పోయినప్పటికీ, ఇవి ప్రాంతీయ సముద్ర వారసత్వంతో లోతైన సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఇవి ఎప్పటి నుండో ప్రకృతి ప్రేమికులను, యాత్రికులను ఆకర్షిస్తున్నాయి.

అయితే, ఈ రెండింటి మధ్య ఉన్న ఒక ప్రధాన వ్యత్యాసం అక్కడి లావా రసాయన కూర్పు. జెయింట్ కాజ్‌వే 'బసాల్టిక్' రకానికి చెందినది కాగా, సెయింట్ మేరీస్ దీవుల నిర్మాణాలు 'రైయోలిటిక్'





రకానికి చెందినవి. ఇది వాటిని భౌగోళికంగా, ప్రపంచవ్యాప్తంగా విశిష్టమైనవిగా మారుస్తుంది. బసాల్టిక్ స్తంభాలతో పోలిస్తే రైయోలిటిక్ స్తంభాకార జాయింట్స్ ప్రకృతిలో చాలా అరుదుగా కనిపిస్తాయి, ఇదే ఈ ద్వీపం యొక్క శాస్త్రీయ ప్రత్యేకతను మరింత పెంచుతుంది.

**జెయింట్స్ కాజ్‌వే అండ్ కాజ్‌వే కోస్ట్, ఉత్తర ఐర్లాండ్**

ఈ విధమైన పోలికలలో సెయింట్ మేరీస్ దీవులను జెయింట్స్ కాజ్‌వే, కాజ్‌వే కోస్ట్‌తో పోల్చవచ్చు. ఇది ఉత్తర ఐర్లాండ్ తీరం వెంబడి ఉన్న ప్రపంచ వారసత్వ ప్రదేశం. దాదాపు 40,000 ఇంటర్‌లాకింగ్ బసాల్ట్ స్తంభాలను కలిగి ఉన్న ఈ నిర్మాణం, ఒకనాటి అగ్నిపర్వత కార్యకలాపాల ద్వారా కూడా సృష్టించబడింది. సెయింట్ మేరీస్ ద్వీపాల వలె, జెయింట్స్ కాజ్‌వే కూడా ప్రకృతి రేఖాగణిత కచ్చితత్వం దృశ్యమాన నాటకీయ ప్రదర్శనను అందిస్తుంది. స్తంభాల జాయింటింగ్ నమూనా లావా శీతలీకరణ నిర్దిష్ట థర్మోడైనమిక్ పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తుంది. జెయింట్స్ కాజ్‌వేలోని శాస్త్రీయ పరిశోధనలు భూగర్భ శాస్త్రం ప్రారంభ అభివృద్ధిని ఒక విభాగంగా బాగా ప్రభావితం చేశాయి. ఈ ప్రదేశం పౌరాణిక, సాంస్కృతిక సంప్రదాయాలతో ముడిపడింది. ముఖ్యంగా ప్రఖ్యాత ఫిన్ మాక్‌కూల్ ప్రాచీనగాథ. అదేవిధంగా, సెయింట్ మేరీస్ ద్వీపం, అంతర్జాతీయ సాహిత్యంలో తక్కువ పౌరాణికంగా ఉన్నప్పటికీ, ప్రాంతీయ సముద్ర వారసత్వంతో లోతుగా అనుసంధానించబడి ఉంది. చాలా కాలంగా యాత్రికులను, ప్రకృతి శాస్త్రవేత్తలను ఆకర్షించింది. అయితే, లావా కూర్పులో ఒక ముఖ్యమైన వ్యత్యాసం ఉంది: జెయింట్స్ కాజ్‌వే బసాల్టిక్ అయితే, సెయింట్ మేరీస్ ఐలాండ్ నిర్మాణాలు రియోలిటిక్‌గా ఉంటాయి. ఇవి భౌగోళికంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైనవి. ఈ కూర్పు వ్యత్యాసం ద్వీపం శాస్త్రీయ ప్రత్యేకతను పెంచుతుంది, ఎందుకంటే రియోలిటిక్ స్తంభాల జాయింటింగ్ బసాల్టిక్ రకాల కంటే చాలా తక్కువ సాధారణం.

**ఫింగల్స్ కేవ్, స్కాట్లాండ్**

మరో ముఖ్యమైన పోలిక జనావాసాలు లేని స్కాటిష్ ద్వీపం స్టాఫాలోని ఫింగల్స్ కేవ్. జెయింట్స్ కాజ్‌వే లాగానే, ఫింగల్స్ కేవ్ కూడా అదే పురాతన లావా ప్రవాహం ద్వారా ఏర్పడింది మరియు అదేవిధంగా సుష్ట, షడ్భుజి బసాల్ట్ స్తంభాలను కలిగి ఉంది. ఈ గుహ దాని సహజంగా వంపుతిరిగిన పైకప్పు, ప్రతిధ్వనించే ధ్వనికి ప్రసిద్ధి చెందింది. ఇవి శతాబ్దాలుగా కళాకారులు, స్వరకర్తలను ప్రేరేపించాయి. ఫింగల్స్ కేవ్ ప్రపంచ వారసత్వ ప్రదేశం కానప్పటికీ, ఇది అదే భౌగోళిక ప్రావిన్స్‌లో భాగం. యూరోపియన్ జానపద, కళాత్మక సంప్రదాయాలలో పాతుకుపోయిన సాంస్కృతిక అనుబంధాలను పంచుకుంటుంది. ఫింగల్స్ కేవ్ దాని శబ్ద, సౌందర్య లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. సెయింట్ మేరీస్ ద్వీపం తీరప్రాంత ఉష్ణమండల నేపథ్యంలో స్తంభాల జాయింటింగ్ విస్తృత ప్లానర్ విస్తారాన్ని ప్రదర్శిస్తుంది. ఫింగల్స్ కేవ్ నాటకీయ క్లిఫ్‌సైడ్ సెట్టింగ్ (కొండ అంచు) వలె కాకుండా, సెయింట్ మేరీస్ ద్వీపం లోతట్టుగా, నేరుగా అందుబాటులో ఉంటుంది.

**డెవిల్స్ పోస్ట్‌పైల్, అమెరికా**

అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న డెవిల్స్ పోస్ట్‌పైల్ నేషనల్ మాన్యుమెంట్ కూడా ఒకే విధమైన పోలికను కలిగి ఉంటుంది. ఈ రక్షిత ప్రాంతం 'బసాల్టిక్ కాలమ్నార్ జాయింటింగ్' (స్తంభాల వంటి రాతి నిర్మాణాలు) కు ఒక అరుదైన ఉదాహరణగా నిలుస్తుంది. ఇక్కడి రాతి స్తంభాలు 60 అడుగుల ఎత్తు వరకు ఉండి, అద్భుతమైన సౌష్టవాన్ని ప్రదర్శిస్తాయి. 'జెయింట్స్ కాజ్ వే', 'ఫింగల్స్ కేవ్' వద్ద ఉన్న స్తంభాల మాదిరిగానే, డెవిల్స్ పోస్ట్‌పైల్ కూడా లావా త్వరగా చల్లబడటం ద్వారా ఏర్పడింది. అయితే, సెయింట్ మేరీస్ ద్వీపంలోని తీర ప్రాంత మరియు ద్వీప నేపథ్యానికి పూర్తి భిన్నంగా, డెవిల్స్ పోస్ట్‌పైల్ ఒక ఇన్ ల్యాండ్ పర్వత పర్యావరణ వ్యవస్థలో భాగంగా ఉంది.

డెవిల్స్ పోస్ట్‌పైల్ సమశీతోష్ణ అటవీ ప్రాంతంలో ఉండగా, సెయింట్ మేరీస్ ద్వీపం ఉష్ణమండల సముద్ర వాతావరణంలో ఉంది. ఇక్కడ సముద్రపు ఉప్పు జల్లులు, వర్షాకాలపు శీతోష్ణస్థితి కారణంగా ఒక ప్రత్యేకమైన సూక్ష్మ-పర్యావరణ వ్యవస్థ ఏర్పడింది. ఒకే రకమైన భౌగోళిక ప్రక్రియలు విభిన్న వాతావరణ, భౌగోళిక పరిస్థితులలో ఎలా మారుతాయనే దానిపై ఈ రెండు ప్రాంతాలు కీలకమైన శాస్త్రీయ సమాచారాన్ని అందిస్తాయి.

డెవిల్స్ పోస్ట్‌పైల్ ఇప్పటికే గణనీయమైన పరిరక్షణ చర్యలను పొందింది. భౌగోళిక కట్టడాలను ఎలా రక్షించాలో చెప్పడానికి ఒక నమూనాగా నిలుస్తుంది. సెయింట్ మేరీస్ ద్వీపంలోని రాతి నిర్మాణాలకు కూడా ఇటువంటి రక్షణ ఎంతో అవసరం. ఎందుకంటే ఇవి ప్రస్తుతం ప్రకృతి సహజమైన కోత, పర్యాటక ఒత్తిడి వంటి మానవజన్య ముప్పులకు గురయ్యే ప్రమాదంలో ఉన్నాయి.

- ఎన్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com

# ఘన సంస్కృతికి ప్రతిబింబాలు – గండికోట వారసత్వ ఉత్సవాలు...!!

*(2026, జనవరిలో గండికోట వారసత్వ ఉత్సవాలు జరగనున్న సందర్భంగా..!!)*

నేషనల్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించబడిన చింతకుంట రాక్ పెయింటింగ్స్, తొలితెలుగు శాసనం, ఇండియన్ గ్రాండ్ కాన్యన్‌గా ప్రసిద్ది చెందిన గండికోట లాంటి చారిత్రక విశిష్టతలను కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడపజిల్లాలో ఉన్న గండికోటలో రాష్ట్రప్రభుత్వం జనవరి, 2026లో వైభవోపేతంగా గండికోట వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నది. ఈ నేపథ్యంలో గండికోట విశిష్టతను, వారసత్వ ఉత్సవాల ప్రాధాన్యతను మనం కూడా తెలుసుకుందాం!!

**ఘనత చరితకు నిలయం – గండికోట దుర్గం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, కడప జిల్లా, జమ్మలమడుగుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన గండికోటకు చారిత్రకంగా, భౌగోళికంగా, సాంస్కృతికంగా ఎన్నో ప్రత్యేకతలున్నాయి.



**చారిత్రక విశిష్టతలు:**

**ప్రాచీన దుర్గం:** గండికోటను కళ్యాణీ చాళుక్యరాజు అహవమల్ల సోమేశ్వరుని సామంతుడైన కాకరాజు క్రీ.శ.1123లో నిర్మించాడు. తదుపరి కాకతీయుల పాలనా కాలంలో కోట మరింత విస్తరించబడింది.

**విభిన్న రాజవంశాల పాలనకు నిలువెత్తు సాక్ష్యం:** గండికోటను 1791లో బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకోక మునుపు కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు, కుతుబ్‌షాహీలు, మొగలులు లాంటి ప్రసిద్ధి చెందిన రాజవంశాలు పాలించాయి.

**టావెర్నియర్‌చే కీర్తించబడిన సమున్నత ప్రాంతం:** గండికోట ప్రాంతం సిరిసంపదలకు నిలయమని, వజ్రాల మైనింగ్ కూడా జరిగేదని విజయనగర రాజధాని నగరమైన హంపితో పోలిస్తే వ్యూహాత్మకంగా గండికోట ఎంతో బలమైనదని ఫ్రెంచ్‌యాత్రికుడు, వజ్రాల వ్యాపారి జీన్–బాప్టిస్ట్ టావెర్నియర్ వేనోళ్ళా కీర్తించారు.

**బలమైన సైనిక శక్తికి కేంద్రం:** 20 అడుగుల ఎత్తైన ప్రవేశద్వారం, 101 బురుజులు, 8 మైళ్ల విస్తీర్ణం, పెద్ద ఎత్తున సైన్యాన్ని కలిగి ప్రాంతీయ యుద్ధాల్లో గండికోట నిర్ణయాత్మక శక్తిగా ఉండేది.

**వేమన ఈ ప్రాంతం వాడే:** ప్రజాకవిగా ప్రసిద్ధిచెంది సమాజంలోని అవలక్షణాలను తన పదునైన పద్యాలతో తుత్తునియలు చేసిన వేమన గండికోట వాసేనని, ఆయన అన్న, కడప సుభా పరిధిలోని జమ్మలమడుగు సమీపంలో నున్న గండికోట దుర్గాధిపతిగా ఉండేవాడని సీపీబ్రౌన్ రాశారు. (ఆధారం: డి177, ప్రతిపైన బ్రౌన్ వ్రాసుకొన్న నోట్స్)

**భౌగోళిక విశిష్టతలు:**

**సహజ సిద్ధ రక్షణలు కలిగిన ప్రదేశం:** గండికోట నిర్మించబడిన ప్రాంతం వ్యూహాత్మంగా ఎంతో కీలకమైనది. శత్రువులు కోటపై పట్టు సాధించడానికి ఏమాత్రం అవకాశం లేకుండా ఒకవైపు పెన్నానది, మరోవైపు ఎత్తైన కొండలు, అడవులతో కూడిన సహజసిద్ధమైన రక్షణలు గండికోటను పెట్టని కోటవలె సురక్షితంగా ఉంచేవి.

**గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియా:** ప్రపంచంలో అత్యంత లోతైన లోయ అమెరికాలోని నార్త్ వెస్ట్రన్ అరిజోనా రాష్ట్రంలో కొలరెడో నదీ పరీవాహక ప్రాంతంలో ఉండగా, భారతదేశంలో అత్యంత లోతైన లోయ గండికోటదే కావడం గమనార్హం. ఎర్రమలకొండలను తొలుస్తూ, పెన్నానది ఏర్పరిచిన ఈ లోయ 300 అడుగులు లేదా సుమారు 100 మీటర్ల లోతును కలిగి ఉంది.

**పునాదులు లేని కట్టడం:** నేటి ఆధునిక యుగంలో అత్యంత అధునాతన సాంకేతికతలతో నిర్మిస్తున్న కట్టడాలు సైతం, స్వల్ప కాలంలోనే పతనావస్థకు చేరుతుంటే, కొన్ని వందల సంవత్సరాల క్రితం సిమెంట్, కాంక్రీట్, ఆ మాటకొస్తే అసలు పునాదులే లేకుండా కేవలం బండరాళ్ళను కలిగిన రాతినేలపై నిర్మించిన గండికోట, నేటికీ చెక్కు చెదరకుండా ఠీవిగా నిలబడి చూపరులను ఆకట్టుకుంటోంది.

**సాంస్కృతిక విశిష్టతలు:**

**రమణీయ శిల్పకళ:** గండికోటలో మాధవరాయ, రఘునాథస్వామి ఆలయాలలో ద్రవిడ శైలికి చెందిన అత్యంత రమణీయ శిల్పాలున్నాయి. సహజత్వం ఉట్టిపడేలా చెక్కిన ఈ శిల్పాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**హిందూ–ముస్లిం సంస్కృతికి ప్రతిరూపం:** ఒకవైపు హిందూ దేవాలయాలతో పాటు, ముస్లిం పాలనకు సాక్షీభూతంగా 15వ శతాబ్దానికి చెందిన జామియా మసీదు కూడా గండికోటలో నెలకొని హిందూ–ముస్లిం సంస్కృతుల ఐక్యతను చాటుతున్నాయి.

**ప్రాచీన కట్టడాలు:** కోట లోపల వాచ్‌టవర్, బందీఖానా, ధాన్యగారాలు, కత్తుల కోనేరు, గుర్రపుశాలలు లాంటి ప్రదేశాలు గండికోట సాంస్కృతిక విశిష్టతకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

**పర్యాటకుల స్వర్గ ధామం:** ఇక్కడ పర్యాటకులకు రమణీయ ప్రకృతి, చారిత్రక సుందర ప్రదేశాలను ఆస్వాదించే వీలుతో పాటు రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, లాంటి 5 రకాల సాహస కృత్యాలతో శిక్షణను

కూడా అందిస్తున్నారు.

**వారసత్వ ఉత్సవాలు – విశిష్టత:** గతంలో సృష్టించబడి, నేటికీ చారిత్రక ప్రాముఖ్యతను కలిగి ఉన్న సాంప్రదాయాలు, భాషలు మరియు కట్టడాలు వంటి సమాజం యొక్క నిర్దిష్ట సంస్కృతికి చెందిన లక్షణాలను "వారసత్వంగా" చెప్పవచ్చు. ఇలాంటి వారసత్వాన్ని నేటి తరానికి అందించడానికి ప్రభుత్వాలు నిర్వహించే వారసత్వ ఉత్సవాల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి.

**i) సాంస్కృతిక వైవిధ్యాన్ని పెంపొందించడం:** నిర్దిష్టమైన ప్రణాళిక మరియు నిర్వహణ ద్వారా వారసత్వ ఉత్సవాలను జరుపుకోవడం వల్ల విభిన్న సమాజాలు, సంస్కృతులు ఒకదాని గురించి మరొకటి సంపూర్ణ అవగాహన పొందడం, తద్వారా అన్ని సంస్కృతులను గౌరవించడం అలవడుతుంది. దీనివల్ల సాంస్కృతిక వైవిధ్యం పెంపొందడంతోపాటు, శాంతియుత సమాజస్థాపనకు మార్గం సుగమమవుతుంది.

**ii) సాంస్కృతిక ఉనికిని కాపాడుకోవడం:** ప్రాచీన సాంప్రదాయాలు, ఆచారాలు, భాషలు, సంస్కృతిక కట్టడాలను వారసత్వ ఉత్సవాల పేరుతో పరిరక్షించడం వల్ల తాము ఫలానా సంస్కృతికి చెందిన వారమన్న విశ్వజనీన భావనను ప్రజలలో పెంపొందించవచ్చు.



**iii) విద్యార్థులలో చారిత్రక అవగాహన పెంపొందించడం:** వారసత్వ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు చారిత్రక కట్టడాలను సందర్శించడం ద్వారా వారికి తమ చారిత్రక మూలం పట్ల లోతైన అవగాహన కలుగుతుంది. ప్రభుత్వం రూపొందించే కరపత్రాలు, పుస్తకాలు, పాటలు లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు వారి చారిత్రక వారసత్వం యొక్క సమున్నత విలువలను గుర్తిస్తారు.

**iv) పర్యాటక మరియు ఆర్థికాభివృద్ధి ప్రోత్సహించడం:** వారసత్వ ఉత్సవాల నిర్వహణ వల్ల స్మారక చిహ్నాలు మరియు చారిత్రక కట్టడాలు లాంటివి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది సందర్శకులను ఆకర్షిస్తాయి. ఫలితంగా స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలతోపాటు, ప్రభుత్వానికి ఇబ్బడిముబ్బడిగా ఆదాయం లభిస్తుంది.

**v) సుస్థిరాభివృద్ధికి ఊతం:** వారసత్వ ఉత్సవాల నిర్వహణ వల్ల ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాలని, మనచుట్టూ ఉన్న ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడినప్పుడే చారిత్రక వారసత్వ సంపద మనుగడ వీలవుతుందన్న స్పృహ సమాజంలోని ప్రతి ఒక్కరిలో కలుగుతుంది. ఇది సుస్థిరాభివృద్ధికి దారితీస్తుంది.

**వసుధైక సమాజ స్థాపన:** వారసత్వ ఉత్సవాల నిర్వహణ వల్ల ప్రజలలో తామంతా ఏ మతం, కులం, వర్గానికి చెందిన వారమైనా ఒక విశిష్ట సంస్కృతికి వారసులమన్న వసుధైక భావన పెంపొందుతుంది. ఇది సామాజిక ఐక్యతకు బాటలు వేస్తుంది.

**ఊపందుకుంటున్న అభివృద్ధి పనులు:** గండికోటలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్థానిక శాసనసభ్యులు ఆదినారాయణరెడ్డి చొరవతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గండికోటపై ప్రత్యేక దృష్టి సారించారు. విజయవాడ కృష్ణానది తరహాలో గండికోటలో కూడా సీ ప్లేన్ నిర్వహణకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో **స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ (సాస్కి)** పథకంకింద గండికోటకు 79 కోట్లకు గత జులైలో నిధులు మంజూరు కావడం ఆహ్వానించదగ్గ పరిణామం. 10,000 చ॥ అడగుల విస్తీర్ణంలో టూరిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, 4000 చ॥ అడుగుల విస్తీర్ణంలో రెండు ఎమినిటీస్ ఇన్ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. చారిత్ర వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, రోప్‌వే, గ్లాస్ బాటమ్ వాక్‌వే, లైట్ అండ్ సౌండ్ షో లాంటి సౌకర్యాలు గతంలో ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా గ్రాండ్ కాన్యన్ అందాలను ఆకాశం నుంచి వీక్షించేందుకు వీలుగా సీప్లేన్ లేదా హెలిరైడ్ సదుపాయం కల్పించేందుకు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇంత వరకు 5 సార్లు గండికోట వారసత్వ ఉత్సవాలు నిర్వహిస్తే, అందులో 4సార్లు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోనే నిర్వహించడం గమనార్హం.

**యునెస్కో గుర్తింపుకు కృషి చేయాలి:** అరుదైన జియోలాజికల్, ఎకలాజికల్, బయోలాజికల్ విశిష్టతల కారణంగా తిరుమల కొండలు, విశాఖ జిల్లాలోని ఎర్రమట్టి దిబ్బలను సెప్టెంబర్ 2025లో యునెస్కో తాత్కాలిక వారసత్వ జాబితాలో చేర్చడం హర్షణీయం. గండికోటలోని గ్రాండ్ క్యానియన్ మరియు అందులోని చారిత్రక కట్టడాలు కూడా విభిన్న కోణాల్లో ఎంతో విశిష్టతను కలిగి ఉన్నాయి. కాబట్టి గండికోటను కూడా యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు చేపట్టాలి. తద్వారా గండికోట అభివృద్ధికి భూరి నిధులు విడుదలై కోటతోపాటు, సమీప ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

**ఇంటాక్ కృషి:** గండికోటకు యునెస్కో గుర్తింపు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం చేపట్టే ప్రతి కర్యాక్రమంలోనూ ఇంటాక్ కడప చాప్టర్ అవిరళకృషి చేస్తోంది. నిత్యం అధికారులు నిర్వహించే చర్చాగోష్ఠుల్లో పాల్గొంటూ, వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ, పుస్తకాలు ప్రచురిస్తూ, ఇతోధిక తోడ్పాటునందిస్తోంది.

**చివరగా:** గండికోట ఘనచరితను నేల నలుచెరగులా చాటేలా అంగరంగవైభవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గండికోట వారసత్వ ఉత్సవాలలో దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రియులందరూ తరతమభేదం లేకుండా అసంఖ్యాకంగా పాల్గొని గండికోట చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని తనివితీరా ఆస్వాదించి **(సబ్‌కాసాథ్, సబ్‌కా వికాస్ నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రవచిత ఏక్‌భారత్ శ్రేష్ఠ్ భారత్)** కలను సాకారం చేయడంలో భాగస్వాములు కావాలని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం.

–పుట్టా పెద్దఓబులేసు
స్కూల్ అసిస్టెంట్, హిస్టరీ రీసెర్చ్‌స్కాలర్
(ద్రవిడ విశ్వవిద్యాలయం),
ఇంటాక్ జీవితకాల సభ్యులు,
జమ్మలమడుగు, కడప జిల్లా m : 9550290047




# తెలంగాణలో పర్యాటక రంగాన్ని ఎలా ప్రమోట్ చేయాలి

"దేశాన్ని నిజంగా తెలుసుకోవాలంటే ప్రయాణించి జ్ఞానం సంపాదించాలి" అనే భావన. ప్రాచీన కాలం నుండి ఉన్నదే. మనిషి ఆహారం, ఆశ్రయం కోసం చేసిన అన్వేషణ, అలాగే చుట్టూ ఉన్న ప్రపంచంపై ఉన్న కుతూహలం ప్రయాణానికి దారితీసింది. ప్రయాణం క్రమంగా పర్యాటకంగా రూపాంతరం చెందింది. పర్యాటకం అనేది పర్యాటకుల కార్యకలాపాలు మరియు వారికి సేవలందించే వారితో సంబంధం ఉన్న విభిన్న అంశాల సమాహారం. విద్యా సాధనగా, సాంస్కృతిక మార్పిడికి సాధనంగా పర్యాటకం. మానవ జీవితంలో ఒక ముఖ్య భాగం. తెలంగాణ ప్రభుత్వం ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే పాలసీలు, కార్యక్రమాల గురించి ఆలోచిస్తున్న దిశలో పర్యాటక తెలంగాణ కొత్త పుంతలు తొక్కనుంది.

### తెలంగాణ యొక్క సాంస్కృతిక ప్రాధాన్యత

ప్రపంచంలో పర్యాటకానికి ప్రేరణల్లో సాంస్కృతిక రంగం ముఖ్యమైనది. తెలంగాణలో ప్రతీ అడుగు చరిత్ర పూర్వ యుగం నుండి ఆధునిక కాలం వరకు ఎంతో విలువైన చరిత్రను, సంస్కృతిని అణువణునా నింపుకుని ఉంది. అయితే ఎంత ప్రాచుర్యం పొందాలో అంత మేరకు ప్రాచుర్యం రాలేదన్నది సత్యం. అందుకే మన రాష్ట్రంలో పర్యాటకాన్ని జూన్ 2, 2014న ముందు జూన్ 2, 2014 తర్వాత అనే విశ్లేషించాలి.

తెలంగాణ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కొన్ని విశేషాలు తెలంగాణను ప్రపంచ సాంస్కృతిక వేదికపై ఆవిష్కరించాయి. అందులో మొదటిది రామప్ప గుడి యునెస్కో హెరిటేజ్ జాబితాలో చోటు చేసుకోవడం. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హెరిటేజ్ తెలంగాణ, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వంటి సంస్థల కృషి ఈ విజయం వెనుక ఉన్నాయి. ఇప్పుడు ముడుమాల్ లోని బృహత్ శిలా యుగపు మెన్హిర్లు యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటుచేసుకోవడానికి దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్ట్, హెరిటేజ్ తెలంగాణల కృషి ఎంతో ఉంది. పర్యాటకం గురించి మాట్లాడుతూ ఈ రెండింటితో ఎందుకు మొదలు పెట్టాలంటే యునెస్కో జాబితాలో ఉండటం అంటే తెలంగాణ పర్యాటకం అంతర్జాతీయం కావడమే.

దేశంలో ఉన్న మధ్య యుగ కట్టడాలతో పోటీ పడగలిగిన గోల్కొండ కోట, కుతుబ్షాహీ సమాధులు, చార్మినార్ లకు పర్యాటకంగా ఇంకా ఎంతో అవకాశం ఉంది. యాదగిరి గుట్టలో నారసింహుడు, వరంగల్‌లో పద్మాక్షి, భద్రకాళులు, లష్కర్ బోనాల్లో వేల ఏళ్లుగా వస్తున్న అమ్మ దేవతల ప్రభావం ఇప్పటికీ ఇంకా లోకల్ స్థాయి సంస్కృతిగానే ప్రొజెక్ట్ అవుతున్నది. వీటిని ఇంకా ప్రమోట్ చేయాల్సిన అవకాశం ఉంది. కాకతీయ ఆలయాల బ్యాక్ డ్రాప్‌గా పేరిణి నాట్యాన్ని, తాండవ నర్తనాన్ని విశ్వవేదికపై ప్రదర్శించే అవసరం ఉంది. పాండవుల గుట్టలో రాతి యుగపు చిత్ర కళతో పాటు సాహస పర్యాటకం ఇంకా పెరగాల్సి ఉంది.

వేల ఏళ్ళ కిందే ఈ నేలలో విలసిల్లిన బౌద్ధం, జైనం అడుగుల్ని చేసేందుకు ధూళికట్ట, ఫణిగిరి, నేలకొండపల్లి, గొల్లత్తగుడి వంటి స్థలాల్ని కన్సర్వేషన్, ప్రిజర్వేషన్ అనే ప్రామాణిక పద్ధతిలో నిలిపి పర్యాటకుల్ని ఆకర్షించాల్సి ఉంది. బుద్ధవనం వంటి ఆధునిక ప్రపంచ స్థాయి బుద్ధిష్ట్ థీమ్‌పార్క్ తెలంగాణలో ఉండడం మనకు ఒక వరం.

ఇన్ని వనరులు, విశేషాలు ఉన్న తెలంగాణ పర్యాటకం, రాజస్థాన్, కర్ణాటక వంటి రాష్ట్రాల పర్యాటక కార్పొరేషన్లు చేసిన కృషిని, పద్ధతుల్ని అధ్యయనం చేయాలి. వర్చ్యువల్ డిస్‌ప్లే, సోషల్ మీడియా వంటి ఆధునిక ప్రచార పద్ధతులు పర్యాటకులకు తెలంగాణను వారి ప్రాంతాల్లోనే పరిచయం చేయాలి. అప్పుడే పర్యాటకుల పాదాలు తెలంగాణ వైపు అడుగులేస్తాయి.

– డా॥ వనజ ఉదయ్, అసోసియేట్ ప్రొఫెసర్,
నృత్య విభాగం, SPRTU, హైదరాబాద్

# చేతివ్రాతను మరువద్దు

మీరు కాగితాన్ని, కలాన్ని ఉపయోగించి ఎన్ని రోజులు అయ్యిందో మీకు గుర్తుందా? ఆలోచిస్తున్నారు అంటే మీరు ఉపయోగించలేదు అని అర్థం. అంటే మనం స్కూల్ రోజుల్లో తప్ప మిగిలిన సమయంలో కాగితాన్ని, కలాన్ని ఉపయోగించడం మర్చిపోయాం. ఇప్పుడు సెల్ ఫోన్ కాలం వచ్చాక కాగితం, కలంతో మొత్తానికే పని లేకుండా పోయింది. అంతా సెల్లు మయమే అయ్యింది.

స్వాతంత్ర్య ప్రకటనపై సంతకం చేసిన మొదటి వ్యక్తి జాన్ హాన్‌కాక్ పుట్టినరోజున **జనవరి 23వ తేదీని జాతీయ చేతివ్రాత దినోత్సవంగా** పాటిస్తారు. స్మార్ట్‌ఫోన్‌లు మరియు వాయిస్-టు-టెక్స్ట్ అప్లికేషన్‌ల ఈ యుగంలో, ప్రజలు పాత పెన్ను మరియు




కాగితం యొక్క స్పర్శ ఆనందాన్ని పొందడం మీకు తెలియక పోవచ్చు.

మీ మెదడుకు పదును పెట్టడానికి చేతివ్రాత ఒక ముఖ్యమైన నైపుణ్యం అని మనం తరచుగా మర్చి పోతున్నాము. అంతే కాదు, ఆందోళన కలిగించే ఒకరి ఆలోచనల వేగాన్ని నెమ్మదించడంలో సహాయ పడగల క్లినికల్ సైకాలజిస్టులు థెరపిస్టులకు సూచించే ఒక అభ్యాసం. రాయడం వలన మీరు విషయాలను గుర్తుంచుకోవడానికి సహాయపడుతుంది.

పూర్వం ఋషులు మునులు తాళపత్ర గ్రంథాలపై పాలీలతో రాసేవారు. ఆ తర్వాత సిరా పెన్నులతో వ్రాసేవారు అయితే ఇది పెద్దతతంగంగా ఉండేది. సిరాను పెన్నులో పోయడం అనేది ఒక కళ. ఒక్క చుక్క కూడా కింద పడకుండా పెన్నులో పోసి వ్రాసేవారు.

రాయడం వలన మనలోని ఆలోచనలను మంచి రూపం ఇవ్వవచ్చు. అలాగే మన మనసులోని మాటలను చెప్పలేని వారికి చెప్పవచ్చు. అందుకే ఉత్తరాలవర్వం మొదలైంది. ఉత్తరాలలో తమ ఆలోచనలు తమ ముందున్న భవిష్యత్తు ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలి అని లేఖలు రాసేవారు. రచయితలు మొదటగా ఆశ్రయించేది కాగితం కలాన్ని.

### చేతివ్రాత ఆనందాన్ని పెంచుతుంది

రోచెస్టర్ విశ్వవిద్యాలయం యొక్క హెల్త్ ఎన్‌సైక్లోపీడియా ప్రకారం, జర్నలింగ్ మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కాగితంపై ఆలోచనలు, భావోద్వేగాలను వ్రాయడం వలన ప్రజలు తమ భావాలను బాగా వ్యక్తీకరించడానికి, వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

కాగితం పై రాయడం వల్ల మనం మనలోని భావాలను మనమే తెలుసుకోవచ్చు. మనమేం ఆలోచిస్తున్నాం, మన మనస్తత్వం ఏమిటి అనేది మన చేతిరాత తో తెలుస్తుంది. క్రిమినల్స్‌ను కూడా పోలీసులు ఏదైనా రాయమని అంటారు. అలా వాళ్ళు రాసిన దాన్ని బట్టి వారి మనస్తత్వాన్ని నిర్ధారణ చేస్తారు. వాళ్ళు నేరం చేశారా లేదా అనేది కూడా తెలుసుకోవచ్చు.

ఇక పోతే మనం రాయడం మర్చిపోయాం, కాబట్టి ఇక నుండి తరచుగా కాగితం పై రాసే ప్రయత్నం చేయడం వల్ల మీరు మీ ఆనందాన్ని పొందవచ్చు, ఇతరులతో మీ భావోద్వేగాలను కూడా పంచుకోవచ్చు, కానీ మీ రాతను అందంగా రాయడానికే ప్రయత్నం చేయండి. దాని వల్ల మీ ఆరోగ్యం, మనసు ఉత్తేజితం అవుతాయని ఖచ్చితంగా చెప్పవచ్చు. మీ ఆలోచనలకు కూడా పదును పెరుగుతుంది. మీ రాతను బట్టి మీ మనస్తత్వం ఉంటుంది. అందువల్ల చేతి రాత ప్రాముఖ్యాన్ని, ప్రాధాన్యతను తెలుసుకుని, కాగితం పై మీ మనసులోని భావాలను పంచుకుంటే మీరెంటో మీరే తెలుసుకోవచ్చు. అందరికీ జాతీయ చేతి వ్రాత దినోత్సవ (జనవరి 23) శుభాకాంక్షలు.

– జుగాష్‌విలి, m : 8309452998
e:desk.deccan@gmail.com

# పోర్చుగీసులు (1498-1665)

"ఈ పట్టణము (మచిలీపట్నం) నందు దేశీయ వర్తకులు, పారశీకులు, సిరియనులు, ఆర్మేయనులు, మహమ్మదీయులు, పోర్చుగీసులు, డచ్‌వారు, ఆంగ్లేయులు, ఫ్రెంచ్‌వారు కూడా వర్తకము చేసుకొను చుండిరి" అని వైద్యుడు 'ఫ్రేయరు' నివేదించి యున్నాడు. భారతదేశంతో యూరప్ దేశీయులకు వ్యాపార సంబంధాలు గ్రీకుల కాలం నుండి ఉన్నాయి. మధ్యయుగాల్లో భారతదేశం - యూరప్ - ఆగ్నేయాసియా దేశాల మధ్య అనేక మార్గాలగుండా వ్యాపారం సాగింది. ఆసియా దేశాలకు సంబంధించినంత మేర, ఈ వ్యాపారం అరబ్బు వర్తకులు, నావికులు నిర్వహించేవారు. భారత్ నుంచి యూరప్ దేశాలకు వెళ్ళే సరుకులు చాలా దేశాలగుండా ప్రయాణించి అనేక చేతులు మారేవి. దారిమధ్య దేశాలవారు విధించే టోల్ పన్నులు, వాణిజ్య సుంకాలు భారీగా చెల్లిస్తూనే, తమ దేశాల్లో భారతదేశపు సరుకుల మీద నూటికి నూరుశాతం పైనే లాభాలార్జించేవాళ్ళు వర్తకులు.




నాడు వర్తకం కొంతమేర జలరవాణా ద్వారా, మరికొంత భూమార్గాల ద్వారా సాగుతుండేవి. ఈ మార్గాల కూడలి నల్లసముద్ర ముఖద్వారంలోని 'బైజాన్‌టయిన్' (తూర్పు రోము) రాజధాని 'కాన్‌స్టాంటి నోపిల్' నగరం గొప్ప వర్తక మార్కెట్‌గా ఉండేది. క్రీ.శ. 1452-53లో ఒట్టొమాన్ టర్కీ వారు కాన్‌స్టాంటినోపిల్ మీద దాడిచేసి ఆక్రమించారు. దీంతో తూర్పు - పడమర దేశాల మధ్య వ్యాపార మార్గాలు టర్కీల చేతుల్లో కెళ్ళిపోయాయి. యూరోపియనులు శీతాకాలంలో సరియైన తాజా ఆహారం దొరకని పరిస్థితులలో, ఉప్పు - మిరియంపొడి - సుగంధద్రవ్యాలలో ఊరవేసుకొన్న మాంసాహారాన్ని తిని శీతాకాలం నాల్గునెలలు గడిపేవారు.

సుగంధద్రవ్యాల వ్యాపార ప్రపంచాన్ని, చేనేతవస్త్ర ప్రపంచాన్ని శాసిస్తున్న భారతదేశం మరియు ఇండోనేషియాతో వ్యాపార సంబంధాలు యూరోపియన్లకు అనివార్యమయిన కాలమది. ఆనాడు నావికులు, వ్యాపారులు కథలు కథలుగా చెప్పుకొనే భారతదేశ తూర్పుతీరం, అందునా బందరు పట్టణ వైభవం యూరపు దేశాలకు అదొక రంగుల స్వప్నం. భారతదేశానికి, ఇండోనేషియాకు వ్యాపార వాణిజ్యాలు సాగించేందుకు ఎక్కువ లాభకరమైన, క్షేమకరమైన మరింత తక్కువ దూరంగల నూతన మార్గాన్వేషణ తొలిదశలో, తొలిదిశగా స్పెయిన్ - పోర్చుగల్ నావికులు ఆయా దేశాధినేతల ప్రోత్సాహంతో ప్రారంభించారు.

ఈ అన్వేషణల ఫలితంగా 1494లో స్పెయిన్ దేశస్థుడు కొలంబస్, భారత ఉపఖండానికి కొత్తమార్గం కనిపెట్టటానికి బయల్దేరి, అమెరికా ఖండాన్ని కనిపెట్టాడు. క్రీ.శ.1498లో పోర్చ్‌గల్ నావికుడు వాస్కోడగామా ఆఫ్రికా ఖండపు చివర (గుడ్‌హోప్ అగ్రం)ను చుట్టి, హిందూ మహాసముద్రం ప్రవేశించి, గుజరాత్ వర్తకుల సహకారంతో భారత పశ్చిమతీరం 'కళ్ళికోట' (క్యాలికట్)రేవుకు చేరాడు. ఆ విధంగా ఐరోపా ఖండంకు గుడ్‌హోప్ అగ్రం గుండా నూతన జలమార్గాన్ని ఆవిష్కరించాడు వాస్కో. ఇది "ప్రపంచ వ్యాపార చరిత్రనే మార్చగలిగిన సంఘటన".

"కొలంబస్ అమెరికాను కనిపెట్టటం, వాస్కో-డ-గామా భారతదేశానికి నూతనమార్గం కనిపెట్టాననుకోవటం మానవజాతి చరిత్రలో నమోదైన రెండు అత్యంత ప్రధానమయిన మహత్తర సంఘటనలు" అని ప్రపంచ గొప్ప ఆర్థికవేత్త ఆడంస్మిత్ అన్నాడు. దీంతో అత్యంత లాభకరమైన తూర్పుదేశాల యావత్ వర్తకం పోర్చుగీసు వర్తకుల చేతుల్లోకి జారిపోయింది. భారతదేశపు పడమర కోస్తా కొచ్చిన్, గోవా, డయ్యూ - డామన్ ప్రాంతాల్లో పోర్చుగీసులు తమ వర్తక స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. సైనిక జలంతో పోర్చుగీసులు తమ వర్తక వ్యాపారాలు నడిపారు. 'పట్టుమని పాతికమంది అయినా లేని పోర్చుగల్ సైనికులు, నావికులు అమేయశక్తి సంపన్నమైన భారత, ఆసియా రాజ్యాలకు వ్యతిరేకంగా సముద్రాధిపత్యం చెలాయించ గలిగారంటే దానికి కారణం వారి నౌకా సాయుధ బలాధిక్యతేనని చెప్పాలి' అంటారు చరిత్రకారుడు బిపిన్‌చంద్ర తన ఆధునిక భారతదేశ చరిత్రలో. పోర్చుగీసుల బెడద పశ్చిమతీరంలో ఉండి, విజయనగర సామంతులైన కళ్ళికోట జామెరిన్, భట్కల్, హోనోవర్ పరిపాలనను పోర్చుగీసు సాయుధ వర్తకులు ధిక్కరిస్తూనే ఉన్నారు. కృష్ణదేవరాయలు అనుమతితో పోర్చుగీసులు 1509లో గోవాను ఆక్రమించారు. 1520లో కళింగ దిగ్విజయం పిదప రాయచూర్ యుద్ధంలో పోర్చుగీసులు, కృష్ణదేవరాయలుతో తమ పోర్చుగల్ గుఱ్ఱాలను విజయనగరానికి టోకుగా అమ్మే ఒడంబడిక

చేసుకొని, బదులుగా గోవా తీరంలో వ్యాపారం పేరుతో కోటలాంటి భవన సముదాయాన్ని కట్టుకున్నారు.

క్రీ.శ. 1540 ప్రాంతంలో చాలామంది పోర్చుగీసు ప్రైవేటు వ్యాపారులు మసులీపట్నంలో ఉన్నట్లు నమోదైంది.

(A note on Narsapurpeta : A "Syncretic" ship building in South India, 1570-1700 by Sanjay Subramanyam). అప్పటికి బందరుకోట, కోటగాలేదు. ఇంకా వ్యాపారస్తులయిన యూరోపియనులను ఆకర్షించలేదు. ఓడరేవు నానుకొని చుట్టూ చిత్తడినేలల మధ్య పరివేష్టితమైన దిబ్బగా ఉన్నది. పూర్వకాలము నాటి దీపస్థంభం (లైట్‌హవుస్) నేటికి కూడా తవిసిపూడి - గోపువానిపాలెం సరిహద్దున సముద్రానికి ఒక కిలోమీటరు దిగువకు ఉన్నది. సముద్రం నుండి నాడు నడిచిన ఒక ఉప్పుకాల్వ పాయనానుకొని పోర్చుగీసులు తవిసిపూడిలో తమ నివాసస్థావరం ఏర్పాటు చేసుకొనటం జరిగింది. ఈనాడు ఆస్థావరం పోర్చుగీసుల నివాస శిథిల పునాదుల్తో 'ఫరంగిదిబ్బ'గా పిలువబడుతుంది. వీరి నివాసమునకు దక్షిణముగా వారి సరుకుల గోదాము భవన పునాది శిథిలములున్నవి. ఫరంగిదిబ్బకు తూర్పుముఖంగా వారి సమాధులుండేవి. ఇక్కడ నుండి పోర్చుగీసు ప్రవేటు ట్రేడర్లు వ్యాపార నిర్వహణ చేసేవారు. 16 శతాబ్దం చివరికాలంలో, కోరమండల్ తూర్పుతీరంలో మసులీపట్నం ఓడరేవు సముద్ర వ్యాపారంలో అత్యున్నత దశకు చేరింది. బంగాళాఖాతం సముద్రంలో, పోర్చుగీసు వ్యాపారానికి వ్యతిరేకంగా, సుమత్రా దీవులలోని దిగువ బర్మారేవు అఛీన్, అరకాన్, మసులీపట్నం రేవుల వ్యాపారం పుంజుకొంది. 1550 నాటికి మసులీపట్నం రేవు పెగూతోనూ, అఛీన్, బర్మా రేవులతోనూ వ్యాపార సంబంధాలు పెట్టుకొని, గోవాలో వ్యాపారం నిమిత్తం తిష్టవేసిన పోర్చుగల్ 'ఎస్టడో-డి- ఇండియా'కు దడ వణుకు పుట్టేస్థాయిలో బందరురేవు ఎదిగింది. మూరు దేశపు వ్యాపారులకు బందరురేవులో పట్టుదొరికేసరికి పోర్చుగీసుల కంట్రోలులోగల 'మలేకా' రేవుతో సంబంధాలు వదులుకున్నారు. చివరకు గోల్కొండ దర్బారులోనూ, మసులీపట్నంలోనూ అరెస్టయి జైలుశిక్షలు అనుభవిస్తున్న పోర్చుగీసు ఖైదీలను తమదేశం పోర్చుగల్ తరలించేందుకు మాత్రమే మసులీపట్నం ఓడరేవు పోర్చుగీసులకు ఉపయోగపడింది.



బందరు ఓడరేవు నుండి ఎర్రసముద్ర ప్రాంతపు పర్షియన్ గల్ఫ్ రేవులకు బంగాళాఖాతం మీదుగా సింహళద్వీపాన్ని చుట్టి భారతదేశ పడమర తీరపు రేవులగుండా ప్రయాణం చేసే ఓడలకు, గోవా తీరాన్నాక్రమించుకొని సాయుధదళంతో తిష్టవేసిన పోర్చుగీసు వ్యాపారుల బెడద కారణంగా, 1580 ప్రాంతంలో గోల్కొండ, గోవా పోర్చుగీసుల మధ్య ఒక సంధి కుదిరింది. పర్యవసానంగా బందరు - బందరు చుట్టుప్రక్కల పోర్చుగీసులు కొనుగోలు చేసిన టన్నులకొద్దీ వరి ధాన్యాన్ని, గోల్కొండ సుల్తానుకు చెందిన ఓడలలో బందరు ఓడరేవు గుండా పోర్చుగీసుల అధీనంలోని సింహళం, మలేకా రేవులకు ఎగుమతి చేసేవారు. దీనికి బదులుగా గోల్కొండ, బీజపూర్ నవాబుల సరుకులు శ్రీలంక, మలేకా, గోవా తదితర పోర్చుగల్ రేవుల మీదుగా, పర్షియన్ గల్ఫ్ రేవులు జిద్దా, బంద-రె-అబ్బాస్ మక్కా నగరాలకు వెళ్ళే ఓడలకెత్తేవాళ్ళు.

తూర్పుతీరపు మసులీపట్నం, నర్సరావుపేట, మద్రాస్ శాన్‌థోమ్ రేవులలో పోర్చుగీసు వర్తకులు వర్తక స్థావరాలు కట్టుకున్నారు. మద్రాసు రేవును గొప్పరేవుగా గుర్తించినవారు పోర్చుగీసులే. గోల్కొండ రాజ్యంలో ప్రధానరేవు బందరు ఓడరేవు. అందుకనే ఓడరేవులో విదేశీ వర్తకుల రక్షణ పట్ల పాలకులు అప్రమత్తంగా ఉండేవారు. 'గోల్కొండ తీరం (మసులీపట్నం రేవు) కొచ్చిన పోర్చుగీసు ఓడకు బందరు రేవులో డచ్ సాయుధ వర్తకులు నష్టం కలిగించగా, మచిలీపట్నం ఫౌజ్‌దార్ డచ్ వారిని కఠినంగా శిక్షించటం జరిగింద'ని డా॥ బి.యస్.ఎల్. హనుమంతరావు ఆంధ్రదేశ చరిత్రలో తెలిపారు. 1606లో మద్రాస్ శాన్‌థోమ్ వద్ద మూడు పోర్చుగీసు నౌకల్ని డచ్ నౌక ఒకటి తగులెట్టింది. 1610లో మసులీపట్నం వద్ద రెండు, పులికాట్ వద్ద రెండు మొత్తం నాల్గు పోర్చుగల్ ఓడలను డచ్ వారు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మీద తూర్పుతీరంలో పోర్చుగీసులకు డచ్ వారు ప్రత్యర్థులుగా ఉండగా సాయుధ ఘర్షణలు సాగేవి.

తెలుగువారు పోర్చుగీసులను గుర్తించటానికి ఉపయోగించిన పదం 'బుడత కీచులు'. పోర్చుగీసులు మన తెలుగుభాషను 'జెంటూ' అంటూ పిలిచేవారు. 1840లో 'ఎ గ్రామర్ ఆఫ్ ద తెలుగు లాంగ్వేజ్' వ్రాసిన సి.పి. బ్రౌన్ 'జంటూ' పదం తెలుగుభాషకు యూరోపియనులు ప్రయోగించటాన్ని ఖండించిన తర్వాత మాత్రమే ఈ పదం వాడకంలో తొలిగిపోయింది. యూరోపియనులో పోర్చుగీసుల ఎడల తెలుగువారికి హేయభావం, ద్వేషభావం ఉండేది. తెలుగుదేశంలో పోర్చుగీసులు వ్యాపారం చేసియున్నందున వారి దేశం నుండి బొప్పాయి, అనాస, మిరపకాయలు, టమాటో, పొగాకు మొదలగు పంటలు మనదేశంలో ప్రవేశించాయి.

17వ శతాబ్ది ప్రారంభంలో పులికాట్ సరస్సు వద్ద

వ్యాపారకేంద్రం నిర్మించుకోవటానికి గోల్కొండ నవాబు వద్ద డచ్‌వారు అనుమతి పొంది సైనికపరంగా బలమైన వర్తకస్థావరం నిర్మించుకున్నారు. 1629లో ఈ డచ్ కేంద్రాన్ని ధ్వంసం చేయటానికి పోర్చుగీసులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పోర్చుగీసు సాయుధులు భారత పశ్చిమ, తూర్పుతీరాల్లో ప్రయాణించే స్వదేశీ, విదేశీ ఓడలమీద సాయుధదాడులు జరిపి ఓడలను దోచుకొని వర్తకులను ప్రయాణికులను చంపి, ఓడలను నడిసముద్రంలో ముంచేవారు. 1639 నాటికల్లా భారతదేశ తూర్పు, పడమర సముద్రాల్లో పోర్చుగీసుల ప్రాభవం సన్నగిల్లి అడుగంటింది. డచ్ వారు పోర్చుగీసుల నాగపట్నం రేవును స్వాధీనం చేసుకొనగా, కుతుబ్‌షాహి ప్రభువులు మద్రాస్ శాన్‌థోమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు నూరేండ్లపాటు ఎదురులేని అజేయశక్తిగా భారత పశ్చిమ తూర్పుతీరజలాల్లో చలామణి అయిన పోర్చుగీసులనే బుడత కీచులు 1665 నాటికి తూర్పుకోస్తాలో గుర్తులు కూడా మిగల్చకుండా కనుమరుగయ్యారు. డచ్ వారు పోర్చుగీసు ఓడలమీద పైచేయి సాధించి, తమ ఓడలతో పాటు తూర్పుతీరంలో పులికాట్ మీదుగా ప్రయాణించే భారతదేశ ఓడలకు కూడా పోర్చుగీసుల దాడుల నుండి డచ్ సాయుధనౌకలు రక్షణ కల్పించేవారు.



**బందరులో పోర్చుగీసుల చర్చి నిర్మాణం 1645:**

1645 ప్రాంతంలో స్థానికంగా నివసిస్తూ ఉండిన పోర్చుగీసు ప్రజలు బందరులో తమకోసం సుల్తాన్ అనుమతితో ఒక చిన్న చర్చి నిర్మాణం చేసుకున్నారు. ఈ చర్చి 'అగస్టినీయుల'శాఖ నిర్వహించింది. ఆ చర్చి గోర్డెన్ మెంకజీ కిష్ణాజిల్లా మాన్యువల్ వ్రాసే 1883 నాటికే కనుమరుగై పోయింది. బందరుకోటలోని సెయింట్ జాన్ చర్చి యార్డులోని క్రైస్తవ సమాధులలో పోర్చుగీసుల, ఆర్మేనియుల, మూరు డచ్ తదితర దేశస్థుల సమాధులున్నవి. ప్రస్తుతం ఈ సమాధుల మీద చెట్లు మొలచి, సమాధులు పగిలి, ఉన్నవి. కొన్నాళ్ళు ఉపేక్షిస్తే ఈ చారిత్రక నిక్షేపాలు మిగలవు. మన తెలుగు భాషలో నేడు వాడకంలో ఉన్న అల్మారా, గమేళా, (తాళం) చెవి, బాతు, కమీజ్, మేస్త్రీ, ఫాదరి (క్రిస్టియన్ ఫాదర్) లాంటి పదాలు పోర్చుగీసుల భాషనుండి తెలుగులోకి ప్రవేశించాయి. మన నాగరికత, వర్తకం మీద విశేష ప్రభావం చూపిన 'పొగాకు' (టొబాకో) పంట, పోర్చుగీసుల వారి దేశం నుండి తెచ్చి మనదేశంలో నాటినదే. పోర్చుగీసుల సమాధులు మంగినిపూడి దగ్గరున్న తవిసిపూడి గ్రామంలో బయటపడినవి.

**మచిలీపటాం పోర్చుగీసుల స్థావరం – 'ఫరంగుల' సమాధులు:**

బందరు దగ్గర్లోని తవిసిపూడి గ్రామం ప్రస్తుత జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటరు ఎదురుగావున్న సరుగుడుతోట (డా॥ ధన్వంతరీ ఆచార్య గారి భూములు) సర్వే నెం. 99లో పోర్చుగీసు వర్తకుల సమాధుల దొడ్డి ఈ గ్రంథకర్త 2012 సం॥లో కనిపెట్టటం జరిగింది. ప్రస్తుతం ఒక సమాధి నిలబడి ఉన్నది. దీర్ఘచతురాస్రాకారపు దిమ్మమీద శంఖాకారపు – వృత్తాకారపు చిన్న ఇటుకలు – తెల్లసున్నం కట్టుడు నిర్మాణం. ఈ సమాధుల పొలానికి పడమర (సర్వే. నెం. 101)గా ఉన్న మెరక సరుగుడు చెట్లతోటలో పోర్చుగీసుల – సరకుల నిల్వ గోదాము పునాది ఇటుక స్థంభములు – (పెంకుటిల్ల అవశేషములు); ఈ భూమికి ఉత్తరంగా పోర్చుగీసు వ్యాపారులు నివసించిన నివాస భవనముల పునాదుల అవశేషములు కలిగిన 'ఫరంగి దిబ్బ'గా స్థానికంగా పిలిచే పూర్వ నివేశన స్థలము కూడా ఈ గ్రంథ రచయిత కనిపెట్టటం జరిగింది.

బహుమనీ సుల్తాన్ 1వ అహమద్ షా కాలం (1422–1436) లోనే యూరోపియనులు ఆంధ్ర దేశం వ్యాపారరీత్యా రావటం ప్రారంభమయిందని గోర్డెన్ మెకంజీ తన కిష్ణాజిల్లా మాన్యువల్ (1883 సంకలనం) లో నమోదు చేశాడు. 1540లో మసులీ పటాం ఓడరేవుకు ప్రవేటు వ్యాపారులైన పోర్చుగీసులరాక ప్రారంభమయిందని 'షిప్ బిల్డింగ్ సెంటర్ యిన్ సౌత్ ఇండియా, 1570-1700-ఎ నోట్ ఆన్ నర్సపూర్‌పేట (గోదావరిజిల్లా నర్సాపురం) బై సంజయ్ సుబ్రమణ్యం' వ్యాసం తెలియజేస్తుంది. వ్యాపారం నిమిత్తం ప్రథమంగా క్రీస్తుశకం 16వ శతాబ్దం ప్రథమభాగంలో పోర్చుగీసులు మచిలీపట్నం ఓడరేవుకు వచ్చి, ఆనాడు రేవుకు దగ్గర్లో ఉన్న బందరు పాత ఓడరేవు ప్రాంతంలో ఎగుమతి – దిగుమతి వ్యాపారానికి వీలుగా బందరు తవిసిపూడి – గోపువానిపాలెం సరిహద్దుల్లో (నేడు కూడా పాత లైటుహవుస్ నిలబడి ఉన్నది) పోర్చుగీసులు మకాంపెట్టి వ్యాపారం నిర్వహించారు. తర్వాతకాలంలో వచ్చిన పోర్చుగీసు వ్యాపారులు బందరుకోటలో వారి వ్యాపార స్థావరంతోపాటు, చర్చి కూడా కట్టుకున్నట్లు నమోదైనది. అప్పట్లో బంగాళాఖాతం, ఇంకా నిలబడి ఉన్న లైట్ హవుస్ (1858 నిర్మాణం) ఆనుకొని సముద్రతీరం ఉన్నట్లు భూమి మీద 'బీచ్ రిడ్జి' ఆనవాళ్ళు ఉన్నవి. ఈనాడు సముద్రం 1858 నాటి దీప స్థంభానికి షుమారు కిలో మీటర్ దూరంలో – వెనక్కు మరలింది.

–మహమ్మద్ సిలార్
కన్వీనర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946



# పంజాబీల పవిత్ర లోహ్రీ (భోగి)

లోహ్రీ పండుగను భారతదేశంలోని ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో జరుపుకుంటారు. ముఖ్యంగా పంజాబ్ రాష్ట్ర ప్రజలు లోహ్రీ పండుగను పవిత్రమైనదిగా భావించి, వైభవంగా జరుపుకుంటారు. లోహ్రీ పండుగ ఆనందం, శ్రేయస్సు, ఆనందానికి చిహ్నం. పంజాబీ కుటుంబాలు సాయంత్రం పూట పవిత్రమైన అగ్నిని వెలిగిస్తారు. ఆ తరువాత వేరుశనగ, నువ్వులు, బెల్లం, మొక్కజొన్న మొదలైనవి ఆ అగ్నిలో అర్పిస్తారు. దీని తరువాత, ప్రజలందరూ ఆ అగ్ని దగ్గర నిలబడి పాటలు పాడతారు. ఈ సమయంలో అందరూ ఒకరినొకరు కౌగిలించుకుని లోహ్రీ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

### లోహ్రీ అనే పదానికి అర్థం?

మకర సంక్రాంతికి ముందు రాత్రి లోహ్రీ పండుగ జరుపుకుంటారు. లోహ్రీని 'లాల్ లోయి' అని కూడా అంటారు. ఆరోజు సిక్కు, పంజాబీ ప్రజలు భోగి మంటలను వెలిగిస్తారు. లోహ్రీ అంటే – ఎల్ (చెక్క), ఓహ్ (గో అంటే ఎండిన ఆవు పేడ కేక్), రేవాడి.. అందుకే ఈ రోజున వేరుశెనగ, నువ్వులు, బెల్లం, గజక్, చిద్వా, మొక్కజొన్నలను నీటి మీద విసిరిన తర్వాత తినడం ఒక సంప్రదాయం. పంజాబ్ సహా ఢిల్లీ రాష్ట్రాల్లో పిల్లలు ఈ పండుగకు 20–30 రోజుల ముందు లోహ్రీ జానపద పాటలు పాడుతూ కట్టెలు, ఆవు పేడ కేకులను సేకరిస్తారు. ఆ తరువాత, మకర సంక్రాంతికి ఒక రోజు ముందు, కూడలి లేదా ప్రాంతంలోని ఏదైనా బహిరంగ ప్రదేశంలో మంటను వెలిగించి, ఆవు పేడతో చేసిన కేకుల దండను సమర్పిస్తారు. పంజాబీ భాషలో దీనిని చరా? చధన అని కూడా అంటారు.

### లోహ్రీని ఎందుకు జరుపుకుంటాము?

దీని వెనుక చాలా కథలు ఉన్నాయి. ఈ పండుగ శ్రీ కృష్ణుడు, దుల్లా భట్టితో ముడిపడి ఉందని భావిస్తారు. జానపద కథల ప్రకారం.. దుల్లా భట్టి అనే వ్యక్తి చాలా మంది అమ్మాయిలను ధనవంతులైన వ్యాపారుల నుండి రక్షించాడు. నిజానికి ఆ సమయంలో అమ్మాయిలను ధనిక కుటుంబాలకు అమ్మేవారు. దుల్లా భట్టి దీనికి వ్యతిరేకంగా తన స్వరాన్ని పెంచి, అందరు అమ్మాయిలను రక్షించి, వారికి వివాహం చేశాడు. లోహ్రీ రోజున ఆయనను స్మరించుకుంటారు. అందుకే లోహ్రీ రోజున దుల్లా భట్టి పాటలు పాడే సంప్రదాయం ఉంది.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e:desk.deccan@gmail.com

## స్త్రీ విముక్తి, మహిళా చైతన్యం కోసం ప్రపంచంలోనే తొలి పత్రిక ప్రారంభించిన

# ద్వారకనాథ్ గంగూలీ

దాదాపు 2 శతాబ్దాల క్రితం బ్రిటిష్ పాలకులు 'కూలీ' అనే పదాన్నీ, పని విధానాన్నీ భారతదేశంలో ప్రవేశపెట్టారని భావించాలి. 1830వ దశకంలో అస్సాం ప్రాంతంలో తేయాకు, కాఫీ, చెరకు, రబ్బరు వంటి పంటలను సాగు చేయడానికి పేద వాళ్ళను అక్కడికి తీసుకెళ్లి లాభసాటిరీతిలో వ్యవసాయం చేయడం ప్రారంభించారు. అది కాంట్రాక్టు పని విధానం కనుక, అక్కడ పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నా మధ్యలో వెళ్లిపోయే అవకాశం లేదు. అలాంటి పనివాళ్లను 'కూలీలు' అని పిలవడం మొదలైంది. దేశంలో ఉన్న సామాజిక పరిస్థితుల కారణంగా ఇది కొన్ని దశాబ్దాలు సాగి, బ్రిటీష్ వారికి అమితమైన సంపదనిచ్చింది.

బ్రహ్మసమాజపు సభ్యుడైన రామ్ కుమార్ విద్యారత్న ఈ రీతిలో చిక్కుకొని ఇడుముల పాలైన వారి పరిస్థితి గమనించి తొలుత బయట ప్రపంచానికి తెలిపారు. ఈ ఫస్ట్ హ్యాండ్ ఫీల్డ్ విషయాలు గమనించిన ద్వారకనాథ్ గంగూలీ (1844-1898) బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే ఇబ్బందులు ఉంటాయని గమనించినా, అక్కడికి వెళ్లి అధ్యయనం చేయడానికి నిర్ణయించు కున్నాడు. అతి కష్టం మీద కలకత్తా నుంచి ఆ లాభసాటి పంటల ఎస్టేట్‌ను చేరుకున్నాడు. అక్కడ బ్రిటిష్ మేనేజర్లు పలు రకాల సౌఖ్యాలతో జీవితం గడుపుతూ, ఎన్నో లాభాలు పొందుతుండగా, ఈ కూలీలు మాత్రం చాలా అధ్వాన్నమైన రీతిలో కడగండ్ల పాలవుతూ ఉండటం తన కళ్ళారా గమనించాడు. ధర్మాగ్రహంతో రగిలి పోయిన ద్వారకానాథ్ గంగూలీ వరుసగా కే.కే. మిత్రా నడిపే 'సంజీబాని', ఇంకా సురేంద్రనాథ్ బెనర్జీ నడిపే 'బెంగాలీ' పత్రికల్లో బానిసల్లా జీవితాన్ని గడుపుతున్న భారతీయ కూలీల గురించి వివరంగా రాశారు.



అంతే కాదు, బిపిన్ చంద్రపాల్ ద్వారా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశాల్లో కూడా ఈ విషయం చర్చించేలా చేశాడు. అత్యంత కఠినమైన శిక్షలు విధిస్తూ, బ్రిటిష్ ఎస్టేట్ మేనేజర్లు ఎలా నలుగురు కూలీలు చనిపోయేలా చేశారో వివరాలతో ఏకరువు పెట్టాడు. ఈ చర్యలు బ్రిటిష్ ప్రభుత్వానికి కంటగింపుగా మారుతుండగా, మరోవైపున నేషనల్ కాంగ్రెస్ బృందాలు అస్సాంకు వెళ్లి మరిన్ని వివరాలు పంపడం మొదలైంది. దాంతో 19వ శతాబ్దం మొదట్లో ఈ కూలీల సమస్య బ్రిటిష్ ప్రభుత్వానికి పెద్ద అవరోధంగా మారి, ఒక కీలకమైన పోరాట అంశంగా మారింది. చివరకు 1920లో ఈ దుష్ట చట్టాన్ని బ్రిటీష్ వారు రద్దు చేయాల్సి వచ్చింది. అప్పటికి ద్వారకనాథ్ గంగూలీ కనుమూసినా ఈ విజయం చిన్నది కాదు!

బెంగాలీల పనితనం, త్యాగం, కీర్తి గురించి దేశవ్యాప్తంగా అందరికీ తెలుసని మనం భావిస్తూ ఉంటాం. నిజానికి ద్వారకనాథ్ గంగూలీ గురించి పశ్చిమ బెంగాల్లో కూడా పెద్దగా తెలియదు. ఏదైనా కొద్దిగా సమాచారం ఉందంటే అది కాదంబినీ గంగూలిని ప్రోత్సహించి దేశంలో తొలి మహిళా డాక్టర్ అయ్యేలా చేసిన భర్తగా మాత్రమే. అస్సాం కూలీల కష్టాలు వెలికి తీసి వారి కష్టాలను గట్టెక్కించిన యోధుడిగా మాత్రమే కాకుండా మరింత ఖ్యాతి కలిగించే విషయం కూడా ఉంది.

1869లో ద్వారకనాథ్ గంగూలీ 'అబలా బందో' (Abala bandhab) అనే పత్రికను ఢాకా నుంచి ప్రారంభించారు. ఈ బెంగాలీ పేరుకు అర్థం ఏమిటంటే మహిళల స్నేహిత అని. అమెరికన్ పరిశోధకుడు, చరిత్రకారుడు డేవిడ్ కోఫ్ (David Kopf) ప్రకారం స్త్రీ విముక్తి, మహిళా చైతన్యం కోసం ప్రపంచంలోనే ప్రారంభించబడిన తొలి పత్రిక ఇది. పాతిక సంవత్సరాలు మించని ద్వారకనాథ్ గంగూలీ ఈ పత్రికను ఏడు సంచికలు మాత్రమే వెలువరించినా, అందులో స్త్రీల స్వీయ రక్షణ, ఒకేషనల్ ట్రయినింగ్, మహిళా సామాజిక రాజకీయ, మత సంబంధమైన విషయాలు, వంటలు, మంత్రసానులకు శాస్త్రీయ శిక్షణ, ప్రసూతి సమయంలో స్త్రీలకు జాగ్రత్తలు, శుభ్రత, ఆరోగ్య పరిస్థితులు, కిండర్ గార్డెన్ విద్య,

టెలిఫోన్, మైక్రోఫోన్, ఫోనోగ్రామ్స్, ఎడిసన్, ఎలక్ట్రికల్ లైట్ వంటి వాటితో పాటు ఇతర ప్రయోజన కరమైన అంశాలు ఎన్నో ఉండేవి.

ద్వారకనాథ్ గంగూలీ (ఇప్పుడు బాంగ్లాదేశ్‌లో ఉన్న) ఢాకా నగరానికి దక్షిణాన విక్రమ్ పూర్ పరగణాకు చెందిన మగుర్ఖండ గ్రామంలో 1844 ఏప్రిల్ 20వ తేదీన జన్మించారు. తండ్రి కృష్ణప్రాణ్ గంగోపాధ్యాయ బ్రాహ్మణ సాంప్రదాయానికి చెందినవాడు. తల్లి ఉదయతార పట్టుదలకు మరో పేరు. ద్వారకనాథ్ జన్మించిన సమయంలో తండ్రి కుటుంబ పనుల కారణంగా ఫరిదాపూర్‌లో ఉన్నారు. ఆ సమయంలో ఉదయ తారకు పూరి వెళ్లాలనిపించింది. అప్పట్లో అక్కడి నుంచి పూరి వెళ్లాలంటే పడవలు, ఏనుగులే శరణ్యం. ఆమె తల్లిదండ్రులు ఈ ఖర్చును భరించడానికి సిద్ధంగా ఉన్నా ఉదయతార కాలి నడకన పూరి వెళ్లి వచ్చిన పట్టుదల గల తలవంచని ధీర. తల్లి ఉదయ తార ప్రభావం ద్వారకనాథ్ గంగూలీ మీద విశేషంగా ఉంది. ఆ పట్టుదల ద్వారకనాథ్‌కు కూడా అబ్బింది.


REFERENCE ONLY
অবলাবান্ধব।
মাসিক পত্র।
দ্বারকানাথ গঙ্গোপাধ্যায়
সম্পাদিত
অবলাবান্ধব (নবপর্যায়)
প্রসঙ্গ: নারী

అప్పట్లో కులీన బ్రాహ్మణులు మూడు కులాలకు చెందిన మహిళలను అదనంగా పెళ్ళాడి, వారి తల్లిదండ్రులు ఇచ్చే కానుకలతో జీవితం గడిపేవారు. ద్వారకానాథ్ గంగూలీ మీద చిన్న వయసులోనే అక్షయ్ కుమార్ దత్త 'ధర్మనీతి' పుస్తక ప్రభావం చాలా ఉంది. మహిళా చైతన్యాన్ని ప్రోది చేసే ఈ రచన కారణంగా బహు భార్యత్వం, బాల్యవివాహాలు గురించి ఏహ్యాభావం. అలాగే కులాంతర వివాహాలు, వితంతు వివాహాల గురించి గౌరవం పెరిగింది. తమ బంధువులలో కట్నకానుకలకు ఆశపడి, భార్యలకు విషం ఇచ్చి చంపిన దృష్టాంతాలు 17 సంవత్సరాల వయసులో ద్వారకనాథ్ దృష్టికి వచ్చాయి. దాంతో బహుభార్యత్వాన్ని నిరసిస్తూ తను అటువంటి పని చేయనని నిర్ణయానికి వచ్చారు.

ద్వారకనాథ్ గంగూలీ తొలి వివాహం ద్వారా కలిగిన బిదుముఖి ముని మనవడే ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు సత్యజిత్ రే. ఇద్దరు పిల్లలు తర్వాత భార్య గతించడంతో 1883లో కాదంబినీ బసును ద్వారకనాథ్ వివాహం చేసుకున్నారు. భారతదేశంలోని తొలిసారి పట్టభద్రులైన ఇద్దరు మహిళలలో కాదంబిని ఒకరు. మహిళలకు కలకత్తా వైద్య కళాశాలలో ప్రవేశం కోసం కోర్టులో పోరాడి విజయం సాధించాడు ద్వారకనాథ్.

కాదంబినీ గంగూలీ భారతదేశంలో చదివి వైద్య పట్టా పొందిన తొలి మహిళ మాత్రమే కాదు, తర్వాత దశలో ప్రాక్టీస్ చేసిన తొలి డాక్టర్ కూడా. పై చదువుల కోసం ఇంగ్లండ్‌లో, సంఘ సేవలో పాల్గొన్నప్పుడు నీచమైన విమర్శలు చేసిన మహేష్ పాల్ అనే పత్రిక సంపాదకుడికి జైలుశిక్ష పడేలా పోరాడిన మహిళల యోధుడు ద్వారకనాథ్. కాదంబిని ద్వారా కలిగిన ఐదుమంది సంతానంలో కుమార్తె జ్యోతిర్మయి, సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో పోరాడిన మణిపూస. కుమారుడు ప్రభాత్ చంద్ర జర్నలిస్టుగా పేరుగాంచారు.

బ్రహ్మసమాజంలోని ఒక విభాగమైన సాధారణ బ్రహ్మసమాజంలో పని చేసిన ద్వారకనాథ్ మహిళలకు ఉన్నత చదువులు కావాలని, అందులో సైన్స్, మేథమేటిక్స్, ఇంకా సంగీతం ఉండాలని వాదించిన వ్యక్తి. ఇది మరో పెద్ద బ్రహ్మ సమాజపు నాయకులు, కేశవ్ చంద్ర సేన్ వాదానికి పూర్తి విభిన్నం. హిందూ మహిళా విద్యాలయ హెడ్ మాస్టర్ గా పని చేసిన కాలంలో తీర్చిదిద్దిన చంద్రముఖి, కాదంబినీ, సరళ, అబలా బోస్, ఇందుమతి, బిదుముఖి, హరసుందరి తర్వాత కాలంలో గొప్ప చరిత్ర సృష్టించారు. భారత దేశంలో మహిళల చదువు, చైతన్యం పట్ల ఎంతో కృషిచేసిన మేరీ కార్పెంటర్ ప్రభావంతో మహిళల కథావస్తువుగా 'సురచిర కటీర' మనే నవల రాశారు. ఈయనను కలసి స్ఫూర్తి చెందిన పండిత రమాబాయి పూనా నగరంలో అలాంటి కార్యక్రమాలు చేపట్టారు.

న్యాయబద్ధమైన రాజకీయ, మేధో, పదార్థిక ప్రగతి సాధన కోసం సురేంద్రనాథ్ బెనర్జి, ఆనందమోహన బోస్ తో కలసి 1876 లో దేశంలో తొలి జాతీయవాద సంస్థ 'ఇండియన్ అసోసియేషన్' ను స్థాపించారు. ఈ సంస్థకు సహ సంచాలక బాధ్యతలు నిర్వహించారు. 1885 ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడిన సమయంలో ఈ సంస్థను అందులో విలీనం చేసి రాజకీయాలలో మహిళల ప్రవేశం గురించి దృష్టి పెట్టారు. బిపిన్ చంద్రపాల్ 1907 మార్చి 14న మహిళల కోసం స్వదేశీ ఉద్యమ సమావేశం నిర్వహించినపుడు ద్వారకనాథ్ రాసిన పాటను విశేషమైన రీతిలో గానం చేశారు. కేవలం 54సం॥ మాత్రమే జీవించిన 1898 జూన్ 27న కనుమూసినా ద్వారకనాథ్ గంగూలీ తొలి తరం కార్మిక, మహిళా నాయకుడిగా, సంస్కరణశీలిగా, విద్యావేత్తగా, జాతీయవాదిగా, జర్నలిస్టు దీపిక గా వెలిగిన మహోన్నత మూర్తిగా చిరస్మరణీయులు.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com

# దక్కన్ రేడియో VS భాగ్యనగర్ రేడియో

దక్కన్ రేడియో మరియు భాగ్యనగర్ రేడియో గురించి తెలుసుకునేందుకు ముందు రేడియో చరిత్ర గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. 1864 సంవత్సరంలో జేమ్స్ మాక్స్వెల్ ఎలక్ట్రో మాగ్నెటిక్ తరంగముల గురించి అధ్యయనం చేసి వాటిని గుర్తించాడు. 12-14 సంవత్సరంల తర్వాత అనగా 1886-88 కాలంలో హెన్రిచ్ హెర్ట్జ్ రేడియో తరంగాలను గుర్తించాడు. వీరిద్దరి ప్రభావం ఇటాలియన్ దేశస్తుడైన జియో వన్నీ మారియో మార్కోని, ఎలక్ట్రికల్ ఇంజనీర్ మీద పడింది. మార్కోని, 1895 నుండి wireless ద్వారా సందేశాలను పంపడం వంటి కొత్త వ్యవస్థను కనుగొన్నాడు. 1897-99 సంవత్సరములలో మార్కోని వైర్లెస్ సందేశాలను ఇంగ్లీషు చానల్‌ను సైతం దాటించగలిగిన తొలి కమ్యూనికేషన్‌గా గుర్తించబడింది. 1900-1901వ సంవత్సరంలో కార్న్వాల్ నుండ న్యూ ఫౌండ్లాండ్ వరకు వైర్లెస్ సంకేతాన్ని మార్కోనీ పంపగలిగినారు. 1901లో రోబర్టో ల్యాండల్ డి మౌరా బ్రెజిలియన్ దేశస్థుడు రేడియో అనే పదంను ఉపయోగించాడు. లీడీ ఫారెస్ట్ 1907 ప్రాంతంలో రేడియో అనే వదాన్ని ఉపయోగించాడు. 1909వ సంవత్సరంలో మార్కోని వైర్లెస్ టెలిగ్రాఫ్ మీదనే నోబెల్ బహుమతిని అందుకున్నాడు. ఆ తరువాత ఈ వైర్లెస్ టెలిగ్రాఫ్ వ్యవస్థ మొదటి ప్రపంచ యుద్ధంలో (1914-1918) సమాచార వ్యవస్థ నందు అధిక పాత్ర పోషించింది. అప్పటిదాకా నౌకా యానంలో ప్రధాన పాత్ర పోషించిన ఈ వైర్లెస్ టెలిగ్రాఫ్ వ్యవస్థ రేడియో బ్రాడ్ కాస్ట్‌గా 1920వ సంవత్సరం KDKA (USA) నందు వాణిజ్యపరంగా ప్రవేశించింది. BBC సైతం 14 November 1922 తన అధికారిక రేడియో ప్రసారం చేసింది. 1923-25వ సంవత్సరముల నందు యూరోప్ అంతటా రేడియో వ్యాప్తి చెందింది. పోప్ pius xl వారి కాలంలో వాటికన్ సిటీ నందు సైతం రేడియో స్టేషన్ ఏర్పాటు కాబడింది. అధికారికంగా 12 Feb 1931 తేదీన రేడియో ప్రసారం చేసింది.



భారతదేశంలో రేడియో క్లబ్ ఆఫ్ బాంబే జూన్ 1923లో ఏర్పడింది. అదేవిధంగా నవంబర్ 1923లో రేడియో క్లబ్ ఆఫ్ కలకత్తా ఏర్పడింది. అంతేకాకుండా 1924వ సంవత్సరంలో మద్రాస్ ప్రెసిడెంట్ రేడియో క్లబ్ ఏర్పడింది. ఈ రేడియో క్లబ్స్ అన్నీ కూడా 23 జూలై 1927వ తారీఖు నుండి Indian broadcasting company(IBC) ఆధీనంలో పనిచేశాయి. అయితే IBC, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొనలేక 1930వ సంవత్సరంలో మూసివేసుకోవాల్సిన అవసరం ఏర్పడినది. అటు పిమ్మట 01 ఏప్రిల్ 1930వ తారీకున IBCని బ్రిటిష్ ఇండియా వారు స్వాధీన పరుచుకుని ISBS (Indian state broadcasting company) వారి ఆజ్ఞల ప్రకారం నడుచుకోవాలన్న నియమాలను విధించింది. ISBS ఆదేశాల అనుసరించిన భారతదేశంలోని సంస్థానాధిపతులకు రేడియో స్టేషన్ నిర్మాణములకు అనుమతినిచ్చింది. ఆ రేడియో స్టేషన్లు ప్రధానంగా 1) దక్కన్ రేడియో హైదరాబాద్ (03.02.1935), 2) మైసూర్ ప్రసార కేంద్రం (10 సెప్టెంబర్ 1935) 3) ఢిల్లీ రేడియో స్టేషన్ (1936), 4) మద్రాస్ రేడియో స్టేషన్(1938), 5) ట్రావన్కోర్ రేడియో స్టేషన్ (12th March 1943) మరియు 6) బరోడా ప్రసార కేంద్రం (10th January 1947). 1930 సంవత్సరం నుండి మాత్రమే రేడియో ప్రసార కేంద్రంలు చట్టబద్ధంగా నడపబడ్డాయి. 8 జూన్ 1936వ తారీఖున ISBS పేరును మార్చి ఆల్ ఇండియా రేడియోగా నామకరణం చేశారు.

**హైదరాబాదు నందలి రేడియో స్టేషన్:**

బాంబే కలకత్తా మద్రాస్ నగరాలలోని రేడియో ప్రసాద్ కేంద్రంలో తర్వాత అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది హైదరాబాదు నందలి రేడియో స్టేషన్. ఈ ప్రసార కేంద్రాన్ని మీరు ఉస్మాన్ అలీ ఖాన్ (ఏడవ నిజాం) 1933-34లో పునాదిరాయి వేసి 3 ఫిబ్రవరి 1935వ తేదీన హైదరాబాద్ నందు రేడియో ప్రసార కేంద్రాన్ని ప్రారంభించి దానికి దక్కన్ రేడియో అని నామకరణం కూడా చేశారు. ఉర్దూ మరియు తెలుగు వార్తలుతో పాటు హిందుస్తానీ సంగీతాన్ని సైతం వినిపించేవారు. మూడు జూన్ 1947 బ్రిటిష్ ప్రభుత్వం తన పరమాధికారాన్ని ముగిస్తున్నట్టు తెలియజేసింది. ఆ నేపథ్యంలో, హైదరాబాద్ సంస్థానాధ్యక్షుడు (11 జూన్ 1947 తారీఖున) స్వతంత్రంగా ఉంటాడని ప్రకటించాడు. 25 జూలై 1947వ తారీఖున మౌంట్ బాటన్ ఒక ప్రకటన చేశాడు. ఆ ప్రకటన సారాంశం 565 సామంత రాజ్యాలు భారతదేశము నందు లేదా పాకిస్థాన్లో చేరాలని నిర్ణయాన్ని 15 ఆగస్టు 1947లో తీసుకోవాలని ఏ సామంత రాజ్యము స్వతంత్రంగా ఉండే అవకాశం లేదని తెలిపారు. ఆ ప్రక్రియలో భాగంగా 12 సామంత రాజ్యాలు పాకిస్తాన్లో కలవగా సర్దార్ వల్లభాయి పటేల్ చాకచక్యం వలన మిగిలిన సంస్థానాలు union Indiaలో చేరాయి. అయితే హైదరాబాద్ సంస్థానాధీశుడు స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. హైదరాబాద్ మాత్రమే కాదు ట్రావన్కోర్ (June 1947), జోద్పూర్ (July 1947) మరియు భోపాల్ (early 47) స్వతంత్రదేశాలుగా ఉంటాయని ప్రకటించాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతిష్టమైన ఆచరణ వలన union Indiaలో చేరాయి. అయితే హైదరాబాద్ నిజాం ప్రభువు 11 జూన్ 1947వ తారీఖున భారతదేశంలో చేరడం ఇష్టం లేదని స్వతంత్ర రాజ్యముగా వ్యవహరిస్తామని దక్కన్ రేడియోలో తెలిపాడు.

నిజాం విముక్తి పోరాటం కోసం అనేకమంది స్వాతంత్ర్య ఉద్యమాన్ని తీవ్ర స్థాయిలో నడపవలెనని సోలాపూర్ సమావేశంలో నిర్ణయించుకున్నారు. ఆ ప్రక్రియలో భాగంగా కర్నూలు నందు పాగా పుల్లారెడ్డి గారు ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. కర్నూలు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రామిరెడ్డి గారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు హుట్జోజి రావు వారి కార్యాలయాన్ని హైదరాబాద్ సంస్థాన విమోచన ఉద్యమానికి ఇచ్చి తోడ్పడ్డారు. నిజాం విముక్తి పోరాటం కొరకు గద్వాల, అలంపూర్, ఆత్మకూర్, వనపర్తి, కొల్లాపూర్, కొడంగల్ మరియు మక్తల్ కార్యకర్తలు వేలాదిమంది కర్నూలు కార్యాలయంలో చేరినారు. అయితే ఇతర కాంగ్రెస్ ప్రాంతీయ కార్యాలయాలు చేయని ఒక విభిన్నమైన పనిని కర్నూలు కార్యాలయం చేసింది. ఆ ప్రత్యేకమైన ప్రైవేటు రేడియో ట్రాన్స్మిషన్. అప్పటికే కొన్ని ప్రైవేటు ట్రాన్స్మిషన్స్ బ్రిటిష్ ప్రభుత్వం అనుమతి లేకుండా ఏర్పాటు కాబడ్డాయి. నేతాజీ గారు సైతం అజాద్ హిందీ రేడియోను 1942లో జర్మనీ నందు నెలకొల్పారు. ఆ తర్వాత సింగపూర్ నందు ఫ్రీ ఇండియా రేడియోను నెలకొల్పి భారతీయులకు సందేశాలు ప్రసారం చేయడమే కాక INA (Indian NationalArmy) ఉఉద్యమానికి మద్దతు ఇవ్వడం కోసం ఉపయోగించారు. అదే విధంగా 22ఏళ్ల ఉషా మెహతా అనే సాహసవంతురాలు, ధైర్యవంతురాలు మరియు స్వాతంత్ర్య సమరయోధురాలు 1942లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియాకు మద్దతును ప్రకటించడమే కాకుండా కాంగ్రెస్ రేడియో అనే రహస్య రేడియో స్థావరాన్ని నిర్వహించిన ధీశాలి. బ్రిటిష్ వారు ఉషా మెహతాను రహస్యంగా రేడియోను నిర్వహించిన దానికి బందీని చేయడం జరిగింది. ఈ రహస్య కాంగ్రెస్ రేడియో ఆగస్టు 1942 నుండి నవంబర్1942 వరకు పని చేసిందని చరిత్రకారులు చెబుతారు. బ్రిటిష్ పోలీస్ వారు రహస్య రేడియోకు సంబంధించి సరైన సాక్షాలను చూపలేక పోయారు. ఆ తర్వాత కొన్ని నెలలకు ఉషా మెహతా గారిని విడుదల చేయడం జరిగింది. 1998లో భారత ప్రభుత్వం వారు ఆవిడ చేసిన సేవలను గుర్తించి పద్మ విభూషణ్‌తో సత్కరించారు. ఇదే రీతిలో ఒక అనధికార రేడియో ట్రాన్స్మిషన్ను వనపర్తి రాజారామేశ్వరరావు గారి ద్వారా కర్నూలుకు చేర్చారు వారు. ప్రముఖ నాయకుడు జయప్రకాశ్ నారాయణ గారు సహాయంతో ఈ ట్రాన్స్మిషన్ యంత్రాన్ని బొంబాయి నుండి కర్నూలుకు చేర్చారు. బహుశా ఉషా మెహతాగారు వాడిన రేడియో ట్రాన్స్మిషన్ అయి ఉండవచ్చని చరిత్రకారుల అంచనా. ఇది హైదరా బాద్ ప్రభుత్వం వారి దక్కన్ రేడియో కంటే శక్తివంతమైనది. అందుకే కాబోలు కర్నూలు నుండి ప్రసారం కాబడిన వార్తలు హైదరాబాద్ సంస్థానంకే కాకుండా, విజయవాడ మరియు మద్రాస్ వంటి దూరప్రాంతాలకు సైతం వినబడేదని తెలిసింది. కర్నూలుకు చేరిన ఈ రేడియో ట్రాన్స్మిషన్ను పల్లెపాడు జాగీర్దార్ చంద్రశేఖర్ రెడ్డిగారి ఇంట్లో రహస్యంగా ఉంచారు. వారి కుమారులు జనార్దన్ రెడ్డి గారు మరియు గోవర్ధన్ రెడ్డి గారు ఆ రేడియో ట్రాన్స్మిషన్ను చక్కటి సామర్థ్యంతో నడిపారు. గడియారం రామకృష్ణ శర్మ వార్తల ప్రచురణ మరియు రేడియో ప్రసార బాధ్యతలను స్వీకరించారు. అలాగే గొట్టుముక్కల కృష్ణమూర్తి గారు వార్తలను సేకరించే కార్యక్రమంలో నిమగ్నమయ్యే వారు. పి.ఎస్. మూర్తి గారు వార్తలను రోటరీ మిషన్ మీద ముద్రించడం, అజ్ఞాత కార్యకర్తల ద్వారా వార్తలను గ్రామాలకు చేరవేయడం జరిగేది. గడియారం రామకృష్ణ శర్మగారు వారి స్నేహితులు చంద్రశేఖర్ రెడ్డి గారి కుమారుడు ఈ రేడియో ట్రాన్స్మిషన్‌కు భాగ్యనగర్ అని నామకరణం చేశారు.



భాగ్యనగర్ రేడియో నిజాం నిర్వహించే దక్కన్ రేడియోకు ధీటుగా సమాధానాలు ఇచ్చేది. ప్రతిరోజు సాయంకాలం 7:00 నుండి 8 గంటల వరకు అనగా గంటసేపు వార్తలు ప్రసంగాలు ప్రసారం చేసేవారు. తెలుగు ఉర్దూ మరియు ఇంగ్లీష్ భాషలలో అరగంటసేపు ప్రసంగాలు ప్రసారమయ్యేవి. నిజాం ప్రభుత్వం వారు డెక్కన్ రేడియోలో స్వాతంత్ర ఉద్యమాన్ని అవహేళనగా మాట్లాడేవారు. అంతేకాదు నైజాం ఘన కీర్తిని ఎక్కువగా చాటేవారు. ఈ నేపథ్యంలో ఆచార్య కురుగంటి సీతారామయ్య గారు డెక్కన్ రేడియో ప్రసార బాధ్యతలను స్వీకరించారు. భాగ్యనగర్ రేడియో నందు సీతారామయ్య గారిని సత్తార్మియాగా వర్ణిస్తూ నిజాం ప్రభుత్వ మరియు రజాకార్ల దురాగతాలను అతిశయోక్తులతో మరియు హాస్య ధోరణిలో తెలియజేసేవారు. ఈ రేడియో కార్యక్రమాలను చూసి డాక్టర్ జి.ఎస్. మేల్కోటి మరియు మాడపాటి రామచంద్రరావులు కర్నూలు చేరి గడియారం రామకృష్ణ శర్మ బృందాన్ని కొనియాడారు. కాలగమనంలో వనపర్తి రాజాగారితో పాగా పుల్లారెడ్డి గారికి రాజకీయ విభేదాలు రావడం వలన భాగ్యనగర్ రేడియోను తిరిగి ఇవ్వవలసి వచ్చింది. అయితే భాగ్యనగర్ రేడియో నందు చివరి వార్తగా మహాత్మా గాంధీ మరణ వార్తను తెలిపి ముగించారు. అనగా భాగ్యనగర్ రేడియో వార్తలు 30 జనవరి 1948 ముగిసాయి. 17 సెప్టెంబర్ 1948 నుండి 01 ఏప్రిల్ 1950 వరకు పరివర్తన కాలంగా గుర్తించబడి దక్కన్ రేడియో ఆల్ ఇండియా రేడియోగా రూపాంతరం చెందింది. 200KW పవర్‌తో స్థాపించబడిన రేడియో కేంద్రం 1947 సంవత్సరం నాటికి 1KW వరకు చేరింది.

పోలో ఆపరేషన్ తర్వాత హైదరాబాద్ సంస్థానం 17 సెప్టెంబర్ 1948వ తారీఖున భారత ప్రభుత్వం నందు విలీనమైంది. మూడో ఫిబ్రవరి 1935న దక్కన్ రేడియోగా హైదరాబాద్ రాష్ట్రం నందు గుర్తించబడి భారతదేశంలో (17 సెప్టెంబర్ 1948) విలీనం అయ్యేంత వరకు పనిచేసింది. ఈ రకంగా కర్నూలు నందు ఏర్పాటు కాబడిన భాగ్యనగర్ రేడియో నిజాం విముక్తి కొరకు పోరాటంలో ప్రత్యేక పాత్ర తీసుకున్నదని అర్థమవుతున్నది.

-డా|| జి.యస్.రామయ్య
INTACH సభ్యులు - కర్నూలు జిల్లా చాప్టర్,
ఆంధ్రప్రదేశ్, m : 898 555 0007

**సవరణ:** నవంబరు నెల దక్కన్‌ల్యాండ్ సామాజిక రాజకీయ మాసపత్రిక నందలి 25వ పేజీలో, రాయలసీమ నందు క్యాథలిక్ ఏసు సంఘ సభ్యులు (Jesuit Society) కాలు మోపిన కాలం వ్యాసం నందలి 2వ పేరాలో క్రింది సవరణను గమనించగలరు. 1934 సం||కు బదులు 1534 సం|| నందు ఇగ్నేయస్ ఆఫ్ లయోలా. అలాగే POP John Paul-III, అధికారికంగా 1940 సం||కు బదులు 1540 సం||గా గుర్తించారు అని చదువుకోవలసినదిగా విజ్ఞప్తి. *-రచయిత*





దేవల్ మసీదు



రాష్ట్రకూట, చాళుక్యశైలి స్తంభాలు

# అస్మక జనపద రాజధాని పోతలి

తెలంగాణాలో నిజామాబాద్ జిల్లాలోని అతిపురాతన నగరంగా భావించ బడుతున్నది బోధన్. ఈ బోధన్ కు పోదన, పోతలి, పౌదన్యపురం, బహుధాన్య పురం, పద్మపురం, ఏకచక్రపురం, బోధన అనే పేర్లున్నాయన్నది చారిత్రకకథనం.

ఇది అశ్మకజనపదం రాజధాని. అశ్మకము భారతదేశంలో పూర్వకాలంలో వున్న షోడశ జనపదాల్లో దక్షిణభారతంలో వున్న ఏకైక ప్రజారాజ్యం. అశ్మకుడు పాలించడంవల్ల అశ్మకరాజ్యమని పిలువబడ్డదని మహాభారతంలో ఆదిపర్వం వల్ల తెలుస్తున్నది. కాని, బౌద్ధ సాహిత్యంలో బుద్ధుని సమకాలికుడు అశ్మకరాజు సుజాతుడు పోతలిని పాలించినట్లు వున్నది. మరొక అశ్మక లేదా అస్సకులు లేదా అశ్మగీలు (రాళ్ళ వంటి వారు)ఈ ప్రాంతంలో జీవించడం వల్ల ఈ ప్రాంతమంతా అశ్మకమని పిలువ బడ్డదట. క్రీ.పూ. 8వ శతాబ్దం నుంచే ఇక్కడ ఒక రాజ్యంవున్నట్లు చారిత్రాకాధారాలు లభించాయని తెలుస్తున్నది.



ధరణేంద్ర పద్మావతులు

శాతవాహనుల పూర్వుల నుండి శాతవాహనులు, విష్ణుకుండినులు, రాష్ట్రకూటులు బోధన్ (వేములవాడ) చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, బహమనీలు, మొగలులు, విజయనగర రాజులు, ఆసఫ్జాహీలు అందరిపాలనలో బోధన్ ప్రసిద్ధ నగరమే. వందల ఏండ్లు రాజధానిగా వున్నది.

జైనమతానికి ఆద్యుడు రుషభునికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు భరతుడు ఉత్తర భారతదేశ పాలకుడు. చిన్నవాడు బాహుబలి దక్షిణభారతదేశ పాలకుడు. బాహుబలి సాత్వికుడు. జైనమతావలంబి. అతని అనంతరం బాహుబలి స్మారకంగా 526 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని నెలకొల్పారట. ఇపుడు దాని ఆనవాళ్ళే లేవు. బోధన్ బాహుబలి విగ్రహాన్ని చూసే శ్రావణ బెళగొళలో గోమతేశ్వరుని విగ్రహం అంత పెద్దగా, గొప్పగా చాముండరాయుడు చెక్కించాడట.

బోధన్ కోట బురుజులు అంతెత్తు ఇపుడైతే పది అడుగుల వెడల్పు, ఇరవై అడుగుల ఎత్తున్నాయి. అందరు ఇండ్లు కట్టుకోవడంతో కోట ఆనవాళ్ళు అదృశ్యమై పోయాయి. తెలుగునాట 30 చారిత్రక నగరాలలో మట్టికోట నగరం బోధన్ ఒకటిగా చెప్పాలి. ఒక బురుజు కొమ్మున ఇపుడు కొత్తగా కట్టిన శివాలయం వుంది. ఈ లింగం కూడా అడుగున్నర ఎత్తున్నది. బయట పడివున్న లింగం నాలుగున్నర అడుగుల పొడవుంది. ఇది సమలింగం. అడుగున్నర పైకి, పానవట్టం, పీఠంలో అడుగున్నర, నేలలో అడుగున్నర, లింగం 3సమభాగాలుగా ప్రతిష్ఠించడం సమలింగ పద్ధతి అని శిల్పశాస్త్రం చెపుతుంది.

“మహమ్మదీయ యుగానికి ముందు పరిఢవిల్లిన నగరం బోధన్. 20అ. 6అ. 6అ. కొలతల రాళ్ళతో కట్టిన ఎత్తైన గోడలతో బోధన్ కోట వుంది. నలువైపుల నాలుగు ద్వారాలున్నాయి. నగరమంతా చెల్లాచెదురుగా పడివున్న జైన(బుద్ధ), హిందూ విగ్రహాలు కనిపిస్తాయి. బోధన్‌లో 6అ.ల ఎత్తైన జైనశిల్పం ముక్కలుగా పడివుంది. ప్రజలు ఆ శిల్పాన్ని తీసివేయడానికి నిరాకరించారు. దానిని పూజిస్తున్నారు.

దేవల్ మసీదుగా పిలువబడుతున్న ప్రస్తుత మసీదు పూర్వం


కోటబురుజు


దేవల్ మసీదు


శంఖలతాతోరణం

జైనాలయమై వుంటుంది. గుడిలోని అనేకచోట్ల తీర్థంకరుల శిల్పాలు చెక్కివున్నాయి. తర్వాత కాలంలో హిందువుల చేతిలో హిందూశిల్పాలు పెట్టబడ్డాయి. నరసింహస్వామి శిల్పాలు నలుమూలల్లో వున్నాయి. దేవాలయం ఆర్కిటెక్చర్ 8-10శతాబ్దాల శైలిలో వుంది. నక్షత్రాకార ప్రణాళికతో కట్టబడింది. ఎత్తు తక్కువ స్తంభాలతో, సాదా సీదా చెక్కడాలతో వుంది. మహమ్మదీయులు ఆక్రమించుకున్నాక మసీదుగా మార్చారు. నిర్మితిలో మార్పు చేయలేదు కాని, పడుమటివైపు రాళ్ళతో ఒక మిహ్రాబ్ (ప్రార్థన-గూడు), దానికి ఉత్తరాన ఒక మిన్‌బార్ (పల్పిట్) ఒక చిన్న వేదిక కట్టబడ్డది. గుడికప్పుపైన మసీదువలె కనిపించడానికి ఇటుకలతో 12డోమ్స్ కట్టబడ్డాయి. మహమ్మద్ బిన్ తుగ్లక్ (1325-1351) మసీదుగా మార్పించాడు."-గులాం యాజ్దాని (Annual Report of the Arch.Dept. of HH the Nizam's Dominions-1914-15)

వందస్తంభాల గుడి, ఇంద్రనారాయణ దేవాలయంగా పిలువబడే ఈ గుడికి ఎక్కడాలేనివిధంగా దేవల్ మసీదు అనే పేరుంది. ముస్లింలు మసీదుగా, హిందువులు నరసింహస్వామి గుడిగా, జైనులు జినాలయంగా చెప్తున్నారు. మూడు ధర్మాల మాటను నిజం చేస్తున్నది ఈ గుడి. తొలుత జినాలయం. రాష్ట్రకూట ప్రభువు ఇంద్రవల్లభుడు తన పేరుతో 'ఇంద్రనారాయణ' మనే జినాలయాన్ని కట్టించాడు. (8వ శ.) జైనధర్మ మతావలంబకులైన పాలకులు, అధికారులు జైనమతగ్రంథం 'త్రిషష్టిపురుష శలాక'లో పేర్కొన్న 63మంది మహాపురుషుల పేర్లను ధరించినవారున్నారు. రాష్ట్రకూట చక్రవర్తి అమోఘవర్షునికి 'వీరనారాయణుడని', శంకరగండరసకు 'విద్విష్ట నారాయణుడని', ఇంద్రవల్లభునికి 'ఇంద్రనారాయణుడని' నామాంతరాలున్నాయి. అట్లా ఈ జినాలయానికి ఇంద్రనారాయణాలయమని పేరు. ఇతని తర్వాత కాలంలో బోధన్ పాలించినవారు బోధనచాళుక్యులుగా వారే వేములవాడలో రాజధాని నిర్మించుకున్నంక 'వేములవాడ చాళుక్యులు'గా పిలువబడ్డారు.

గుడిస్తంభాలలో ఒకదానిపై 'జినుడు వర్ధమహావీరుని' అర్ధశిల్పమున్నది. జినాలయాలలో సర్వసాధారణంగా కనిపించే 'శంఖలతాతోరణం' ఆలయద్వారం ముందర వున్నది. ఆలయ మంటపంలో స్తంభాలు రెండుకాలాలవి, రెండు శైలులలో వున్నాయి. రాష్ట్రకూట, చాళుక్యుల కాలపు స్తంభాలవి. రాష్ట్రకూటుల కాలంలో నిర్మించిన జినాలయానికి బోధన్ చాళుక్యులు మార్పులు, చేర్పులు చేసివుంటారనిపిస్తున్నది.

అర్ధమంటపం శైలిలో కక్ష్యాసనాలు, వాటికి చతుర్దళ పుష్పాలు చెక్కివున్నాయి. బయట పారేసివున్న ద్వారశాఖమీద చేతులువిరిగిన ద్వారపాలకుడు ఎవరో తెలియడం లేదు. చామరధారిణివున్నది. దానిపై లతలు, పుష్పాలు, సింహతోరణం కనిపించాయి. దాదాపు 2,3 ఎకరాలలో విస్తరించిన దేవాలయ ప్రాంగణానికి కట్టిన ప్రహరీ రెండడుగుల వెడల్పు, మూడడుగుల మందం, పదడుగుల పొడవున్న రాళ్ళతో నిర్మించబడ్డది.

భీమునిగుట్ట మీద భీముడు బకాసురుని చంపిన ప్రదేశమని స్థలపురాణంగా చెప్పుకుంటున్నారు. చిన్నగుట్ట మీద భీముడు బకాసురుని వధించిన స్థలం, మెట్ల పక్కన గుండుమీద చక్రచిహ్నం చెక్కివుంది దానిపైన అక్షరాలు చెక్కి వున్నాయి. అచ్చుతీస్తే ఏదైనా పేరు బయటపడవచ్చు. దానికి ఉత్తరాన భీముని గుడిలో బకాసురునివధ శిల్పం దానికిరువక్కల వినాయకుడు, మహిషాసురమర్దని విగ్రహాలున్నాయి. గుడిగోడకు దక్షిణాన కొన్ని వీరగల్లులుండడం విశేషం.

ఎల్లమ్మగుడి లేదా ఏకవీరదేవాలయం ఒక గడివెనక వుంది. గుడిలో దేవత విగ్రహాలు దారుశిల్పాలు(ట). పదడుగుల ఎత్తుంది ఎల్లమ్మ దేవత. దానికి తూర్పున శ్రీ చక్రేశ్వర దేవాలయం వుంది ఆ దేవాలయంలో శివలింగం పానవట్టం మీద రెండడుగుల ఎత్తు,అడుగుకు ఎక్కువ కైవారంతో వుంది. పానవట్టం ఎటూ నాలుగడుగుల వెడల్పుతో విశాలంగా వుంది. సోమసూత్రం


పార్శ్వనాథ


ద్వారశాఖ


జినుని అధిష్టానపీఠం


గరుత్మంతుడు


జైన తోరణం

**బోధన్ శాసనాలు:**

| కాలం | పాలకులు | దాత | శాసన సంపుటి | భాష | లిపి |
|---|---|---|---|---|---|
| 1041డి5 | పశ్చిమచాళుక్య | – | ని.జి.శా.సం.5, పే.9 | కన్నడం తెలుగన్నడం | నాగనంది భట్టారకుని శిష్యుడు త్రిరత్న, త్రికాలజ్ఞాన జైనసాధువు గుండ విముక్త భట్టారక ముక్తి పొందాడు. |
| 1056జూ28 | పశ్చిమచాళుక్య | జోగపయ్య | ని.జి.శా.స.8.పే.21 | కన్నడం తెలుగన్నడం | రాష్ట్రకూట చక్రేశ్వర ఇంద్రవల్లభుడు రాజధాని పోదనలో ఇంద్రనారాయణ దేవాయతనాన్ని కట్టించాడు. శిథిలమైన ఆ గుడిలో విష్ణుదేవుని ప్రతిష్టించి, గరుడధ్వజ మెత్తించిన ఆహవమల్లప్రెగ్గడ జోగపయ్య. ఎన్నో కానుక లిచ్చాడు. |
| 1072సె8 | భువనైకమల్ల | – | ని.జి.శా.సం.12,పే.39 | కన్నడం, తెలుగన్నడం | జైనముని చంద్రప్రభదేవ సమాధై, ఇంద్రలోకం చేరాడు. |
| | త్రిభువనమల్ల | మల్లయాఖ్య | ని.జి.శా.సం.18,పే.73 | కన్నడం, తెలుగన్నడం | జినాలయాన్ని మల్లశ్రేష్టి (వణికృతి) నిర్మించాడు. |
| 10వ శ. | – | – | ని.జి.శా.సం.26, పే.97 | కన్నడం, తెలుగన్నడం | దేవేంద్రసిద్ధాంతముని శిష్యుడు రత్నత్రయ శుభనంది ముక్తిపొందాడు. (పంప సమాధి) |
| 11వ శ. | పశ్చిమచాళుక్య | జోగపయ్య | ని.జి.శా.స.27, పే.99 | కన్నడం, తెలుగన్నడం | జైనబసదికి కరణం జోగపయ్య 12 మర్తురుల భూమినిచ్చాడు. |
| | పశ్చిమచాళుక్య | – | ని.జి.శా.సం.29, పే.104 | కన్నడం, | నేమిచంద్రుని శిష్యుడు మేఘనంది మునీంద్రుడు |


సరస్వతి


విడి శిల్పాలు


బకాసురుని గుడి


జైన చౌముఖి


ఎల్లమ్మ (చక్రేశ్వరి)

ఉత్తరదిశలో వుంది. బయట చెట్టుకింద కొలువైవున్న దేవతాగణంలో సూర్యుడు, వీరభద్రుడు, ఆంజనేయుడు, దుర్గ, చండికలున్నారు. మరో పక్కన జైనశిల్పతోరణం వుంది. కాయస్థభంగిమలో వుండే తీర్థంకరుల విగ్రహంపైనుండేది. సప్తమాతృకలలో ఇద్దరు మాతలున్న శిల్పభాగం మిగిలివుంది.

పాండవుల చెరువు తూము దేవాయాలలో వాడే స్తంభాలతో నిర్మించబడ్డది. తూము పైన మూడు పలకల తెల్లరాయి శాసనం వుంది.దానిమీద సూర్యచంద్రులు, శివలింగం, ఖడ్గం, వృషభాలు వాటికింద అక్షరాలు చెక్కబడివున్నాయి.కాకతీయుల శాసనమై వుంటుంది. చదువడానికి వీల్లేకుండా పూర్తిగా శాసనం మొదలయేదాకా పాతివుంది. అది చదువబడినదో లేదో తెలియదు.

అక్కడికి చేరువలో బొర్రగణపతి గుడివుంది.ఈ గణపతి వంటి కొంచెం శయనస్థితిలో వున్న వినాయకుడు భువనగిరిలో వున్నాడు.

స్థానిక రెవెన్యూకార్యాలయంలో బయట జైనతీర్థంకరులు 24మంది శిల్పాలతో 'చౌముఖి' స్తంభం వుంది.ఇట్లాంటివి ప్రసిద్ధ జైనవిద్యాకేంద్రాలలోనే వుంటాయంటారు.బాహుబలి పాలించిన ఈ బోధన్ లేదా పోతలిలో నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాల వంటి ప్రఖ్యాత విద్యావేత్తలు నిర్వహించిన విద్యాలయం వుండేదని చరిత్రకారుల రాతలవల్ల తెలుస్తున్నది.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

ప్రకృతి గమనం! 3 ప్రకృతి ధర్మం!!

# గతితప్పుతున్న భూభ్రమణం!

భూమి తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతుందని మనం భూగోళశాస్త్రంలో చదువుకున్నాం. నిర్దిష్టమైన కక్షలో, నియమిత వేగంతో భూగమనం వుండడంతో, రాత్రి పగలు, రుతువులు క్రమానుగత సమయాల్లో ఏర్పడుతున్నట్లుగా తెలుసుకున్నాం. ఈ విధంగా రాత్రిపగలుకు 24 గంటల సమయం, సూర్యుని చుట్టూ తిరిగి రావడానికి ఒక సంవత్సరం ($365+\frac{1}{4}$ రోజులు) పడుతుందని తెలుసుకున్నాం. కాని ఈ పరిజ్ఞానమంతా నిన్నటి కథనాలు, ఆలోచనలు. ఈ మధ్యన జరుగుతున్న పరిణామాలు, సంఘటనలు, అనూహ్యంగా చోటుచేసుకుంటున్న విపత్తులతో భౌగోళికంగా మార్పులు జరుగుతున్నాయని సంకేతాల్ని ఇస్తున్నాయి.



గత అయిదు దశాబ్దాలుగా భూభ్రమణాన్ని అంచనా వేస్తున్న శాస్త్రజ్ఞులకు అనేక కొత్త విషయాలు అవగత మౌవుతున్నాయి. భూమి గమనవేగంలో హెచ్చు తగ్గులు జరుగుతున్నట్లుగా పరిశీలనలు తెలుపుతున్నాయి. సాధారణంగా రాత్రిపగలు ఏర్పడడానికి 24 గంటల సమయం పడుతుందని అందరం భావిస్తాం. ఇది వాస్తవమని కూడా గుర్తిస్తాం. అలాగే సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజులని లెక్కించినా, ఇది వాస్తవం కాదని, ఇది $365+\frac{1}{4}$. రోజులని, ఇలా ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి, ఈ నాలుగు పావులను కలిపి ఒక రోజుగా లెక్కించి 366 రోజులుగా, దీన్ని లీప్ (Leap) సంవత్సరంగా ప్రకటిస్తున్నాం. అంటే, మనం భావిస్తున్నట్లుగా భూమి తనచుట్టూ తాను తిరగడానికి గాని, సూర్యుని చుట్టూ చుట్టి రావడానికి గాని పట్టే కాలాన్ని కచ్చితంగా లెక్కించడం సాధ్యంకాలేదు. అయితే, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత భూగమన కాలాన్ని దాదాపుగా 99.9 శాతం లెక్కించే అవకాశం ఏర్పడింది. ఏది ఏమైనా గణితభావనలు అతి దగ్గరి విలువదాకా లెక్కించినా, కొలిచినా, పారలాక్స్ దోషం (parallax error) వుండడం జరుగుతుంది. కాబట్టి ఏ గణిత లెక్కలైనా సుమారుగా, దాదాపుగా వుంటాయి గాని, వందకు వందశాతం (absolute truth)గా వుండవు. అందుకే, గణితశాస్త్రం అంచనాలతోనే వుంటుంది (వీటి లోతుల్లోకి పోవడం ఇక్కడ చర్చకాదు).

భూభ్రమణ పరంగా చూసినప్పుడు కూడా, ఇలాంటి సూక్ష్మాతి సూక్ష్మమైన దోషాలు వుండడం సహజం. అలాగే భూభ్రమణ కాలం కూడా హెచ్చుతగ్గులు వుండే అవకాశంతో పాటు, ఆ గమనాన్ని నిక్కచ్చితంగా లెక్కించే అవకాశాలు వుండవు. అయితే, శాస్త్రపరిజ్ఞానం పెరిగేకొద్దీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో గత అంచనాలు మారుతూ వుంటాయి. ఈ లెక్కన భూభ్రమణానికి పట్టే 24 గంటలు (86,400 సెకన్లు) సుమారు విలువనే గాని కచ్చితమైన విలువకాదు.

**ఇంతకి భూభ్రమణ సమయంకు యెంత?**

అధునాతన అణుగడియారాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత భూభ్రమణ సమయం (time scale) 23 గంటల 56 నిమిషాల 4 సెకన్లుగా తేలుతున్నట్లు పరిశీలనలు తెలుపుతున్నాయి. అయినా, ఇది కూడా కచ్చితమైన సమయం కాదు కాబట్టి, భూభ్రమణం సమయం 86,400 సెకన్లకు అటూ, ఇటూగా వుంటుందని ఈ మధ్యన పరిశీలనలు తెలుపుతున్నాయి. నిజానికి భూమి ఆకారం గుండ్రంగా (బంతి) కాకుండా లఘ్వక్ష గోళాభం (oblate spheriod) (ద్రాక్షపండు) ఆకారంలో వుంటుంది. దీంతో భూమధ్యరేఖ వద్ద అక్షాంశాల మధ్యదూరం తక్కువగా, ధృవాలవద్ద కొంచెం ఎడంగా వుంటుంది. (చూడు దక్కన్‌ల్యాండ్ - సెప్టెంబర్ 2021). ఈ తేడానే భూభ్రమణ మొత్తం భూగోళమంత ఏకరీతిగా వుండకుండా, భూమధ్యరేఖ వద్ద భ్రమణ వేగం (గంటకు సుమారుగా 1674 కి.మీ.గా) ధృవాల దగ్గర దాదాపు శూన్యంగా వుంటుంది. అనగా భూమధ్యరేఖ నుంచి పైకి (కర్కటరేఖ), కిందికి (మకర రేఖ)ల వైపు పోయిన కొద్ది భూభ్రమణ వేగం తగ్గుతూ వుంటుందన్న మాట!

నిజానికి భూభ్రమణ వేగం కోణీయ ద్రవ్యవేగంతో (angular momentum) సంబంధాన్ని కలిగి వుంటుంది. అనగా భూమి తన అక్షం (axis) చుట్టూ తిరగడానికి కావల్సిన శక్తి

## అతి పొట్టి రోజులు

- గత సంవత్సరం జులై 9, 2025న భూమి సాధారణ వేగంకంటే 1.3 నుంచి 1.6 మిల్లీ సెకన్ల భ్రమణ వేగం పెరిగింది. సాధారణ భూభ్రమణ వేగం కన్నా ఇవి ఎక్కువ కాబట్టి ఈ రోజు సమయం తగ్గుతుంది. కాబట్టి, సాధారణ సమయం నుంచి ఈ పెరిగిన భ్రమణ వేగ సమయాన్ని తగ్గిస్తారు. దీంతో జులై 9, 2025 పొట్టి రోజుగా రికార్డు అయింది.
- అలాగే జులై 22, ఆగస్టు 5న కూడా భూభ్రమణ రేటు పెరగడంతో ఇవి కూడా పొట్టిరోజులు (తక్కువ సమయం)గా గుర్తించారు.

(torque)పై ఆధారపడుతుంది. ఈ శక్తిలో హెచ్చుతగ్గులు కూడా భూభ్రమణ రేటుపై ప్రభావం చూపుతుందన్న మాట!


డంకన్ అగ్న్యూ


బెండిక్ట్ డి సోజా

### భూభ్రమణంలో మార్పులు సహజ ప్రక్రియనా..?

ముఖ్యంగా గత అయిదు దశాబ్దాలుగా భూభ్రమణంలో మార్పులు అనగా హెచ్చు (రాత్రి పగలులో తరుగుదల), తగ్గులు (రాత్రి పగలులో పెరుగుదల) జరుగుతున్నట్లుగా పరిశీలనల గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ భ్రమణానికి సంబంధించిన కచ్చితమైన లెక్కలు అందుబాటులో లేకపోగా, భూగోళ, ఉపరితల, అంతర్గత పరిశీలనల ప్రకారం భూభ్రమణ మార్పులకు చంద్రుడి ప్రభావం వుంటుందని భావిస్తున్నారు. అలాగే బిలియన్ సంవత్సరాల క్రితం భూమి రాత్రి, పగలు కలిపి సుమారు 19 గంటలేనని, 610 మిలియన్ సంవత్సరాల క్రితం సుమారు 21 గంటలని శాస్త్రజ్ఞులు అంచనా వేసారు. ఇలా 19 గంటల నుంచి (నాడు భూమి భ్రమణ వేగం అత్యధికంగా భావించాలి) నేటి 24 గంటల భ్రమణానికి చేరుకోవడానికి మిలియన్ల సంవత్సరాలు పట్టిందని అర్థం. ఈ లెక్కన నేటి 24 గంటల సమయం క్రమక్రమంగా పెరిగి మరింత ఎక్కువ సమయాన్ని భూమి భ్రమించడానికి తీసుకోవచ్చు కూడా! లేదా తక్కువ సమయాన్ని కూడా తీసుకోవచ్చు.

ఈ మధ్యన జరుగుతున్న పరిశీలనల ప్రకారం భూభ్రమణం అనేది ప్రకృతి విపత్తులతో సంబంధం కలిగి వుంటున్నట్లుగా కూడా గుర్తిస్తున్నాయి. పోతే, ఇవి కచ్చితమైన కారణాలు అని చెప్పడానికి ఇంకా నిరూపణలు సేకరించాల్సి వుంది.

### భూభ్రమణంపై చంద్రుడి ప్రభావం!

సౌరకుటుంబంలోని వింతలు మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. చంద్రుడికి సముద్ర అలలకి దగ్గరి సబంధం వున్నట్లుగా ఆదిమానవుడి కాలం నుంచి గుర్తెరిగిందే! అయితే, శాస్త్ర పరిశోధనలు పెరిగిన తర్వాత, భూమిని ఆధారంగా చేసుకొని తిరిగే చంద్రుడి గమనం భూమిపై తీవ్ర ప్రభావం చూపుతందని, ఈ కారణంగానే, భూభ్రమణంలో గుణాత్మకమైన మార్పులు జరుగుతున్నట్లుగా అంచనాలు. అనగా, లక్షలాది సంవత్సరాలుగా చంద్రుడి ప్రభావంతో ఏర్పడే సముద్ర ఆటుపోట్లు భూభ్రమణంపై ప్రభావం చూపుతున్నందున భ్రమణ వేగం మందగించిందనేది ఒక వాదన. ఇలా మందగించిన నాడు దినసరి కాలానికి దాదాపు 2.3 మిల్లీ సెకన్లను ఒక రోజుకు జోడించాల్సి వస్తుంది.

మరో అంచనా ప్రకారం, గత 20,000 వేల సంవత్సరాల నుండే భూభ్రమణ వేగం పెరిగిందనేది మరో భావన. దీనికి గల కారణాలలను పరిశీలిస్తే, చివరి మంచు యుగం ముగినప్పుడు, ధృవమంచు పలకలు కరగడంతో భూ ఉపరితల పీడనం తగ్గడం జరిగింది. ఇది భూ మధ్యభాగమైన మాంటిల్‌పై ఒత్తిడి కలిగించడంతో, మాంటిల్ ధృవాలవైపు కదలడంతో (అధిక పీడనం నుంచి అల్పపీడనం వైపు), భూభ్రమణ వేగం పెరిగిందనేది మరో అంచనా! ఇలాంటి సందర్భాలలో భూభ్రమణ దినసరి కాలంను సెకనులలో సుమారు వెయ్యోవంతు తగ్గించాల్సి వస్తుంది.

అనగా, భూభ్రమణ వేగం పెరిగితే, సరాసరి రోజు సమయం తగ్గడం, వేగం తగ్గితే సరాసరి రోజు సమయం పెరగడం అనివార్యం అవుతుంది. నిజానికి ఈ సమయాలు గుర్తించ లేనంతగా వుంటాయి కాబట్టి, పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని కొందరు భౌగోళిక పరిశోధకుల వాదన. కాని, గత పరిణామాలని, ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల్ని చూసినప్పుడు భూభ్రమణ గమనాల హెచ్చు తగ్గులు భవిష్యత్తులో తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని, ఇప్పటికే ఈ విపత్తులు మొదలయ్యాయని మరికొందరి పరిశీలకుల భావన. వీరి వాదనకు గల ప్రధాన కారణం, మాంటిల్ ద్రవ్యరాశి భూమి అక్షానికి దగ్గరగా వెళ్ళితే భూభ్రమణ రేటు పెరుగుతున్నట్లు, దీంతో ప్రతి శతాబ్దంలో ఒకరోజును 0.6




మిల్లి సెకన్ల చొప్పున తగ్గిస్తున్నదని లెక్కలు చూపుతున్నాయి. వీటికి తోడుగా, భూమి అంతర్భాగంలో చోటు చేసుకునే పరిణామాలు, భూకంపాలు, అగ్ని పర్వతాల కదలికలు కూడా భూభ్రమణ రేటును పెంచడంలో ప్రభావం చూపుతాయని అంటున్నారు.

అలాగే, భూమిపై గల వాతావరణ, ఉపరితల భౌతిక పెనుమార్పులు, అతివేగంగా వీచే గాలులు, సునామీల సందర్భంగా ఏర్పడే ఎత్తైన అలలు కూడా భ్రమణ రేటుపై ప్రభావం చూపుతున్నట్లుగా కూడా కొన్ని పరిశీలనలు తెలుపుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం 2022 జూన్ 29న భూగ్రహం తక్కువ నిడివిగల రోజును రికార్డు చేసిందని, కాని, 2020 నుంచే భూగ్రహం యొక్క రోజు నిడివి పెరుగుదలనే సూచిస్తుందని ఆధునిక అణుగడియారాల లెక్కలు తేల్చుతున్నాయి.

**భూభ్రమణం – సహజ కారణాలు:**

ఈ మధ్యన కొన్ని పరిశీలనలు ఆసక్తికరమైన అంశాల్ని ముందుకు తెస్తున్నాయి. కాలిఫోర్నియాకు చెందిన దంకన్ ఆగ్న్యూ (Duncan Agnew) పరిశీలనల ప్రకారం సముద్ర అలల ప్రభావం చాలా పరిమితమని, కాని, భూమి ఆధారంగా తిరిగే చంద్రుడి గమనం భూగమనంపై ప్రభావం చూపుతుందని తెలిపాడు. అనగా చంద్రుడు భూమధ్యరేఖ పై భాగాన వుంటే, భూమి వేగం కొంతమేర మందగిస్తుందని, అలాగే వేసవిలో భూమి కాస్త నెమ్మదిగా పయనిస్తుందని కూడా చెప్పాడు. అయితే, వీటికి గల స్పష్టమైన వివరణలు ఇంకా కావాలి. పోతే, వాతావరణ మార్పులు, పీడనాల్లో హెచ్చుతగ్గులు భూభ్రమణంపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు.

నాచురల్ జర్నల్ (Natural Journal)ల్లో ఆగ్న్యూ రాసిన మరికొన్ని అంశాలు కాదనలేనివిగా వున్నాయి. భూగోళంపై వున్న ఘన (కొండలు, పర్వతాలు, పీఠభూములు, మంచు ఖండికలు మొ॥), ద్రవ (సముద్రాలు, నీటి నిల్వలు), వాయువులు (హెచ్చు తగ్గులు) భూమిపై కలిగించే ఒత్తిడి కూడా భూభ్రమణ వేగంపై ప్రభావం చూపుతున్నట్లుగా వివరించాడు. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రొ॥ బెనెడిక్ట్ డిసోజా (స్విట్జర్లాండ్) పరిశోధనల ప్రకారం, ధృవాల మంచు కరగడంతో భూమి యొక్క అక్షంలో మార్పుల్ని

## అణుగడియారాలు:

- అణుగడియారాల్ని 1960 నుంచి ఉపయోగించి సమయాన్ని అతి కచ్చితంగా లెక్కిస్తున్నారు.
- 1972 నుంచి ప్రపంచ వ్యాపితంగా ఒకే విధమైన సమయాన్ని లెక్కించడం ప్రారంభమైంది.
- సెల్‌ఫోన్లలో, కంప్యూటర్లలో కూడా అణుగడియారాల సమయాన్నే వాడుతున్నారు. కాబట్టి ప్రపంచమంతా సెకన్ల తేడా లేకుండా సమయం ఒకే తీరుగా వుంటున్నది. దీన్ని అంతర్జాతీయ అణు సమయం (International Atomic Time - TAI) గా పిలుస్తారు.
- దీని ఆధారంగానే ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్ (IERS) సంస్థ ప్రకారం జులై 9 ని అతి పొట్టిరోజుగా గుర్తించింది.
- భూభ్రమణ హెచ్చుతగ్గులకు అనుగుణంగా భౌగోళిక సమయాన్ని సమలేఖనం చేయడానికి కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ (UTC) అనే విధానం రూపొందింది. దీనికి లీప్ సెకండ్‌ను జోడించడం, లేదా తగ్గించడం చేస్తారు.
- భూభ్రమణం మందగిస్తే లీప్ సెకనును (Positive Leap Second) కలపడం, భ్రమణ వేగం పెరుగుతే లీప్ సెకనును (Negative Leap Second) తగ్గించడం చేస్తారు.
- TAI సమయానుసారం నుండి 0.9 సెకన్ల కంటే ఎక్కువ సమయం తగ్గుతే IERS సంస్థ జూన్ 30న లేదా డిసెంబర్ 31న అణుగడియారాలకు ఒక సెకనును జోడించడం. లేదా 0.9 సెకన్ల కంటే ఎక్కువ సమయం పెరుగుతే ఒక సెకనును తగ్గించడం చేస్తారు.
- భూభ్రమణ గమనం ఇలాగే హెచ్చుతగ్గులతో కొనసాగుతే 2029లో ఒక లీప్ సెకండు అవసరం పడుతుంది.

కలిగిస్తుందని, ఇది కూడా భూభ్రమణ రేటుపై ప్రభావం చూపుతుందని తెలిపాడు.

సౌరకుటుంబ (మండలిం సహజ ప్రక్రియలైన ఉల్కాపాతాలు, సూర్యుడి అత్యంత వేడి ఉద్గారాలు, సౌర తుఫానులు, భూమికి అటూ ఇటూ గల అంగారక, శుక్రగ్రహాలు కూడా భూభ్రమణ వేగంపై ప్రభావం చూపే అవకాశాలు కూడా లేకపోలేదు.

(మరికొన్ని వివరాల్ని వచ్చే సంచికలో చూద్దాం!)

– డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com



# మునగ.. లాభాల సిరి!

కరువు వంటి ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోవటానికి మునగ సాగు దోహద పడుతుంది. మెట్ట ప్రాంతాల్లో పండించుకోవచ్చు. మునగ కాయలతో పాటు ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. గొప్ప రోగ నిరోధక, ఔషధ లక్షణాల కారణంగా మునగ ఉత్పత్తులకు ఔషధ పరిశ్రమలో అధిక డిమాండ్ ఉంది. మునగ ఆకును పొడి రూపంలో లేదా గుళికలు లేదా మాత్రలుగా విక్రయిస్తారు. దీని గింజల నుండి తీసిన నూనెలను ఆహార పదార్థాలు, సౌందర్య సాధనాల తయారీకి, వివిధ యంత్ర నూనెల తయారీకి ఉపయోగిస్తారు. 3 సంవత్సరాల లోపు ఆయిల్‌ఫామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు.

**మునగ (మోరింగ ఒలిఫెరా- Moringa oleifera)**

కరువును తట్టుకునే చెట్టు. మునగ కాయలు, ఆకులు, పువ్వులకు అధిక పోషక విలువలకు నిలయం. మునగ ఆకులు, గింజలు లేదా పండ్లు, పువ్వులు, వేర్లలో విటమిన్లు ఎ, సి, కాల్షియంతో పాటు మానవ ఆరోగ్యానికి ముఖ్యమైన అన్ని ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. మునగ ఆకుల్లో నారింజలో లభించే విటమిన్ సి కంటే 7 రెట్లు ఎక్కువ,పాలలో లభించే కాల్షియం కంటే 4 రెట్లు, అరటి పండ్లలో లభించే పొటాషియం కంటే 3 రెట్లు, పాలలో లభించే ప్రోటీన్ కంటే 2 రెట్లు ఎక్కువ.

**నీరు నిలవని నేలలు అనుకూలం**

మునగ వేడి, ఉష్ణ మండల, సమశీతోష్ణ మండల ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. 25-30 డిగ్రీల ఉష్ణోగ్రత మునగ పూత రావడానికి అనుకూలం. వేడి, తడి వాతావరణం దీనికి బాగా సరిపోతుంది. ఈ పంట వివిధ రకాల నేలలకు అనుగుణంగా ఉంటుంది. కానీ 6.5-8.0 పీహెచ్ కలిగిన, బాగా ఇసుక గల ఒండ్రు నేలల్లో మంచి పంటనిస్తుంది. నీరు నిలవని తేలికపాటి ఇసుక లేదా లోతైన ఒండ్రు నేలలు అనుకూలం. నీరు బాగా ఇంకే నేలలు అనుకూలం. నేలను చాలాసార్లు బాగా దున్నాలి. వార్షిక రకాలకు 45×45×45 సెం.మీ. కొలతలు గల గుంతలు తవ్వాలి. ప్రతి గుంతకు 10 కిలోల కంపోస్ట్ లేదా పశువుల ఎరువు వేసి, నాటడానికి ముందు పై మట్టితో కలిపి నింపుకోవాలి. హెక్టారు భూమికి దాదాపు 1200-1500 మొక్కలను పెంచవచ్చు. వర్షాకాలంలో మొక్కలు నాటాలి. విత్తడానికి ఇది సరైన సమయం.

మునగలో అనేక రకాలు ఉన్నాయి. చాలా రకాలు కాయల ఉత్పత్తికి అనుకూలంగా ఉంటాయి. కొన్ని మాత్రమే మంచి ఆకు ఉత్పత్తిని ఇస్తాయి. అధిక దిగుబడినిచ్చే వార్షిక రకాలు వాణిజ్య సాగు ఎంపిక అనుకూలం. మునగ మొక్కలను విత్తనాలు లేదా కాండపు కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేయవచ్చు. ఏక వార్షిక రకాలను విత్తన ప్రవర్ధనం చేయటం వలన బలమైన వేర్ల వ్యవస్థ అభివృద్ధి చెంది, మొక్కలు కరువును బాగా తట్టుకుంటాయి. అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. నాణ్యమైన విత్తనం కోసం విశ్వసనీయ నర్సరీలను (లేదా) వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను సంప్రదించాలి.

**రకాన్ని బట్టి నాటే దూరం**

జూలై-అక్టోబర్ మధ్య నాటవచ్చు. పూత సమయంలో

వర్షాలు లేకుండా విత్తే సమయం నిర్ణయించుకోవాలి. హెక్టారుకు సుమారు 500–625 గ్రా. విత్తనాలు అవసరం. విత్తనాలను 2.5–3 సెం.మీ. లోతులో విత్తవచ్చు. మొక్కలు బాగా నిలదొక్కుకోవడం కోసం, నాటడానికి ముందు 35–40 రోజులు పాలీబ్యాగ్‌లలో 70–90 సెం.మీ. ఎత్తుకు పెంచి తర్వాత ప్రధాన పొలంలో నాటుకోవాలి. సాగుదారులు ఎకరానికి 1000–1250 విత్తనాలను ఒక గుంతలో 2 విత్తనాల చొప్పున ఉపయోగించవచ్చు. రకం, సాగు పద్ధతిని బట్టి నాటే దూరం మారుతూ ఉంటుంది. ఏక వార్షిక రకాల మొక్కలను 2.5×2.5 మీ. దూరంలో నాటవచ్చు. పి.కె.ఎం–1 వంటి రకం 1.5×1.0 మీ. దూరంతో అధిక సాంద్రత పద్ధతిలో నాటవచ్చు. బహువార్షిక రకాల మొక్కలను 6×6 మీటర్ల దూరంలో నాటుకోవాలి.

### రెండు నెలలు విధిగా నీరు

ముఖ్యంగా పొడి పరిస్థితులలో మొదటి రెండు నెలలు క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. మునగ చెట్లు కరువును తట్టుకుంటాయి, కానీ, పొడి కాలంలో ప్రతి 10–15 రోజులకు నీరు పెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుంది. బిందు సేద్యం దిగుబడిని గణనీయంగా పెంచుతుంది. పూత రాలిపోకుండా ఉండాలంటే ఫిబ్రవరి–మార్చి నెలల్లో నీటిని తగ్గించాలి. కానీ, నీటి ఎద్దడిని నివారించడానికి తగినంత తేమను వుండేలా చూడాలి.

### కొమ్మ చివర్లను తుంచాలి

మునగ మొక్కలు 75 సెం.మీ. ఎత్తు ఉన్నప్పుడు పెరుగుతున్న చివర్లను తుంచి వేయాలి. తద్వారా పక్క కొమ్మలు పెరుగుతాయి. ఆ పక్క కొమ్మలు 40–60 సెం.మీ పొడవుకు చేరుకున్నప్పుడు, వాటి పైభాగాన్ని తుంచి వేయాలి. ఇలా చేయడం వల్ల మొక్కలు ఎక్కువ కొమ్మలతో గుబురుగా పెరుగుతాయి. ఎక్కువ కాయలతో దిగుబడి పెరుగుతుంది. బహువార్షిక రకాల్లో ప్రతి పంట తర్వాత కొమ్మలను కత్తిరించడం వలన కొత్త కొమ్మలు వచ్చి దిగుబడి పెరుగుతుంది. ఏక వార్షిక రకాల మొదటి పంట తర్వాత, కొత్త పంటను ప్రోత్సహించడానికి చెట్లను నేల నుండి ఒక మీటరు వరకు కత్తిరించాలి. ముఖ్యంగా మొక్కలు పెరిగే ప్రారంభ దశల్లో క్రమం తప్పకుండా కలుపు తీయటం చాలా అవసరం. మొక్కలు పూర్తి స్థాయిలో పెరిగి దిగుబడినిచ్చే వరకు, తక్కువ కాలవ్యవధి గల కూరగాయలతో అంతర పంటలు వేయడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ పద్ధతి కలుపు మొక్కల నియంత్రణలో కూడా సహాయపడుతుంది.

### సస్యరక్షణ

కాయ తొలిచే పురుగు లేత కాయలపై గుడ్లు పెట్టి కుళ్ళిపోయేలా చేస్తుంది. కాయలను తొలచి లోపలి గుజ్జును తినేస్తుంది. గొంగళి పురుగుల వల్ల పూత, మొగ్గలు ముందుగానే రాలిపోతాయి. సోకిన మొగ్గలను సేకరించి నాశనం చేయాలి. గొంగళి పురుగు లార్వా ఆకులను గుంపుగా తిని ఆకులు రాల్చుతాయి. బెరడు తొలచే పురుగు కాండం బెరడును తొలచి మొక్కను బలహీనపరుస్తుంది. ఆకు తినే పురుగు లార్వా మొక్కల ఆకులను తిని వాటి పెరుగుదలకు హాని కలిగిస్తుంది. తామర పురుగుల వల్ల కాయల మీద మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గుతుంది. వేరు, కాండం కుళ్లు వర్షాకాలంలో మురుగు నీరు పోయే సౌకర్యం లేని నేలలో ఎక్కువగా ఆశిస్తుంది. వీటి నిర్వహణకు శాస్త్రవేత్తల సూచనల ప్రకారం పురుగుమందులను వాడాలి.

### రకం, నిర్వహణను బట్టి దిగుబడి

సాధారణంగా మొక్కలు నాటిన 6–8 నెలల్లో మొదటి పంటను పొందవచ్చు. మొక్కలకు బదులు నేరుగా విత్తనాలు వేసుకుంటే తొలి పంటకు ఒక సంవత్సరం పడుతుంది. సంవత్సరానికి రెండుసార్లు రెండు పంటలు (జూలై–సెప్టెంబర్) మరియు (మార్చి–ఏప్రిల్) వస్తాయి ప్రారంభంలో మొదటి రెండు సంవత్సరాలలో, మొక్కలు 250–300 కాయలను దిగుబడినివ్వ గలవు. తర్వాత సంవత్సరాలలో 500 వరకు పెరుగుతుంది. సంవత్సరానికి హెక్టారుకు 31 టన్నుల కాయలను ఉత్పత్తి చేయవచ్చు. అనేక హైబ్రిడ్ జాతులు సంవత్సరానికి ఒక మొక్కకు 800–1000 కాయల దిగుబడిని అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. రకం, నిర్వహణ ఆధారంగా దిగుబడి గణనీయంగా మారుతుంది. వార్షిక రకాలు హెక్టారుకు 50–55 టన్నులను ఉత్పత్తి చేయగలవు.

– బాలారణ్య, ప్రజ్ఞాపురం, గజ్వేల్
e: balaranya.info@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com



# 'బాలల రచనల దునియా'

## (1.1.2025 నుండి అక్టోబర్ 31 వరకు వెలువడిన పుస్తకాల సంక్షిప్త పరిచయం)

(గత సంచిక తరువాయి)

**"నాన్నే నా హీరో":** తమ వృత్తి వేరైనా ప్రవృత్తి రచనా వ్యాసాంగం, బతుకుదెరువు కోసం గంగిరెద్దులాడిస్తూ పొట్టపోసుకోవడం ఉండేది రోడ్డు పక్కన గుడారం, బతుకుబండిని లాగిస్తూ తల్లిదండ్రులకు అండగా నిలుస్తూ, రమాదేవి లాంటి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వేమన పద్యాల అవధానం, విన్నవి, కన్నవి అంశాలను కథలుగా మల్చడం చూసి ఆ చిన్నారి సృజనాత్మక కథారచన ప్రతిబను గుర్తించి ఇరవై కథలతో సంకలనంగా తెచ్చారు 'నాన్నే నా హీరో' సత్తుపల్లిలోని గార్లపాటి బొల్లేపల్లి ట్రస్టువారు. **ఆవుల పోతురాజు** పదోతరగతి విద్యార్థి ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని నిరూపించాడు.

'నాన్న పిసినారె' అనుకున్నాడు. ఏది కావాలని అడిగిన వాయిదావేసేవాడు. తమ బతుకు పోరాటంలో తన కొడుకు భవిష్యత్తు కోసం కూడబెడుతున్నాడని ఆ చిన్నారికి తెలియదు. అర్థం చేసుకోలేదు. చిన్నారి కాలికి గాయమై చికిత్స మొదలెట్టకపోతే తొలగించే దశని డాక్టరు చెప్తే, ఆపరేషన్ చేసి కాపాడమని తన దగ్గరున్న ధనమంతా తెచ్చి ఇచ్చిన సన్నివేశం చూస్తే కళ్లను చెమర్చక మానవు. ఏ తల్లైనా తండ్రైన తమకున్న లేకున్నా తమ పిల్లల కోసం అన్నీ త్యాగం చేస్తారని తెల్పే గొప్ప సందేశమిచ్చే కథ "నాన్నే నా హీరో" అందువల్ల వారిని తక్కువగా అంచనా వేయవద్దంటాడు.

**అనుబంధాలు:** కవితలు రాయడానికి అనర్హమైన వస్తువులేదని, **మల్లె వెంకటసుప్రజ** మరొకసారి ఋజువు చేసిందని, కెనడా కేంద్రంగా పిల్లల కోసం వెలువడే 'గడుగ్గాయి' పత్రిక సంపాదకురాలైన లక్ష్మీరాయవరపు ముందుమాటలో తెల్పడం, పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న కందుకూరి భాస్కర్‌ను అభినందించారు. వీరి సంపాదకత్వంలో 13వ పుస్తకం ఈ బడి పిల్లలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు, బహుమతులు సాధించడం గొప్ప విషయం.

ఇరవై తొమ్మిది కవితల్తో వెలువడిన "అనుబంధాలు" 'చెట్టమ్మ-చెట్టు' కవితలో గల బంధాల్ని అనుబంధాల్ని గుర్తించి రాసింది 'చెట్టమ్మ.. చెట్టు... నీవే మాకు దిక్కు' అంటూ చక్కగా కవితను రాసింది ఇలాంటి కవితలెన్నో వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి.

**పల్లెటూరి పిల్లగాండ్లు:** తన గురించి రాసుకొనే కథ ఆత్మకథ కాని ఇక్కడ ఆత్మకథలు చెప్పేది సైనికుడు, చెట్టు గుట్ట, వాగు, వంకలు, వాటిలో పిల్లలు పరకాయ ప్రవేశం చేసి మనసులోని మాటల్ని విన్పిస్తారు. అదే "పల్లెటూరి పిల్లగాండ్లు" ఆత్మకథల పేర వెలువరించి సంపాదకత్వం వహించింది కందుకూరి భాస్కర్. పాఠ్యాంశంలో భాగంగా వివిధ ప్రక్రియలను పరిచయం చేస్తూ పిల్లల ఆలోచనలకు రూపమిస్తూ ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులెందరో.

**పావకొల్లు పసిడి కథలు:** విద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే విద్య. ఆ విద్యలో భాగంగా విశేషంగా కృషి చేస్తు, ఇప్పటికి పిల్లలు రాసిన 17 పుస్తకాలు వెలువరించిన వారు పురిమళ్ల సునంద తను రాస్తూ, పిల్లల చేత రాయిస్తూ ప్రోత్సహకాలందిస్తు పుస్తక ప్రచురణ చేస్తున్నారు. "పావకొల్లు పసిడి కథలు"లో 25 కథలు. **కృష్ణమనోహర్** కథ. చెప్పుడు మాటల వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతాయో, ఎలాంటి జాగ్రత్తలు అవసరం అని చెప్పే కథ 'చెప్పుడు మాటలు'.

**పిల్లలకోసం పిల్లలే రాస్తే:** జాతీయ కథలపోటీ నిర్వహించి వెలువరించిన కథల సంకలనం "పిల్లల కోసం పిల్లలే రాస్తే" 35 కథలు. వీధులు, మురుగు నీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వివిధ రకాల చెత్తను సేకరించి తీసుక వెళ్తున్న 'పారిశుధ్య కార్మికులు' పేర రాసిన కథ వారు లేకపోతే మన ఆరోగ్యం? అంటూ ప్రశ్నిస్తూ, వారి గొప్పతనాన్ని ప్రశంసిస్తూ కథ రాసింది **మేఘన.**

**"ప్రకృతితో మమేకమై":** అనుపేర కవితలు పోటీల్లోని ఉత్తమ కవితలు 28. పచ్చని వనమే తోడుంటే / చక్కగా నేను




చిగురిస్తా అంటూ చక్కటి కవిత పచ్చనివనం రాసింది **రామ్‌చరణ్.**

**అమ్మ చెప్పింది:** ఇవన్నీ ఒకెత్తు ఐతే మీ అమ్మ గురించి ఏమనుకుంటున్నారు. మీమీ అమ్మల గురించి రాయండంటే రాసిన అమ్మ ప్రేమ మాటల మూటల్ని అద్భుతంగా అందిచ్చారు. పదహారుమంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ మూడు పుస్తకాలు సునందమ్మ సంపాదకత్వం.

**మా నాన్న హీరో :** ఇది ఇలా ఉంటే సయ్యద్ షఫీ గారు నాన్న గురించి రాయమంటే, విద్యార్థుల ద్వారానే ముఖాముఖి (ఇంటర్వ్యూ)గా మాట్లాడిన విద్యార్థుల ఇంటర్వ్యూలను "మా నాన్న హీరో"గా ప్రచురించారు. మోమినాన్ తెలుగు ఉపాధ్యాయులు షఫీ. నాన్న గొప్పతనం, మంచితనం, అలవాట్లు, లేని నాన్న గురించిన జ్ఞాపకాలు ఇందులో కన్పడుతాయి. కొన్ని విషయాలకు కన్నీళ్లు ఉబికి వస్తాయి.

**కవన కుసుమాలు:** అరవై రెండు కవితల సంకలనాన్ని వెలువరించింది. స్వర్ణసమత కాలూరు పాఠశాలలో. కుటుంబం, అత్త బాబాయి వంటి శీర్షికలతో, బంధాల గూర్చి అనుబంధాల గూర్చి రాయబడిన కవితలు. 'మా కుటుంబం ఆనందాల పొదరిల్లు' అని **రసజ్ఞ,** క్రీడలు శీర్షికలో, అక్షరాలతో ఆటలు / పదాలతో సయ్యాటలంటూ **యశ్వంత్** కవితలు చూడముచ్చట గొల్పుతాయి. అలతి అలతి పదాలతో వారు విన్న కన్న చదివిన పదాలతో తమ దైన శైలిలో రాసారు.

**"భాషా మకరందాలు":** పేర కథలు, కవితలు, పద్యాలు కదంబంగా వెలువరించిన వారు మంచినీళ్ల సరస్వతి అవధాని, ఆడపిల్ల'కు అన్ని అవకాశాలు కల్పించాలని వివక్షత వద్దని 'ఆడపిల్ల సౌభాగ్యం' కథ రాసిన చిన్నారి **సన్నోజి అక్షయ.**

పిల్లలు సమాజాన్ని గమనిస్తున్నారు. ఆలోచిస్తున్నారు, వివేచిస్తున్నారు. సాహిత్య ప్రక్రియాలక్షణాలు, శిల్పం, వస్తువు, శైలి అంటే తెలియకపోయిన, వారిలోని ఆలోచనలు ముందుంచుతున్నారు. వీరిని ప్రోత్సహించడం వలనే రాణిస్తున్నారు. ఆ తర్వాత తెల్సుకుంటున్నారు.

**హవేళిఘణపూర్ అమృత గుళికలు:** డీఈఓ ప్రొఫెసర్ డా॥ రాధాకిషన్ మాటల్లో అమ్మా నాన్న పావురం అంటూ గేయాలే కాకుండా, స్నేహం, చెట్లను రక్షించడం, నీతి, న్యాయం, ధర్మం అంటూ చక్కటి కథలల్ని నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు వారు. "హవేళిఘణపూర్ అమృత గుళికలు" 21 కథలు.11 కవితలు విద్యార్థులు రచించారు.

ఇవి వెలుగులోకి రావడం కారణం ప్రముఖ బాల సాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం కృషి. చెట్ల గొప్పతనం, ఆవశ్యకత వంటి అనేక అంశాలతో 'కనువిప్పు' గల్గే విధంగా రాసిన 'కథ చెట్ల మహిమ' దీన్ని రాసింది **సంగెపు కీర్తన.**

ప్రకృతిలో పక్షులు కూడా ఒక భాగమే. జీవవైవిధ్య పరిరక్షణలో పక్షుల పాత్ర గొప్పదని 'పక్షుల ప్రేమ' పేర ఆత్మీయతానురాగాలు, ప్రేమాభిమానాలు పక్షులు కూడా ఉంటాయని **ధరావత్ శ్రావణి** తన కథలో రాసింది.

**విద్యార్థి గళం:** ప్రపంచంలో ఏడు అద్భుతాలు / నాకు మాత్రం నువ్వే / అది పుస్తకం అంటూ పుస్తకం గొప్పతనాన్ని తనదైన మాటల్లో 'పుస్తకం' పేర కవిత రాసింది **యస్. రిషి.** 55 కవితల్లో 'విద్యార్థి గళం' పేర వెలువరించిన వారు వేనంక చక్రవర్తి. ఒకే ఒక్క పాఠశాల నుండి కాక వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి ప్రచురించారు.

యాస, బాసలకంటే ఆలోచనలకు పెద్దపీట వేయాలని, తగిన ప్రోత్సాహమిస్తే చక్కగా రాస్తారని తెల్పడానికి 'విద్యార్థి గళం' నిదర్శనం.

**మంత్రదండం:** మూఢనమ్మకాల్ని వమ్ముచేస్తూ శాస్త్రీయదృక్పథాన్ని చక్కగా కన్పరుస్తూ, విద్యార్థుల్లో నూతన చైతన్యం రావడానికి కృషిచేస్తూ నిరంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వెలువరించిన పద్దెనిమిది మంది విద్యార్థుల అద్భుత కథల సంకలనం "మంత్రదండం".

ఈ కథలు కాలక్షేపానికి కాదు, చక్కని సందేశాన్ని శాస్త్రీయ దృక్పథంతో జోడించడం వలన సాహిత్య ప్రయోజనం సిద్ధిస్తుందని, డా॥ జె. చెన్నయ్యగారు అభినందించారు.

తుమ్మిన, దగ్గిన, పిల్లి అడ్డం వచ్చిన వంటి శకునాలు, నమ్మకాలు వద్దని, ఆ శకునాల వల్ల వెళ్లే పనుల్లో, చేయబోయే పనులకు నష్టాలే కాని మరి ఏ ప్రయోజనం ఉండదని "తుమ్మా! ఉద్యోగమా!" కథలో సారాంశం. ఉద్యోగానికి వెళ్తున్న అమ్మాయిని తుమ్మిందని నాయనమ్మ వారిస్తే వెళ్లకుండా ఉంటే ఉద్యోగం రాకుండా పోయిందని ఆవేదన ఈ కథల్లో కన్పడుతుంది. మంత్రదండానికి సంపాదకత్వం వహించింది డా॥ ఉప్పలపద్మ, గుండ్రాంపల్లి ఉపాధ్యాయిని.

(తరువాయి వచ్చే సంచికలో)

–గరిపెల్లి అశోక్
m : 9849649101




# సృజనకారుల మధ్య బాలచెలిమి జాతీయ కథల పోటీలో ఎంపికైన కథల సంపుటాలు ఎనిమిది ఆవిష్కరణ


శాంతా సిన్హా


ఏనుగు నరసింహారెడ్డి


డా॥ రఘు


వేదకుమార్

బాలచెలిమి జాతీయ కథల పోటీలు మూడు విభాగాలుగా పిల్లలు రాసిన పిల్లల కథలు, పెద్దలు రాసిన పిల్లల కథలు, యువత రాసిన పిల్లల కథలుగా నిర్వహించింది. ఎంపికైన ఉత్తమ కథలను పిల్లలవి నాలుగు, పెద్దవాళ్ళవి మూడు, యువతది ఒకటి – మొత్తం ఎనిమిది సంపుటాలను ప్రచురించింది. ఈ పుస్తకాలను 23 డిసెంబర్ 2025 సాయంత్రం హైద్రబాద్ బుక్‌ఫెయిర్‌లో బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో శాంతా సిన్హా, ఏనుగు నరసింహారెడ్డి గార్లు ఆవిష్కరించారు.

వేదకుమార్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ కృషిని, కథల పోటీ వివరాలను, గ్రంథాలయ ఏర్పాట్లను వివరించారు. శాంతా సిన్హా మాట్లాడుతూ సోషల్ మీడియాకు పోటీగా బాల సాహిత్యం విరివిగా రావడం అభినందనీయ మన్నారు.

ఏనుగు నరసింహారెడ్డి గారి మాట్లాడుతూ ఒకప్పటికంటె ఈ రోజు బాల సాహిత్యం విరివిగా వస్తుందని, కథా వస్తువులో, చెప్పే తీరులో మార్పు రావలసి ఉందన్నారు. డా॥ రఘు మాట్లాడుతూ 8 సంపుటాలు మూడు తరాలకు సారధ్యం వహిస్తున్నాయన్నారు.

ఈ సభలో బాలాచారి, బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు యాకూబ్ పాల్గొన్నారు. బాలసాహితీవేత్తలు, కథల పోటీలో సహకరించిన వి.ఆర్. శర్మ, చొక్కాపు వెంకట రమణ, రాపోలు సుదర్శన్ గార్లను సత్కరించారు. ఈ సభలో జుగాష్ విలి, నీరజ అమరవాది, పైడిమర్రి గిరిజ, సయ్యద్ ఖైజర్ తదితరులు పాల్గొన్నారు. బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్ సభను పర్యవేక్షించారు.

–గరిపెల్లి అశోక్
m : 9849649101




## కన్నుల పండుగలా జరిగిన బాలచెలిమి జాతీయ కథల పోటీ

# విజేతలకు బహుమతి ప్రదానం



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి నిర్వహించిన జాతీయ కథల పోటీలో ఉత్తమ కథలుగా ఎంపికైన విజేతలకు బహుమతీ ప్రదాన సభ డిసెంబర్ 21 ఉదయం ఆక్స్‌ఫర్డ్ స్కూలులో బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా. రియాజ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ కార్యదర్శి రావి శారద, ఆత్మీయ అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ ఎస్. రఘు, చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్, ధనుంజయ, మాడభూషి లలితా దేవి గార్లను బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్‌గారు వేదిక పైకి ఆహ్వానించి సభను చివరి వరకు నిర్విఘ్నంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన వేదకుమార్ గారు మాట్లాడుతూ బాలసాహిత్య అభివృద్ధికి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చేసిన కృషి వివరించారు. బాలచెలిమి ముచ్చట్ల నుండి బాలచెలిమి పత్రిక, బాల చెలిమి గ్రంథాలయాల ఏర్పాటు వరకు జరిగిన కృషిని వివరించారు. 2020 నవంబర్ 19న మొదటి బాలచెలిమి గ్రంథాలయాన్ని పోచంపల్లిలో ఏర్పాటు చేసామని ఇప్పటి వరకు 21 గ్రంథాలయాలను ఏర్పాటు చేసామని ఈ రోజు మరో 20 గ్రంథాలయాలను ప్రారంభిస్తున్నామని అన్నారు. కరోనా సమయంలో కూడా మాస్కులు ధరించి గ్రంథాలయాలను ఉపయోగించుకున్న చిన్నారులను, ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే కథల పోటీలో పాల్గొన్న పిల్లలకు, పెద్దలకు, యువతకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసారు. బొమ్మలు వేసిన చిత్రకారులకు, న్యాయనిర్ణేతలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రేమపూర్వక ధన్యవాదాలు చెప్పారు. ఇక ముందు కూడా ఇలాగే కలిసి పని చేద్దామని చెప్పారు.

రావి శారదగారు మాట్లాడుతూ పుస్తకాలను ప్రేమించి, చదివించి, రాయించడం గొప్ప విషయమని, పిల్లలకు చదివే అలవాటు వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతుందని పద సంపద పెరుగుతుందనీ అన్నారు.

డా॥ రియాజ్ గారు మాట్లాడుతూ పిల్లలలో మూఢవిశ్వాసాలు కాక శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచాలని, హేతువాద దృక్పథం వ్యక్తులను మానవతావాదులుగా మారుస్తుందని, బాలచెలిమి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. బాలచెలిమికి ఆత్మీయమిత్రులు, శ్రేయోభిలాషి డా. రఘు మాట్లాడుతూ పిల్లల కోసం వేదకుమార్ గారు కృషిని శ్లాఘించారు. నేటి బాలల్ని రేపటి రచయితలుగా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ బాలచెలిమికి తనకు గల ఆత్మీయ సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కథలకు బొమ్మలు వేడంలోని సాధక బాధకాలను వివరించారు. పిల్లల స్థాయిలో ఆలోచించి బొమ్మలు వేస్తామని చెప్పారు.

మాడభూషి లలితా దేవిగారు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి బాలసాహిత్యం ఎంతగానో తోడ్పడుతుందనీ, బాలబాలికలకు కార్యశాలలు నిర్వహించి, ఎక్కువ సంఖ్యలో పోటీలు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. సభా ప్రారంభానికి ముందు డా॥ పైడిమర్రి గిరిజ గారు మాట్లాడుతూ బాలల కథలు ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయని, కథలతో పాటు పద్యాలు రాయడం సంతోషంగా ఉందని, పిల్లల పుస్తకాలు ఇతర భాషల్లోకి అనువాదం కావడం అభినందనీయమన్నారు. తడకపాత గ్రంథాలయ నిర్వాహకులు ప్రవీణశర్మగా మాట్లాడుతూ బాలచెలిమి గ్రంథాలయం వల్ల 14 పుస్తకాలు ప్రచురించడం జరిగిందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు కొమ్మువరపు కృష్ణయ్య గారు మాట్లాడుతూ మా పాఠశాలలో 490 మంది విద్యార్థులకు బాలచెలిమి గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడిందన్నారు.

పోటీలో ఎంపికైన రచయితలకు, చిత్రకారులకు, న్యాయనిర్ణేతలకు, డా॥ రియాజ్, రావి శారద, డా॥ రఘు గార్ల చేతుల మీదుగా సత్కారాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కన్నుల పండుగలా చాలా ఆత్మీయంగా కార్యక్రమం జరిగింది.

-గరిపెల్లి అశోక్
m : 9849649101

# పూటకూళ్ళవ్వ

(గత సంచిక తరువాయి)

(జరిగిన కథ: అమెరికా నుండి వచ్చిన రాజారాం అవ్వను కలవటానికి వస్తాడు. పిల్లలపై తల్లితండ్రులు చూపించే ప్రేమ గురించి, అలాగే పిల్లలు కూడా తల్లిదండ్రులకు ఎలా ఆసరాగా ఉండాలో తెలియ చెప్పడానికి.. అవ్వ దగ్గరికి వచ్చిన పిల్లలకు "జీవితమే ఒక దీపావళి" అనే కథ వినిపిస్తాడు రాజారాం.)

కథ మొత్తం వినగానే పిల్లలంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఒక్క సారిగా వారి మనసుల్లో కలిగి ఆలోచనలు, ఒక పశ్చాత్తాప ధోరణి, తమ అమ్మానాన్నలకు మనం కూడా నిజంగా ఏదో సాయం చేయాలన్న తపన.. అన్ని భావాలు వారి ముఖాల్లో స్పష్టంగా కనబడుతున్నాయి. అదంతా రాజారాం మరియు అవ్వ ఇద్దరూ గమనించారు. ఒకరి మొఖం ఒకరు చూసుకున్నారు. ఇక ఎలాంటి క్విజ్‌లు, ప్రశ్నలు అడగాలనిపించలేదు.

"మీరందరూ ఎంత మంచి పిల్లలో నాకు అర్థమైపోయింది. అందుకే మీ అందరికీ అమెరికా చాక్లెట్లు ఇస్తున్నాను తీసుకోండి" అంటూ పిల్లలందరికీ సమానంగా చాక్లెట్లు పంచాడు రాజారాం.

"థాంక్యూ రాజారాం తాతా" పిల్లలంతా సంతోషంగా రాజారాం వైపు తిరిగి షేక్ హ్యాండ్ ఇచ్చారు.

"ఓకే అవ్వా... మరి నేను వెళ్ళొస్తాను.. బై పిల్లలూ" అంటూ వెళ్లబోయాడు రాజారాం.

"ఆగు రాజారాం ఒక్క నిమిషం' అంటూ మెల్లగా రాజారాం ను ఇలా అడిగింది.. "ఇంతకీ ఇలా కథలు ఫైల్లో పెట్టుకుని తిరుగుతున్నావు ఏమిటి.. ఎందుకలా!? తన సందేహాన్ని బయటపెట్టింది అవ్వ.

"ఓ అదా! నీకు తెలుసు కదా నాకు మొదటి నుండి కథలంటే ఇష్టమని, కాకపోతే అప్పుడు చదివి వదిలిపెట్టివాడిని. ఇప్పుడు మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు కదా.. ఇలా మంచి కథలన్నీ ప్రింట్ తీసుకొని వాళ్లకు చెప్పటానికి నా దగ్గర పెట్టుకుంటాను" అని చెప్పి నవ్వుతూ వెళ్ళిపోయాడు రాజారాం.

"రాజారాం ఎప్పుడూ ఇంతే.. ఎంత సున్నిత మనస్కుడో.. అంతే సరదాగా ఉంటాడు. సందర్భానికనుగుణంగా కథలు జోక్స్ చెబుతుంటాడు. మంచి కథ చెప్పి పిల్లల్లో మార్పు తెచ్చాడు" అని తనలో. తనే అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది అవ్వ.

× × ×

తెల్లవారింది... ఆఫీస్ రూమ్‌లో టేబుల్ పైనున్న బిల్లులు, కొన్నింటి రశీదులు, గాలికి అటూ ఇటూ పడిపోయిన పేపర్లు అన్నీ సర్ది బయటికి వచ్చింది అవ్వ.

గేటు దగ్గర అలికిడి కావడంతో అటువైపు చూసింది అవ్వ, మధ్య వయసులో ఉన్న దంపతులిద్దరూ... వెంట ఇద్దరు పిల్లలు ఇటువైపే వస్తున్నారు.



దగ్గరికి రాగానే "బాగున్నావా అవ్వా!" అంటూ అవ్వను పలకరించారు.

ఆ గొంతు, ఆ పలకరింపు వినగానే వారిని శ్రద్ధగా చూసింది అవ్వ, వెంటనే గుర్తుపట్టింది. వాళ్ళని గుర్తుపట్టగానే అవ్వముఖంలో కంగారు కనబడింది. అది వాళ్ళు గమనించినా గమనించనట్టే ఉన్నారు.

"ఏంటి బాబు.. ఇలా వచ్చారు? చాన్నాళ్లయ్యే సరికి మొదట మిమ్మల్ని గుర్తుపట్టలేదు" అంది అవ్వ.

"అవును.. అవ్వా.. ఇటువైపు ఏమి పని పడక రాలేదు. ఇప్పుడు వంచనగిరి దగ్గర PDR పంక్షన్ హాల్ ఉంది కదా! అక్కడ రేపు పెళ్లి ఉంది. పెళ్లి వారిది నర్సంపేట.. కానీ పెళ్ళింట్లో అంతా హడావిడిగా ఉంటుంది. అంతే కాకుండా ఇక్కడైతే మేము సెపరేట్ రూమ్‌లో ఉండొచ్చు. ఫంక్షన్ హాల్‌కి కూడా దగ్గరవుతుందని డైరెక్ట్‌గా ఇటే వచ్చాము. గదులు ఖాళీగానే ఉన్నాయా? అవ్వ వైపు చూస్తూ అడిగారు.

"హా.. ఖాళీగానే ఉన్నాయి గది తాళం చెవి తెచ్చిస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది అవ్వ.

తాళం చెవి తెచ్చి వారి చేతిలో పెట్టింది. కానీ, అవ్వ మాత్రం ఏదో ఇబ్బంది పడుతున్నట్టే కనబడుతోంది.



వాళ్లు గది లోకి వెళ్ళగానే అవ్వ ఒక నిర్ణయానికి వచ్చింది.

గబగబా వెళ్లి ముఖ్యమైన ప్రదేశాల్లో తప్ప మిగతా చోట్ల ఉన్న నీటి పంపులు ఉన్న కనెక్షన్లు అన్నీబంద్ చేసింది. నీటి సరఫరాకు సంబంధించినవన్నీ జాగ్రత్తగా చూడ సాగింది. అవ్వతో భోజనం గురించి మాట్లాడదామని బయటికి వచ్చిన పిల్లల తండ్రి రవి ఇదంతా గమనించాడు. 'అంటే అవ్వ ఇంకా అప్పటి విషయాలు మర్చిపోలేదు. అన్న మాట.. అందుకే మా రాక కూడా ఇష్టం లేనట్టు కనబడింది" అనుకున్నాడు.

అప్పుడే అటుగా వచ్చిన అవ్వ.. రవిని చూసి "ఏం లేదు బాబు.. ఏదో అన్నీ సర్దుతున్నాను" అంది. వెంటనే గతంలో వీళ్ళు వచ్చినప్పటి విషయాలన్నీ కళ్ళలో మెదిలాయి.

"అప్పుడు పిల్లలు నీళ్లతో ఎంత హంగామా చేశారు! చీటికిమాటికి నల్లాలు తిప్పడం, నీళ్లు అన్ని వస్ట్ చేయడం.. పోనీలే అనుకుంటే అక్కడున్న మగ్గులతో, చెంబులతో ఎక్కడపడితే అక్కడ నీళ్లు కుమ్మరించడం.. అదీ పోనీలే అనుకుంటే.. విడిదికి వచ్చిన పిల్లలు, పెద్దలు జారీ పడటం.. దానివల్ల అందరూ ఇబ్బంది పడటం.. ఇవన్నీ గుర్తొచ్చి వీళ్లను చూడగానే కంగారుపడి జాగ్రత్త పడటం మొదలుపెట్టింది.

"అవ్వా! నాకు అన్నీ అర్థం అవుతున్నాయి కానీ, మీరు ఈసారి అలాంటి భయాలు ఏమి పెట్టుకోవద్దు" అన్నాడు రవి.

ఆశ్చర్యంగా చూసింది అవ్వ..

'అవును అవ్వా! నువ్వు విన్నది నిజమే. పిల్లలు ఇప్పుడు ఈ విషయంలో చాలా మారిపోయారు. ఎలాగో తెలుసా! ఆ మధ్యలో మేమంతా కలిసి సరదాగా ఎటైనా వెళ్తామని బయలుదేరాం. దారిలో ఉండగానే "MONTHA" తుఫాను మొదలైంది. అటు ఇటు కానీ ప్రదేశంలో ట్రాఫిక్ జామ్ అయింది. దారి అంతా సరిగా కావటానికి సుమారు ఒక పూట పట్టింది. పిల్లలు చిరుతిళ్లు తింటూ మా వద్ద ఉన్న నీళ్లన్నీ తాగేసారు. మళ్లీ కావాలంటే ఒక్క నీటి చుక్క కూడా దొరకలేదు. అక్కడున్న అందరి పరిస్థితి అలాగే ఉంది. పిల్లలు కూడా కొంచెం పెద్ద వాళ్ళు అవటంతో అది సమయంలో నీటి విలువ గురించి, వాటిని వృథా చేయకుండా ఎలా కాపాడుకోవాలో, చుట్టూ ఉన్న వాళ్ళు కూడా ఎంత ఇబ్బంది పడుతున్నారో. అన్నీ వివరించి చెప్పేసరికి వాళ్లకు కూడా ఇన్నాళ్లు ఎంత తప్పు చేసారో అర్థమయింది. ఇకనుండి అలా చేయమని మాట కూడా ఇచ్చారు. అలాంటి అవకాశం దొరికినా కూడా ఇప్పటివరకు మళ్లీ అలా చేయలేదు" అంటూ విషయమంతా వివరించాడు రవి.

అంతా విన్న అవ్వ "హమ్మయ్య' అనుకుంది. 'మొత్తానికి ఒక తుఫాను పిల్లల్లో ఇలాంటి మంచి మార్పు కూడా తెచ్చింది" అనుకొని ఆశ్చర్యపోయింది.

× × ×

(మిగతా కథ వచ్చే సంచికలో)

– మాదారపు వాణిశ్రీ

ఫోన్ : 9247286668

బొమ్మలు: కైరం బాబు

# Singareni *Goes* GLOBAL

*From Coal to Clean Energy*


Strut Pit Colliery-YLD


Eco-Friendly Coal Mining, YLD Area – Koyagudem OC


Coal Production by shovel dumper combination

**70** MT Coal **PRODUCTION**

**Eco Friendly Mining &** many more Green Energy Initiatives


Singareni Thermal Power Plant

**1200** MW **THERMAL**

**245.5** MW **SOLAR**


$CO_2$ to Methanol Pilot Plant


Singareni Floating Solar Power Plant

Since 1889

**The Singareni Collieries Company Limited**

(A Government Company)

Kothagudem, Bhadradri Kothagudem District, Telangana, 507101

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - December 2025
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

## VOL 14వ వసంతంలో 161 ISSUES నూట అరవై ఒకటవ సంచిక పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



## దక్కన్ ల్యాండ్ పదమూడు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 జనవరి సంచికతో 161 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar